

రెండు మహానగరాలు
రూ॥250/-
పేజీలు:245
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ



తెహెల్కా మాజీ సంపాదకుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష 07
విరాళాల స్వీకారణలో డిఎంకె టాప్
సైబర్ నేరాల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నెంబర్ 1 10



సంపుటి 29, సంచిక: 49 | శుక్రవారం | 07-08-2026 | హైదరాబాద్ | Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00


మునుగోడులో..



ఏడూళ్ల బయ్యారంలో...



# బద్లావ్ జరూరీ హై

## మోదీ సర్కార్ ప్రజాకంటక పాలనను ఎండగడుతూ సిపిఐ పాదయాత్రలు షురూ

**రాష్ట్రవ్యాప్తంగా వీధుల్లో కదంతొక్కిన కమ్యూనిస్టులు** | **అడుగడుగునా ఆదరించిన ప్రజలు**

**కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కార్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ యువత, విద్యార్థులు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు 'బద్లావ్ జరూరీ హై' పేరుతో గురువారం పాదయాత్రలు ప్రారంభమయ్యాయి. ఈ యాత్రలు ఈనెల 14వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. రాష్ట్రంలో తొలి రోజు యాత్రలను నల్లగొండ జిల్లా మునుగోడులో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హనుమకొండలో, రాష్ట్ర మరో సహాయ కార్యదర్శి ఇటి నరసింహ హైదరాబాద్‌లో, సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి కరీంనగర్‌లో, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ మంచిర్యాలలో, బాగం హేమంతరావు ఖమ్మంలో, ఎం బాలనర్సింహ నాగర్‌కర్నూల్‌లో, విఎస్ బోస్ ఇసిఐఎల్‌లో, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మునుగోడులో పార్టీ శ్రేణులతో కదంతొక్కారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన పాదయాత్రల్లో మదనపల్లిలో సిపిఐ సీనియర్ నాయకులు కె.నారాయణ, విజయవాడలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య నాయకత్వం వహించారు. దేశంలో పెరుగుతున్న ధరలను తక్షణమే అరికట్టాలని, ప్రతీ యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టభద్రత కల్పించాలని, కార్మికుల హక్కులు పరిరక్షించాలని, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని సిపిఐ శ్రేణులు నినదించారు.**

## దేశంలో దొంగల రాజ్యం

- మార్పు అత్యవసరం
- కేంద్రంలోని బిజెపి ప్రజావ్యతిరేక విధానాలు తిప్పి కొడదాం
- యువత పోరాటంతో దిగొచ్చిన మోదీ సర్కార్
- ప్రజా ప్రయోజనాల కోసం కడదాకా పోరాడేది కమ్యూనిస్టులే : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/హనుమకొండ/హైదరాబాద్

బిజెపి రూపంలో దేశంలో దొంగల రాజ్యం సాగుతోందని, వారి నుంచి భారత్‌ను కాపాడుకొని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు మార్పు కావాలని, మార్పు అనివార్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మార్పు కోసమే పోరాటం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కేంద్రంలో నానాటికీ పెరిగిపోతున్న బిజెపి ప్రజావ్యతిరేక పాలనను నిరశిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా ప్రజాచైతన్య యాత్ర గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ పరిధిలోని ఏడూళ్లబయ్యారం గ్రామంలో కూనంనేని సిపిఐ జెండాను ఊపి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆ గ్రామంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఎఐటియుసి జెండాను, బయ్యారం క్రాస్ రోడ్‌లోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. సెంటర్‌లోని కొమరం భీమ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. తొలిరోజు బయ్యారం క్రాస్‌రోడ్ మీదుగా రామానుజవరం, మణుగూరు, అశ్వాపురం, మొండికుంట వరకు ప్రజాచైతన్యయాత్ర సాగింది. యాత్రకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. డప్పు వాయిద్యాలు నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, మోదీ అనుకూల కార్పోరేట్ శక్తుల రూపంలో దేశంలో దొంగల రాజ్యం సాగుతోందన్నారు. దేశ ప్రజల సంపదను కారుచౌకగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజీ దొంగలు, ప్రజాధనాన్ని కారుచౌకగా దోచుకునే బడా చోరులు, పరిశ్రమల్లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో సిఎంఆర్ఎఫ్ నిధుల మాయలో, విద్య వైద్యం ప్రైవేటు వంటి దొంగల రాజ్యం దేశంలో నిసిగ్గుగా సాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దొంగలందరినీ పెంచి పోషిస్తున్న మోదీ భరతం త్వరలోనే పడతామని చెప్పారు. నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా వాటిని అదుపు చేయలేకపోతున్నారని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన

తరువాయి 8లో

### మత విద్వేష రాజకీయాలతో ప్రజాసమస్యలు పక్కదారి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం /మునుగోడు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టేందుకు సిపిఐ దేశవ్యాప్తంగా ప్రచార జీపు యాత్రలు నిర్వహిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం మునుగోడు మండల కేంద్రంలో సిపిఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రచార జీపు యాత్రను జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, మత విద్వేషాలను రెచ్చగొడుతూ తన వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి యువతను మోసం చేశారని, నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడారని మండిపడ్డారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం దేశ విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల హామీల అమలులో జాప్యం చేస్తోందని పేర్కొన్న వారు, నల్లగొండ జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన ఎస్ఎల్‌బిసి,డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ ప్రాజెక్టులు పూర్తయితేనే జిల్లాలో సాగు,

తరువాయి 8లో




హైదరాబాద్‌లో..



కరీంనగర్‌లో...



హనుమకొండలో..

## కొత్త లామినేటెడ్ రేషన్ కార్డులు పంద్రాగస్టు నుంచి పంపిణీ

సంగారెడ్డిలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల మందికి అందించనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఈనెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ నుంచి కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కొత్త లామినేటెడ్ రేషన్ కార్డులను అందించనుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి గురువారం అధికారిక మెమో జారీ

తరువాయి 8లో

## వచ్చే నెలలో 'క్యా బోల్తీ పబ్లిక్'

ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించిన సిజెపి

దేశంలో ప్రస్తుత పరిస్థితులపై ప్రజల అభిప్రాయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటామని వెల్లడి



**ఛత్రపతి సంభాజీనగర్ :** 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) మరో ప్రచారానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ప్రజలతో మమేకమవ్వడానికి, వారి సమస్యలను తెలుసుకోవడానికి 'క్యా బోల్తీ పబ్లిక్' (ప్రజలేమంటారు?) అనే ప్రచార కార్యక్రమాన్ని వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం ప్రకటించారు. మహారాష్ట్రలోని తన స్వస్థలమైన ఛత్రపతి సంభాజీనగర్‌లో పార్టీ కోర్ కమిటీ సమావేశం బుధ, గురువారాల్లో జరిగింది. సమావేశాలు ముగిసిన అనంతరం విలేకరుల సమావేశంలో

తరువాయి 8లో

## మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు

తొలిదశ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సియా

200 హెక్టార్ల పరిధిలో అభివృద్ధి పనులు

రూ.100 అడుగుల రోడ్లు, వ్యూయింగ్ డెక్స్, పార్కుల ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి (మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్) ప్రాజెక్టుకు కీలక ముందడుగు పడింది. నగర అభివృద్ధిలో నూతన ఒరవడిగా ప్రభుత్వం భావిస్తున్న ఈ ప్రాజెక్టు మొదటి దశ (ఫేజ్1)కు పర్యావరణ అనుమతి లభించింది. తెలంగాణ రాష్ట్ర పర్యావరణ ప్రభావ మదింపు ప్రాధికార సంస్థ (సియా) ఆగస్టు 5న ఏరియా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కేటగిరీ కింద ఈ ప్రాజెక్టుకు ముందస్తు పర్యావరణ అనుమతి మంజూరు చేసింది.

**రెండు విభాగాలుగా ఫేజ్-1**

ఫేజ్1లో రెండు ఉప విభాగాలు ఉన్నాయి. హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.2 కిలోమీటర్ల మేర విస్తరించిన ఫేజ్1ఏ, ఉస్మాన్సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.3 కిలోమీటర్ల మేర

తరువాయి 8లో

# సోషల్ మీడియాపై నియంత్రణకు కేంద్రం ఎత్తులు?

నీట్ పేపర్ లీకేజీ ఉద్యమంలో వాస్తవాలను ప్రజలకు చేర్చడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించింది. ప్రధానంగా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా తమ నిరసనలను సృజనాత్మకంగా, జూలై 20న పోలీసుల దమనకాండ దృశ్యాలను కళ్ళకు కట్టినట్లుగా ప్రపంచం ముందుంచింది. అలాంటి సోషల్ మీడియాను పరోక్షంగా నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం అడ్డదోవన పన్నాగాలు పన్నుతున్నట్లు తాజా పరిణామాలు తెలియజేస్తున్నాయి. జంతర్ మంతర్ పరిణామాల తదనంతరం ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేసిన వీడియో సందేశాన్ని ఆయన ఫేస్ బుక్ ఖాతాలో కొంత సేపు నిలిపివేశారు. దీనిపై ప్రభుత్వ వర్గాలు సోషల్ మీడియా యజమాని అయిన 'మెటా' సంస్థను ప్రశ్నించటంతో సాంకేతిక కారణాలతో పొరపాటు జరిగిందని ఐదు గంటల తరువాత ఆ వీడియోను పునరుద్ధరించారు. అయితే, అప్పటికే ఆ వీడియో ఇతర సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రజలకైతే చేరింది. కానీ, ప్రభుత్వ పెద్దలు అంతటితో ఆగలేదు. జంతర్ మంతర్ ఉద్యమం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్ళడంలో సోషల్ మీడియానే ప్రధాన భూమిక పోషించిన విషయం వారి మదిలో మెరమెర అం టూనే ఉంది. అందుకే ప్రధాని వీడియోను ఆపేశారనే సాకుతో ఎలాగైనా సోషల్ మీడియా యాజమాన్యాలను లొంగదీసుకోవాలనే తలంపుకొచ్చినట్లు అర్థమవుతోంది. ప్రధాని ప్రసంగ వీడియో నిలిపివేత నేపథ్యంలో మెటా, గూగుల్, యూట్యూబ్, స్నాప్ తదితర సోషల్ మీడియా వేదికల నిర్వాకులకు బిజెపి ఎంపి నిశికాంత్ దూబే నేతృత్వంలోని కమ్యూనికేషన్స్, ఐటి పార్లమెంటరీ స్థాయీ సంఘం సోమవారం నాడు సమన్లు జారీ చేసింది. ఇదే స్థాయీ సంఘ సభ్యుడైన కాంగ్రెస్ ఎంపి షఫి పరంబిల్ సాంకేతికతను నియంత్రించాలే తప్ప ప్రజాస్వామ్యాన్ని కాదని తన వాదనను స్ప ష్టంగా వినిపించారు. రాజకీయ ఒత్తిళ్ళకు అనుగుణంగా లేదా చట్టబద్ధమైన అసమ్మతిని నేరపూరితం చేయటం ద్వారా విషయాన్ని(కంటెట్‌ను) నియంత్రించవద్దని నొక్కి చెప్పినట్లుగా వార్తలు వచ్చాయి. అయినప్పటికీ, ప్రభుత్వం పంతం వీడలేదు. మూడు రోజుల లోగా 'మెటా' ఛీఫ్ మార్క్ జ్యూకర్‌బెర్గ్ క్షమాపణ చెప్పాలని, లేదంటే థర్ట్ పార్టీ కంటెంట్ విషయంలో మెటాకు కల్పించిన చట్టపరమైన రక్షణలు తొలగిస్తామని స్థాయీ సంఘం చైర్మన్ నిశికాంత్ దూబే హెచ్చరికలు జారీ చేశారు. ఇదంతా జరుగుతుండగానే గ్లోబల్ అఫైర్స్ ఆఫీసర్ జోయెల్ కప్లన్ నేతృత్వంలోని 'మెటా' ప్రతినిధి బృందం మంగళ, బుధవారాలలో ప్రభుత్వ అధికారులు, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వివరణిచ్చుకుంది. మెటా తరుపున క్షమాపణను తెలియజేసింది. కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో జంతర్‌మంతర్ నిరసనలకు ఇన్‌స్టాగ్రామ్ పెద్ద ఎత్తున ప్రాధాన్యత నివ్వడంపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక సమాచారాన్ని కట్టడి చేయడమే దీని ఉద్దేశ్యమని వేరే చెప్పనక్కర్లేదు. సమావేశం జరిగిన మరుసటి రోజే తమ ఖాతా నుంచి ప్రభుత్వ వ్యతిరేక కంటెంట్ ను ఇన్‌స్టాగ్రామ్ తమ ఖాతా నుంచి తొలగించినట్లు పలువురు నెటిజెన్‌లు స్క్రీన్ షాట్‌లను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఇందుకు ఊతమిస్తోంది. అలాగే జంతర్‌మంతర్ నిరసన, లాఠీఛార్జీల వీడియోలు కూడా చాలా వరకు ఇప్పుడు సోషల్ మీడియాలో మాయమయ్యాయి.

'మెటా'నే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో లోతుగా పరిశీలిస్తే అర్థమవుతోంది. జెన్ జీ తరం ఎక్కువగా వినియోగించే 'ఇన్‌స్టాగ్రామ్', వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర యాప్‌లకు యజమాని 'మెటా'నే కావడం విశేషం. భారతదేశంలో వాట్సాప్‌ను సుమారు 57 కోట్లు, ఇన్‌స్టాగ్రామ్‌ను 48 కోట్లు, ఫేస్‌బుక్‌ను 40 కోట్లకుపైగా వినియోగిస్తున్నారు. ప్రపంచంలోనే భారతదేశంలో అత్యధిక సోషల్ మీడియా వినియోగదారులు కలిగిన 'మెటా'ను అందుకే ఎంచుకున్నారు. సోషల్ మీడియా సంస్థలను లొంగదీసుకొని, పరోక్ష పద్ధతిలో అసమ్మతి, నిరసనలను ప్రజలకు చేరకుండా పాలకులు పరోక్షంగా గొంతునొక్కే ప్రయత్నం కనపడుతున్నది. అయితే, హైదరాబాద్‌లో మెటా సంస్థపై నమోదైన కేసును కేంద్ర ప్రభుత్వం ఆసరా తీసుకోవడం గమనార్హం. ఆ కేసును నమోదు చేసిన పోలీసు అధికారి బదిలీ అవడం, దానిపై కాంగ్రెస్, బిజెపిల మధ్య మాటల యుద్ధం సాగుతుండడం వేరే విషయం. నిజానికి సోషల్ మీడియాపైనే యువత ఆధారపడడానికి అసలు కారణం ప్రధాన స్రవంతి మీడియా వైఫల్యాన్ని జంతర్‌మంతర్ ఉద్యమం ఎత్తిచూపుతున్నది. నీట్ లీకేజీకి వ్యతిరేకంగా దాదాపు నెల రోజులు పార్లమెంటు సమీపంలో నిరసన, నిరశనలు చేపట్టినా ప్రభుత్వం అహంకారపూరిత మొండి పట్టుదలకు పోయింది. పరాకాష్ఠగా జూలై 20న 'సంసద్ చలో'కు దేశమంతటి నుంచి తరలివచ్చిన వచ్చిన యువతీయువకులపై కేంద్రం ఆధీనంలోని ఢిల్లీ పోలీసులు, బలగాలు పైశాచికంగా విరుచుకుపడిన తీరు దేశ స్మృతిపథం నుంచి ఇంకా చెరిగిపోలేదు. అణిచివేస్తే తోకముడుస్తారనుకున్న యువత అంతే పట్టుదలతో కేంద్రంపై శాంతియుత ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో దిగొచ్చి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే, ఈ మొత్తం వ్యవహారంలో జాతీయ మీడియా వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు గురైంది. యువత ఆందోళనను చూపకుండా, నెల రోజులూ కేంద్ర ప్రభుత్వ వర్గాల ప్రవచనాలనే వల్లిస్తూ, జంతర్‌మంతర్ వైపు కన్నెత్తి చూడలేదు. యువతపై పోలీసుల అమానుష దాడి జరిగిన దృశ్యాలు కూడా చూపక, ఉల్టా పోలీసులపైనే వారు దాడి చేశారంటూ ప్రసారాలు చేయడం యువత ఆగ్రహాన్ని మరింత పెంచింది. ప్రధాన స్రవంతి మీడియా విస్మరించినప్పటికీ, జంతర్‌మంతర్ నిరసన, నిరశనలో ఉన్న సోనమ్ వాంగ్‌చుక్‌ను మార్బలంతో అక్రమ తరలింపు, అన్నిటికి మించి జూలై 20న యువత, ప్రత్యేకించి యువతులపై పోలీసులు, కేంద్ర బలగాల దాష్టీకాన్ని దేశ ప్రజలకు చేర్చడంలో జెన్ జీ యువత సఫలీకృతమైంది. ఇందుకు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, స్నాప్ చాట్‌లు ఆసరా అయ్యాయి. ఇంత జరిగినా కేంద్ర ప్రభుత్వ తీరు మారలేదు. రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను మరుసటి రోజే పార్లమెంటు ప్రాంగణంలో తలపాగా పెట్టి, దండలు వేసి మరీ బిజెపి ఎంపిలు స్వాగతం పలికారు. యువతపై కేసుల పరంపరను కొనసాగించారు. చీకటి గదిలో పెట్టి కొడితే పిల్లైనా తిరగబడుతోందనేది లోకోక్తి. ఇప్పటికే 'సంసద్ చలో'లో బాష్పవాయువులు, లాఠీల దెబ్బలతో తమ భయం పోయిందని యువత గర్వంగా చెప్పకుంటోంది. అయినప్పటికీ, గుణపాఠం నేర్వని పాలకులు అసమ్మతి వినిపించేందుకు ఉన్న కొద్ది అవకాశాలను సైతం కాలరాసే కుతంత్రాలు సాగించటం నిరంకుశత్వానికి పరాకాష్ఠ. ప్రజాస్వామ్యానికి భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రతిపక్షం, అసమ్మతి, నిరసనలు ప్రాణవాయువు వంటివి. వాటిని తొక్కిపెట్టిన భయంకరమైన నియంతలు కాలగర్భంలో కలిసిపోయినట్లు చరిత్ర చెబుతోంది.



## సభకు రమ్మంటున్నారని హోం మంత్రికి చెప్పండి

**హోం మంత్రి (అమిత్ షా)ని సభకు రావాలని ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే కోరుతున్నారు. ఆయన అభ్యర్థనను పరిశీలించవలసిందిగా నేను మిమ్మల్ని(కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజును) కోరుతున్నాను. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా ప్రతిపక్షం అభిప్రాయాలను లేదా భావనలను మీరు హోం మంత్రికి తెలియజేయవచ్చు. ఖర్గే ఏమీ శాసించడం లేదు. కేవలం ఆయన అభ్యర్ధనను, ప్రతిపక్ష భావనలను మాత్రమే వ్యక్తం చేశారు. కాబట్టి, ఆ భావనలను మీరు హోం మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని నా విన్నపం.**

గురువారం సభలో రాజ్యసభ చైర్మన్
సి.పి.రాధాకృష్ణన్

# 'క్విట్ ఇండియా' నినాద రూపకర్త: యూసఫ్ మెహర్ అలీ

చరిత్రలో కొన్ని పదాలు కాలపరీక్షకు తట్టుకుని శాశ్వతంగా నిలిచిపోతాయి. అవి కేవలం అక్షరాల సమాహారంగా మిగిలిపోవు; ఒక కాలపు ఆవేదనకు స్వరమవుతాయి, ఒక జాతి ఆత్మవిశ్వాసాన్ని మేల్కొలిపే పిలుపుగా మారతాయి. 'క్విట్ ఇండియా!' కేవలం రెండు పదాలు. కానీ ఆ రెండు పదాలే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సవాలు చేశాయి. బానిసత్వపు సంకెళ్లను తెంచుకోవాలన్న భారతీయుల అచంచల సంకల్పానికి ప్రతీకగా నిలిచాయి. దేశమంతా ఆ నినాదం మారుమోగినప్పుడు ప్రతి గ్రామం ఉద్యమ కేంద్రంగా, ప్రతి వీధి స్వాతంత్ర్య పోరాట వేదికగా రూపాంతరం చెందింది. స్వేచ్ఛ ఇక వాయిదా వేయలేని లక్ష్యమని భారతీయ సమాజం స్పష్టంగా గ్రహించింది. ఈ చారిత్రక నినాదం వినగానే మనకు ముందుగా గుర్తుకొచ్చేది మహాత్మా గాంధీ. అయితే ఆ పదాలను తొలిసారిగా మలిచిన వ్యక్తి యూసఫ్ మెహర్ అలీ. భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను ప్రభావితం చేసిన అత్యంత శక్తివంతమైన నినాదాలకు రూపకర్త అయిన ఈ నాయకుడు, తన సేవలకు చరిత్రలో తగిన గుర్తింపును పొందకపోవడం విచారకరం. 1903 సెప్టెంబర్ 23న బొంబాయిలోని ఒక సంపన్న, విద్యావంతమైన కుటుంబంలో జన్మించిన యూసఫ్ మెహర్ అలీ న్యాయశాస్త్రంలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. విజయవంతమైన న్యాయవాదిగా సౌకర్యవంతమైన జీవితం గడిపే అవకాశం ఉన్నప్పటికీ, వ్యక్తిగత అభివృద్ధికంటే దేశ విముక్తినే తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారు. న్యాయస్థానాల్లో వాదనలు వినిపించడం కంటే ప్రజల హక్కుల కోసం వీధుల్లో పోరాడడమే తన ధర్మమని భావించారు. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న వలసవాద వ్యతిరేక ఉద్యమాలు, కార్మిక పోరాటాలు ఆయన ఆలోచనలను ప్రభావితం చేశాయి. ఆయన దృష్టిలో సామ్యవాదం అంటే కేవలం ఆర్థిక సిద్ధాంతం కాదు; ప్రతి మనిషి గౌరవంగా జీవించే సమాజాన్ని నిర్మించే విలువల వ్యవస్థ. అప్పుల బంధనాల నుంచి రైతు విముక్తి పొందాలని, కార్మికుడికి న్యాయమైన వేతనం లభించాలని, కులమతాల గోడలు సమాజాన్ని విభజించకూడదని ఆయన విశ్వసించారు. ఈ ఆలోచనలే విద్యార్థులు, కార్మికులు, యువతను ఒకే ఉద్యమ వేదికపైకి తీసుకువచ్చే నాయకుడిగా ఆయనను నిలబెట్టాయి.



ప్రజలను సంఘటితం చేయాలంటే సరళమైన, పదునైన భాష అవసరమని మెహర్ అలీ తొలినాళ్లలోనే గ్రహించారు. గంటలకొద్దీ సాగే ప్రసంగాల కంటే, ఒక చిన్న నినాదమే లక్షలాది మందిని ఒక్క క్షణంలో ఏకం చేయగలదని ఆయన నమ్మారు.

1928లో భారతీయుల ప్రమేయం లేకుండా బ్రిటిష్ ప్రభుత్వం సైమన్ కమిషన్‌ను నియమించడంతో దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. ఆ సమయంలో బొంబాయి వీధుల్లో ఆయన వినిపించిన 'సైమన్ గో బ్యాక్' నినాదం క్షణాల్లో దేశమంతా వ్యాపించింది. విద్యార్థుల నుంచి కార్మికుల వరకు, సభల నుంచి గోడ రాతల వరకు అదే నిరసనకు ప్రతీకగా మారింది. 1942 నాటికి రెండో ప్రపంచ యుద్ధం, బ్రిటిష్ పాలకుల నిర్లక్ష్యం, స్వాతంత్ర్య ఆకాంక్ష దేశాన్ని కీలక మలుపు వద్దకు తీసుకొచ్చాయి. అలాంటి సమయంలో మెహర్ అలీ మలిచిన 'క్విట్ ఇండియా' నినాదం బ్రిటిష్ పాలనకు నేరుగా విసిరిన సవాలుగా నిలిచింది. ఆ పదబంధంలోని స్పష్టతను, ఉద్యమశక్తిని మహాత్మా గాంధీ వెంటనే గుర్తించి స్వీకరించారు. 1942 ఆగస్టు 8న గాంధీజీ ఇచ్చిన 'చావో రేవో' (డూ ఆర్ డై ) పిలుపుతో కలసి 'క్విట్ ఇండియా' భారత స్వాతంత్ర్య పోరాటానికి తుది సమర ఘంటికగా మారింది.

ప్రజలను ఉద్యమబాట పట్టించగల అసాధారణ నాయకుడిగా భావించిన బ్రిటిష్ పాలకులు ఆయనను పలుమార్లు జైలుకు పంపారు. అయితే జైలు గోడలు ఆయన ఆలోచనలను నిర్బంధించలేకపోయాయి. స్వాతంత్ర్యం అనంతరం నిర్మించాల్సిన ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, పేదరిక నిర్మూలన వంటి అంశాలపై ఆయన అక్కడే లోతుగా ఆలోచించారు. తరువాత ముంబయి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మెహర్ అలీ ఉద్యమ స్ఫూర్తినే పరిపాలనలోనూ ప్రతిబింబించారు. నగర అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదని, సాధారణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలేనని నమ్మారు. ప్రజా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, సామాజిక న్యాయానికి ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. నిరంతర ఉద్యమాలు, జైలు జీవితం ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీశాయి. స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది కాలానికే, కేవలం 47 ఏళ్ల వయసులో ఆయన కన్నుమూశారు. జీవితం చిన్నదైనా, ఆయన ఆలోచనలు, నినాదాలు భారత చరిత్రలో శాశ్వత ముద్ర వేశాయి. విచిత్రమేమిటంటే, 'క్విట్ ఇండియా', 'సైమన్ గో బ్యాక్' వంటి నినాదాలు ప్రతి భారతీయుడికి సుపరిచితమైనప్పటికీ, వాటి రూపకర్త యూసఫ్ మెహర్ అలీ పేరు మాత్రం అంతగా ప్రజల్లో ప్రాచుర్యం పొందలేదు. అధికారాన్ని ఆశించని, కీర్తి కోసం పరుగులు తీయని ఆయన తనకోసం స్మారకాలు నిర్మించుకోలేదు; ఒక జాతి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే పదాలను మాత్రం సృష్టించి వెళ్లారు. అందుకే నేడు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని స్మరించుకోవడం అంటే కేవలం ఒక చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకోవడం కాదు; స్వేచ్ఛను ఒక సమర నినాదంగా మలిచిన ఆ మేధావిని, సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ అసమాన త్యాగధనుడిని గౌరవించుకోవడమే.

**– ఎండి. ఉస్మాన్ ఖాన్**

# ఉత్తర తెలంగాణలో ప్రయాణికుల రైళ్ల పట్ల నిర్లక్ష్యం

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్ ఎంతో విస్తీర్ణం కలిగి ఉన్నప్పటికీ, ఉత్తర తెలంగాణ ప్రజల రైల్వే అవసరాల పట్ల సంవత్సరాలుగా నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోంది. ప్రజలు కొత్త రైళ్లు, రైళ్ల పొడిగింపులు, అదనపు బోగీలు, మెరుగైన సౌకర్యాలు కోరితే ప్రతిసారి వినిపించే సమాధానాలు మూడు మాత్రమే – 'రైల్వే లైన్ రద్దీగా ఉంది', 'బొగ్గు రవాణాకు ప్రాధాన్యం', 'సింగిల్ లైన్'. సమస్యలకు పరిష్కారం చూపాల్సిన చోట, ఇవే కారణాలను పదే పదే చెప్పడం ప్రజల ఆకాంక్షలను నిర్లక్ష్యం చేయడమే. దక్షిణ మధ్య రైల్వే లోని హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల వారి ప్రాధాన్యత ప్రయాణికులు కాగా, సికింద్రాబాద్‌లో వారి ప్రాధాన్యత రవాణా మాత్రమే. ప్రత్యేకించి సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో సిర్పూర్ కాగజ్‌నగర్, భద్రాచలం రోడ్ మణుగూరు నుంచి చర్లపల్లి, సికింద్రాబాద్ లేదా లింగంపల్లి మార్గంలో కొత్త రైళ్లు నడపాలన్నా, రైళ్లను పొడిగించాలన్నా ఇదే సమాధానం వస్తోంది. సికింద్రాబాద్–కాజీపేట జంక్షన్ రైల్వే లైన్ రద్దీగా ఉంది, కాజీపేట జంక్షన్ –భద్రాచలం రోడ్ మార్గం బొగ్గు రవాణాకు కీలకమైనదని, కాజీపేట జంక్షన్ –సిర్పూర్ మార్గం బొగ్గు రవాణా, సిమెంట్, ఆటోమొబైల్స్, వ్యవసాయ సరుకు రవాణాకు కీలకమైనదని. దోర్నకల్ జంక్షన్–భద్రాచలం రోడ్ వరకు సింగిల్ లైన్ బొగ్గు రవాణా కీలకం అని చెబుతూ ప్రజల అవసరాలను పక్కన పెడుతున్నారు. అయితే ఇదే సమయంలో బీబీనగర్–గుంటూరు మార్గంలో కూడా సింగిల్ లైన్ ఉన్నప్పటికీ ప్రతిరోజూ నలభైకి పైగా ప్రయాణికుల రైళ్లు, బొగ్గు, సిమెంట్,ఆహార ధాన్యాలు (ఎఫ్‌సిఐ),ఇనుము –ఉక్కు, ఎరువులు, సాధారణ పారిశ్రామిక వస్తువుల రవాణా ఉన్నా, విజయవంతంగా నడుస్తున్నాయి. అక్కడ సాధ్యమైతే, ఇక్కడ ఎందుకు సాధ్యం కాదనే ప్రశ్నకు సమాధానం లేదు. రైల్ నిలయం లేదా డిఆర్‌ఎం కార్యాలయానికి అధికారులను కలిసి వినతి పత్రం అందించేందుకు వెళితే, వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. గ్రీవెన్స్ సమయాల్లో వెళ్లినా అధికారులను కలిసే అవకాశం దాదాపు ఉండదు. 'అధికారి బిజీగా ఉన్నారు... డిస్పాచ్ సెక్షన్‌లో ఇవ్వండి' అనే సమాధానమే వస్తుంది. డిస్పాచ్ విభాగంలో వినతి పత్రం సమర్పించినా, నెలలు గడిచినా ఎలాంటి స్పందన ఉండదు. కనీసం చర్యల పురోగతి తెలియజేయరు. ప్రజల సమస్యలు వినడానికి ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ వ్యవస్థ ప్రజలకు అందుబాటులో లేకపోతే, ఆ వ్యవస్థ ఉద్దేశం ఏమిటి? ప్రజలు, ప్రయాణీకుల సంఘాలు, సాధారణ ప్రయాణీకులు అధికారులను నేరుగా కలిసి తమ సమస్యలు వివరించే అవకాశం కల్పించాలి. కేవలం 'డిస్పాచ్‌లో ఇవ్వండి' అనే సమాధానంతో ప్రజల గొంతును అణచివేయకూడదు.ఆర్‌టిఐ లేదా పిజి పోర్టల్‌లో మనం ఏదైనా అడిగితే, 'Noted', 'Will be examined' వంటి మాటలు ఇప్పుడు అక్షరాలా 'శాశ్వతంగా పెండింగ్' లేదా 'చెత్తబుట్టలో వేసినట్టే' అనే అర్థం ఇస్తున్నాయి. ప్రజల సమస్యలను నిజంగా పరిష్కరించలేకపోతే ఆర్‌టిఐలు, పిజి పోర్టళ్లు (Public Grievance Portal) ఫిర్యాదులు పెట్టడం వల్ల ప్రయోజనం ఏమిటి? కోవిడ్ కాలంలో నిలిపివేసిన అనేక రైళ్లు ఇతర డివిజన్లలో తిరిగి ప్రారంభమయ్యాయి. కానీ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రాంతానికి చెందిన పలు రైళ్లు ఇప్పటికీ పునరుద్ధరించబడలేదు. ఉదాహరణకి కోవిడ్ ముందు మణుగూరు నుండి ప్రతిరోజూ నాలుగు నుండి ఐదు రైళ్లు నడిచేవి, దీంతో ప్రజలకు మంచి రైల్వే అనుసంధానం ఉండేది. అయితే, కోవిడ్ తర్వాత ప్రస్తుత స్థితి పూర్తిగా భిన్నమైనది, ఇప్పుడు వారి ప్రాధాన్యత కేవలం బొగ్గు రవాణా మాత్రమే, 30కి పైగా రవాణా రేకులు నడుస్తున్నాయి, కనీసం కోవిడ్ సమయంలో రద్దు చేసిన రైళ్ల గురించి అడిగితే, సమాధానం సింగిల్ లైన్, మా ప్రాధాన్యత బొగ్గు రవాణా అనే వస్తుంది. కోవిడ్‌కు ముందు నడిచిన రైళ్లు ఇప్పుడు ఎందుకు పునరుద్ధరించడం లేదు? అనే ప్రశ్నకు సరైన సమాధానం లేదు. భద్రాచలం రోడ్ – సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రాంతాల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తిరుపతి, విశాఖపట్నం, బాసరా, ఢిల్లీ, షిర్డీ, చెన్నై, బెంగళూరు, వంటి ప్రధాన పుణ్యక్షేత్రాలు, నగరాలకు ప్రత్యక్ష రైలు సౌకర్యం కల్పించాలని కోరుతున్నా, ఇప్పటికీ ఎలాంటి కార్యాచరణ కనిపించడం లేదు. అప్పట్లో ప్రయాణికుల అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చిన రైల్వే అధికారులు, ప్రస్తుతం బొగ్గు సరుకు రవాణాకు (Coal Freight) మాత్రమే అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అవసరమైన రైలు సేవలను నిర్లక్ష్యం చేస్తున్నారు. సరుకు రవాణాతో పాటు ప్రయాణికుల సౌకర్యానికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలని వినమ్రంగా కోరుతున్నాము. సికింద్రాబాద్–సిర్పూర్, సికింద్రాబాద్–భద్రాచలం రోడ్డు మార్గంలో నడిచే రైళ్లకు అవసరమైన అదనపు బోగీలు కూడా కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఇతర ప్రాంతాలకు ఇప్పటికే ఎల్‌హెచ్‌బి కోచ్‌లతో రైళ్లు నడుస్తున్నాయి. కొత్త ఎల్‌హెచ్‌బి కోచ్‌లను కూడా కేటాయిస్తున్నారు. కానీ మేము అడిగితే మాత్రం ఒకటే సమాధానం— ఎల్‌హెచ్‌బి కోచ్‌లు అందుబాటులో లేవు. ఇతర ప్రాంతాలకు ఉన్న కోచ్‌లు మా ప్రాంతానికి ఎందుకు లేవు? ఇది కోచ్‌ల కొరతా, లేక మా ప్రాంతం పట్ల నిర్లక్ష్యమా? ప్రజలకు స్పష్టమైన సమాధానం కావాలి.. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ, ప్రయాణికులకు అవసరమైన రైళ్లు, బోగీలు, నిర్వహణ సదుపాయాలు కల్పించకపోతే ఆ అభివృద్ధి అ సంపూర్ణంగానే మిగిలిపోతుంది. భద్రాచలం రోడ్‌లో ఇప్పటికే 14 కోచ్‌ల నిర్వహణకు అనువైన పిట్‌లైన్ సౌకర్యం ఉన్నప్పటికీ దానిని సమర్థంగా వినియోగించడం లేదు. ప్రస్తుతం 24 కోచ్‌ల నిర్వహణకు తగిన పిట్‌లైన్ విస్తరణ అవసరం ఉన్నా ఆ దిశగా చర్యలు లేవు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో కూడా పిట్‌లైన్ ఏర్పాటు కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా విజ్ఞప్తులు చేస్తున్నా ఇప్పటికీ ఫలితం లేదు. ప్రతి కొత్త రైళ్ల ప్రతిపాదనను 'ప్రైమరీ నిర్వహణ సౌకర్యం లేదు' అనే కారణంతో తిరస్కరించడం అభివృద్ధికి అడ్డంకిగా మారింది. వారు పిట్‌లైన్‌లు నిర్మించరు కొత్త రైళ్లను ఇవ్వరు. మాకు పిట్‌లైన్‌లు నిర్మాణం పూర్తయితే వారు కొత్త రైళ్లు వస్తాయి



### కాజీపేట రైల్వే డివిజన్

ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు.కాజీపేట ఉత్తర, దక్షిణ ప్రాంతలు కలిపే ప్రధాన కూడలి. గ్రాండ్ ట్రంక్‌లోని ప్రధాన కూడలి. కాజీపేటలో ప్రత్యేక రైల్వే డివిజన్ ఏర్పడితే తెలంగాణ ఉత్తర, తూర్పు జిల్లాల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఉంటుంది. కొత్త రైళ్ల ప్రవేశం, రైళ్ల పొడిగింపులు, అదనపు బోగీల కేటాయింపు, పిట్‌లైన్‌లు, కోచ్ నిర్వహణ కేంద్రాలు, సరుకు రవాణా మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలు వేగవంతమవుతాయి. అంతేకాకుండా వేలాది ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు ఏర్పడటంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, వ్యాపార కార్యకలాపాలు, పర్యాటక రంగం కూడా గణనీయంగా అభివృద్ధి చెందుతాయి. ప్రజలకు అవసరమైన నిర్ణయాలు స్థానిక స్థాయిలోనే తీసుకునే పరిపాలనా సామర్థ్యం పెరుగుతుంది. రైల్వే డివిజన్ అనేది కేవలం ఒక పరిపాలనా కార్యాలయం మాత్రమే కాదు; అది ఒక ప్రాంత అభివృద్ధికి పునాది. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజల న్యాయమైన రైల్వే అవసరాలను తక్షణమే తీర్చాల్సిన బాధ్యత భారతీయ రైల్వేలు, దక్షిణ మధ్య రైల్వేపై ఉంది. ఇకపై 'మార్గ సామర్థ్యం సరిపోదు', 'బొగ్గు రవాణా', 'ఒకే మార్గం' అనే సాకులు కాకుండా, ప్రజలకు అవసరమైన రైల్వే సేవలు అందించే దిశగా స్పష్టమైన కార్యాచరణ ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైంది.

**నూకల మణిచంద్ర యాదవ్**

# కంపెనీల లాభాలే కాదు – కార్మికుల జీవితం కూడా ముఖ్యమే

ఒక దేశం ఎంత అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలంటే అక్కడి కార్మికులను ఎలా చూస్తున్నారో గమనిస్తే సరిపోతుంది. ఆర్థికవృద్ధి, సాంకేతిక ప్రగతి, ప్రపంచ స్థాయి కంపెనీలు అన్నీ ముఖ్యమే. కానీ వాటి వెనుక నిలబడి చెమటోడ్చే మనిషి ఆరోగ్యం, అతని కుటుంబ జీవితం, అతని మానసిక ప్రశాంతత, అతని గౌరవం కంటే ఏ లాభమూ పెద్దది కాదు. ఈ మౌలిక సత్యాన్ని గుర్తుచేసే సంఘటన ఇటీవల ఫ్రాన్స్‌లో చోటుచేసుకుంది. ఫ్రాన్స్‌లో ఇన్ఫోసిస్ సంస్థ ఉద్యోగుల పనివేళలను నమోదు చేసే విధానం అక్కడి కార్మిక చట్టాలకు అనుగుణంగా లేదని నిర్ధారించిన కార్మిక శాఖ, సంస్థపై రూ.175,000 జరిమానా విధించింది. ఈ చర్య వెనుక ఉద్దేశం కేవలం ఒక కంపెనీని శిక్షించడం కాదు. కార్మిక చట్టాలు అనేవి కాగితాలపై రాసిన నిబంధనలు మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగి జీవితాన్ని రక్షించే భద్రతా కవచమని ప్రపంచానికి తెలియజేయడమే. ఫ్రాన్స్‌లో వారానికి చట్టబద్ధమైన సాధారణ పనివేళలు 35 గంటలు. అదనంగా పనిచేస్తే అదనపు వేతనం, విశ్రాంతి సమయం, సెలవులు, ఉద్యోగి ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై కఠినమైన నిబంధనలు ఉన్నాయి. యజమానులు ప్రతి ఉద్యోగి ఎంతసేపు పనిచేశాడో ఖచ్చితంగా నమోదు చేయాలి. ఎందుకంటే పనిగంటలు దాచిపెడితే, అదనపు శ్రమను దోచుకోవడం చాలా సులభమవుతుంది. అందుకే అక్కడ చట్టం ఉద్యోగి తరపున నిలుస్తుంది.

ఈ సంఘటన మరోసారి ఒక పెద్ద చర్చను ముందుకు తెచ్చింది. కొంతకా లం క్రితం వారానికి 70 గంటలు పనిచేయాలని ప్రముఖ పారిశ్రామికవేత్త ఎన్.ఆర్. నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఎక్కువ పనిచేయడం వ్యక్తిగత ఎంపిక కావచ్చు. కానీ దానిని సమాజమంతటికీ ఆదర్శంగా చూపించడం, లేదా సంస్థాగత సంస్కృతిగా మార్చడం చాలా జాగ్రత్తగా చూడాల్సిన అంశం. ఎందుకంటే ప్రతి ఉద్యోగి పరిస్థితి ఒకేలా ఉండదు. ఆరోగ్యం, కుటుంబ బాధ్యతలు, మానసిక సామర్థ్యం, వయస్సు, జీవన పరిస్థితులు అన్నీ వేర్వేరుగా ఉంటాయి. భారతదేశంలో కూడా కార్మికులను రక్షించే చట్టాలు ఉన్నాయి. కొత్తగా అమలులోకి వస్తున్న లేబర్ కోడ్స్‌తో పాటు, రాష్ట్రాల దుకాణాలు, వాణిజ్య సంస్థల చట్టాలు, ఫ్యాక్టరీల చట్టాలు ఉద్యోగుల పనిగంటలు, విశ్రాంతి, వారాంతపు సెలవులు, అదనపు పనికి అదనపు వేతనం వంటి అంశాలను నిర్దేశిస్తాయి. సాధారణంగా రోజుకు ఎనిమిది నుంచి తొమ్మిది గంటలకు మించి పనిచేయిస్తే అదనపు వేతనం చెల్లించాల్సి ఉంటుంది. వారానికి మొత్తం పనిగంటలకు కూడా పరిమితులు ఉంటాయి. అయితే చట్టాలు ఉండటం ఒక విషయం అయితే, వాటిని సమర్థంగా అమలు చేయడం మరో విషయం. అసంఘటిత రంగంలో, కొన్ని ప్రైవేట్ రంగ సంస్థ ల్లో ఉద్యోగులు తమ హక్కులను వినియోగించుకోవడం ఇప్పటికీ సులభం కాదు. అమెరికాలో పరిస్థితి కొంత భిన్నంగా ఉంటుంది. అక్కడ ఫెడరల్ చట్టాల ప్రకారం సాధారణంగా వారానికి 40 గంటలకు మించి పనిచేస్తే అనేక వర్గాల ఉద్యోగులకు అదనపు వేతనం చెల్లించాలి. అయితే ఉద్యోగి వర్గాన్ని బ ట్టి కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. ఐరోపాలోని అనేక దేశాల్లో మా త్రం పనిగంటలపై మరింత కఠినమైన రక్షణ ఉంది. యూరోపియన్ యూనియన్ నిబంధనల ప్రకారం సాధారణంగా వారానికి సగటున 48 గంటలకు మించి పనిచేయించరాదు. రోజువారీ విశ్రాంతి, వారాంతపు విశ్రాంతి, చెల్లిం పు సెలవులు వంటి హక్కులకు కూడా చట్టపరమైన రక్షణ కల్పించబడింది. అంటే ఉత్పాదకతతో పాటు మానవ జీవిత నాణ్యతకు కూడా సమాన ప్రాధా న్యం ఇవ్వాలనే దృక్పథం అక్కడ కనిపిస్తుంది.



పనిగంటలు పెరగడం అంటే కేవలం ఎక్కువ పని చేయడం మాత్రమే కాదు. అది క్రమంగా కుటుంబ సభ్యులతో గడిపే సమయాన్ని తగ్గిస్తుంది. పిల్లల పెరుగుదలను చూసే అవకాశాన్ని దూరం చేస్తుంది. స్నేహాలు, సామాజిక సంబంధాలు, వ్యక్తిగత అభిరుచులు అన్నీ క్రమంగా కనుమరుగవుతాయి. విశ్రాంతి తగ్గడంతో గుండె జబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం, ఆందోళన, నిరాశ, నిద్రలేమి వంటి ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని ప్రపంచవ్యాప్తంగా అనేక వైద్య పరిశోధనలు సూచిస్తున్నాయి. అలసిపోయిన ఉద్యోగి చివరకు సంస్థకూ ఎక్కువ ప్రయోజనం చేకూర్చడు.ఇంకోవైపు, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, రోబోటిక్స్ వేగంగా విస్తరిస్తున్నా యి. ఒకవైపు మిగిలిన ఉద్యోగులను ఎక్కువ గంటలు పనిచేయమని కోరడం, మరోవైపు అదే సమయంలో వేలాది మంది ఉద్యోగులను తొలగించడం అనే పరిస్థితి అనేక రంగాల్లో కనిపిస్తోంది. సాంకేతిక అభివృద్ధిని ఎవరూ వ్యతిరేకించరు. కానీ దాని ఫలితాలు కొద్దిమంది వాటాదారుల లాభాలకే పరిమితమై, ఉద్యోగుల జీవితాలు అస్థిరంగా మారితే అది సమాజంలో అసమానతలను మరింత పెంచుతుంది. లాభాలను మాత్రమే అభివృద్ధి ప్రమాణంగా తీసుకునే ఆర్థిక వ్యవస్థ చివరికి సామాజిక అసంతృప్తిని కూడా పెంచుతుంది. ప్రపంచంలోని అనేక ప్రముఖ సంస్థలు ఇప్పుడు మరో దిశలో ఆలోచిస్తున్నాయి. ఉద్యోగులకు అనువైన పనివేళలు, ఇంటి నుంచే పని చేసే అవకాశాలు, మానసిక ఆరోగ్య కార్యక్రమాలు, నాలుగు రోజుల పని వారంపై ప్రయోగాలు వంటి చర్యలను పరిశీలిస్తున్నాయి. కారణం ఒక్కటే. సంతోషంగా, ఆరోగ్యంగా ఉన్న ఉద్యోగి దీర్ఘకాలంలో సంస్థకు మరింత విలువను సృష్టిస్తాడనే అవగాహన పెరుగుతోంది.కార్మికుడి శ్రమ ఒక వస్తువు కాదు. అతను ఒక మనిషి. అతనికి కుటుంబం ఉంది. కలలు ఉన్నాయి. ఆరోగ్యం ఉంది. విశ్రాంతి తీసుకునే హక్కు ఉంది. అతని సమయాన్ని గౌరవించడం అంటే అతని జీవితాన్ని గౌరవించడం. ఆ హక్కును కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి సంస్థకు ఉన్న నైతిక బాధ్యత కూడా. ఫ్రాన్స్ తీసుకున్న చర్య ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది. ఆర్థికాభివృద్ధి పేరుతో కార్మిక హక్కులను విస్మరించరాదు. చట్టాలు కేవలం ఉల్లంఘించిన తర్వాత శిక్షించడానికే కాదు, శ్రమకు గౌరవం కల్పించడానికి కూడా ఉంటాయి. లాభాలు పెరగడం ఒక సంస్థ విజయానికి సూచిక కావచ్చు. కానీ ఆ లాభాల కోసం మనిషి ఆరోగ్యం, కుటుంబ జీవితం, గౌరవం బలి కావడం ఏ సమాజానికీ శాశ్వత అభివృద్ధి కాదు. నిజమైన అభివృద్ధి అంటే సంపదతో పాటు మానవ గౌరవాన్ని కూడా సమానంగా కాపాడగల వ్యవస్థను నిర్మించడమే.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**

# తెలంగాణ ఉద్యమం అసాధారణమైంది

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణానికి పూనుకోవాలని టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్ జీవితాలు ప్రజాస్వామ్య మార్గంలో సామాజిక మార్పుసాధ్యమని నిరూపించాయని, వారి స్ఫూర్తితో సమాజ పరివర్తన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి, ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో గురువారం వారి చిత్రపటాలకు కోదండరామ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం అనేది సాధారణ ప్రజలు చేసిన ఒక అసాధారణ ఉద్యమమని అభివర్ణించారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తూ తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన పాటల ద్వారా తెలంగాణ ఆవశ్యకతను అత్యంత సరళంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమానికి ఊపిరి పోసిన వ్యక్తి గద్దర్ అని అన్నారు. సాధారణ యువత తమ డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఇటీవల ఢిల్లీలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టేందుకు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, వనరుల పరిరక్షణ కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం అహర్నిశలు శ్రమించారని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ కొనియాడారు. 1952 నుంచే ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఉద్యమిస్తూ తొలి, మలిదశ ఉద్యమాలకు సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి సందర్భంగా గురువారం తెలంగాణ వెనుకబడిన తరగతుల (బిసి) కమిషన్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. బిసి కమిషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

కార్యక్రమంలో బిసి కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.సునీత, సెక్షన్ అధికారులు జి.సతీష్ కుమార్, ఇర్ఫాన్ బిన్ ఖలీద్, రీసెర్చ్ ఆఫీసర్ లక్ష్మీ నారాయణతో పాటు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.






## ఇంటర్ కళాశాలల ఫోర్జరీ ఎన్‌ఒసిలపై విచారణ జరిపించాలి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి
కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా 180 కళాశాలలు హైడ్రా కమిషనర్, ఫైర్ సేఫ్టీ కమిషనర్ సంతకాలు ఫోర్జరీ చేసి అనుమతులు పొందిన ఆయా కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేసి అన్ని కళాశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ సంయుక్త కార్యదర్శి వసుంధరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో పలు ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు ఫోర్జరీ ద్వారా నిరభ్యంతర ధృవీకరణ పత్రాలు (ఎన్‌ఒసిల)పొందడమే కాకుండ ఇంటర్ విద్యావ్యవస్థ ప్రమాణాలు దిగజార్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కళాశాలల శానిటేషన్, ట్రాఫిక్ ఎన్‌ఒసిలపై కూడా విచారణ జరిపించాలని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలల అనుమతుల పత్రాలను ఇంటర్ విద్యాశాఖ అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారుల అండదండలతోనే సంతకాలు ఫోర్జరీ చేసి అనుమతులు పొందారని, హైదరాబాద్, రంగారెడ్డి ,మేడ్చల్ జిల్లాల డిఐఇఒలపై విచారణ జరిపించాలని వారి ఇళ్లపై ఐటి, ఎసిబి తనిఖీలు నిర్వహించాలని, ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపు రద్దుతో పాటు సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు తావులేకుండా అన్ని కళాశాలల అనుమతులు, ఎన్‌ఒసిలు, గుర్తింపు పత్రాలను అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకునేలా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలు ఇంటర్ బోర్డ్ నిబంధన పాటించేలా చర్యలు తీసుకుని గుర్తింపు లేని కళాశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పెరుమాండ్ల అనిల్, చైతన్య యాదవ్,మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు హరీష్, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పార్టీల చేతుల్లో తల్లడిల్లుతున్న తెలంగాణ

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఢిల్లీ పార్టీల చేతుల్లో తెలంగాణ మళ్లీ తల్లడిల్లుతున్నదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. అప్పులపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు లెక్కలు చెబుతున్నారని, ఆర్‌బిఐ చెప్పినప్పటికీ వారికి చెవికెక్కడం లేదన్నారు. 'ప్రొఫెసర్ జయశంకర్' జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఆయన విగ్రహానికి కెటిఆర్ గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, శాసనమండలి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు జి.జగదీష్ రెడ్డి,మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే మొదటి ఏడాదే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని ఆశ పెట్టారని, దీనిపైన సిఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం పిల్లలు కొట్లాడుతుంటే రాష్ట్ర ప్రభుత్వానికి పట్టదంలేదన్నారు.తెలంగాణ మిగులు రాష్ట్రమని ఆర్థిక వేత్త బిపిఆర్ విఠల్ 1969,2001లో కేస్ స్టడీలో రాశారని,నీళ్లు,నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాత్రం పంపులను ఆన్ చేయడంలేదని ఆరోపించారు. భావజాల వ్యాప్తి,తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై చర్చ జరగాలని, ఆ అన్యాయంపైన ఆందోళనలు చేపట్టాలని, ఈ ఆందోళనను రాజకీయ శక్తిగా మలచడమే డెమోక్రటైజేషన్ అని ప్రొఫెసర్ జయశంకర్ చెప్పేవారని గుర్తు చేశారు. కెసిఆర్‌కు ప్రొఫెసర్ జయశంకర్ నూతన పంథాను నూరిపోశారన్నారు. తన జీవితంలో 'జై తెలంగాణ' అనని జైపాల్ రెడ్డి మేధావా?, అని ప్రశ్నించారు. కేశవరావు మేధావి అని చెబుతున్న సిఎం రేవంత్,ఆయన పక్కనే ఉన్న కోదండరాం పేరును మాత్రం చెప్పలేదన్నారు.

# ఉద్యమాల వేగుచుక్క బొల్లోజు అయోధ్య

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు
ఆయన ఆశయ సాధనకు పునరంకితంకండి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/మణుగూరు :** పేదలు, కార్మికులు, రైతులు, గిరిజనులు, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నాయకుడు బొల్లోజు అయోధ్య చిరస్మరణీయుడని, ఆయన మరణించి ఏడాది గడిచినా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అయోధ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రామానుజవరం గ్రామంలో బొల్లోజు అయోధ్య స్థూపాన్ని ఆవిష్కరించిన అనంతరం బాడిశా సతీష్ అధ్యక్షతన నిర్వహించిన ప్రథమ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బొల్లోజు అయోధ్య సాధారణ నాయకుడు కాదని, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి నిరంతరం పోరాటం చేసిన కమ్యూనిస్టు యోధుడని కొనియాడారు. పినపాక నియోజకవర్గంలోని మణుగూరు ప్రాంతంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని చెప్పారు. ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడికి చేరుకుని బాధితులకు అండగా నిలిచి, సమస్య పరిష్కారం అయ్యే వరకు వెనుదిరగని పోరాట యోధుడిగా ఆయన ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. నేటి యువత అయోధ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ప్రజల కోసం త్యాగం చేయడం, నిబద్ధతతో పనిచేయడం, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాడడం వంటి విలువలను ఆయన జీవితం నేర్పుతుందని తెలిపారు. ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో, పార్టీని బలోపేతం చేయడంలో అయోధ్య చేసిన సేవలు భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన లేని లోటు పార్టీకి, ప్రజలకు ఎప్పటికీ తీరనిదేనని పేర్కొన్న కూనంనేని, అయోధ్య ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త మరింత నిబద్ధతతో ప్రజా పోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే ఆయనకు అర్పించే గొప్ప నివాళి అని అన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. షబీర్ పాషా మాట్లాడుతూ, అయోధ్యతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మణుగూరు ప్రాంతంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు ప్రజలు ముందుగా గుర్తు చేసుకునే నాయకుడు అయోధ్య అని అన్నారు. పార్టీ, కులం, మతం అనే తేడా లేకుండా ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడిగా ఆయన నిలిచిపోయారని కొనియాడారు.

అయోధ్య ప్రజా సేవా తపన, నిరాడంబర జీవనం, నిస్వార్థ పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల పక్షాన ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మున్నా లక్ష్మీకుమారి, ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, కొత్తగూడెం మేయర్ మూగ గణేష్, పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అయోధ్య అభిమానులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

# అగ్రిగేటర్ పాలసీకి ప్రభుత్వం కసరత్తు

ప్రయాణికుల భద్రత, డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యం
మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో యాప్ ఆధారిత రవాణా సేవలను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర తెలంగాణ మోటార్ వాహన అగ్రిగేటర్ పాలసీ రూపకల్పనకు చర్యలు చేపట్టిందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పాలసీ రూపకల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి వెల్లడించారు. ఈ కమిటీ ఇప్పటికే అగ్రిగేటర్ సంస్థలు, డ్రైవర్లు, వాహన యజమానులు, ప్రయాణికుల ప్రతినిధులు, రవాణా ఆపరేటర్లు, సాంకేతిక నిపుణులు, సంబంధిత ప్రభుత్వ శాఖలతో విస్తృతంగా సంప్రదింపులు జరిపి సూచనలు, అభిప్రాయాలను సేకరించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రత, డ్రైవర్ల సంక్షేమం, వాహనాల ఫిట్‌నెస్, పర్మిట్లు, బీమా, భద్రతా ప్రమాణాలు, అగ్రిగేటర్ సంస్థల నమోదు, అనుమతులు, నియంత్రణ వ్యవస్థ, డిజిటల్ మానిటరింగ్, ఛార్జీల్లో పారదర్శకత, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, మహిళా ప్రయాణికులు, మహిళా డ్రైవర్ల భద్రత, ప్రభుత్వ శాఖలతో డేటా సమన్వయం, ఎలక్ట్రిక్, పర్యావరణహిత వాహనాల ప్రోత్సాహం వంటి అంశాలను కమిటీ పరిశీలించినట్లు మంత్రి వివరించారు. ప్రయాణికుల భద్రతతో పాటు డ్రైవర్ల సంక్షేమం, చట్టబద్ధమైన సేవలు, సాంకేతికత వినియోగం, పర్యావరణ పరిరక్షణ, వ్యాపార సౌలభ్యం మధ్య సమతుల్యతను సాధించే విధంగా పాలసీని రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కమిటీ తన తుది సిఫారసులను సిద్ధం చేస్తోందని, త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. ఆ నివేదికను సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిర్దేశిత విధాన ప్రక్రియ ప్రకారం తెలంగాణ మోటార్ వాహన అగ్రిగేటర్ పాలసీని అమలు చేసేందుకు ప్రభుత్వం తదుపరి చర్యలు చేపడుతుందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో అగ్రిగేటర్ ఆధారిత రవాణా సేవలకు స్పష్టమైన, ఆధునిక, పారదర్శకమైన, సమగ్ర నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**PUBLIC NOTICE**

**CHANGE OF NAME**

I, **MUPPARAM KALPANA, W/o SUDERSHAN MUPPARAM**, residing at H.No.11-1-1945/B/305, Gangasthan-I, Maruthingar, Nizamabad town, Telangana State, India, have changed my name from **PRAMEELA MUPPARAM to MUPPARAM KALPANA** for all future purposes. Henceforth, I shall be known, called, and addressed as **MUPPARAM KALPANA**. All concerned are requested to note the same.




## ఉపాధి హామీ ఎఫ్‌టిఇ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జీ రామ్ జీ చట్టం ద్వారా రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపినప్పటికీ ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగుల దశాబ్దకాల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. పే స్కేల్ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తానని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. త్వరలోనే మరోసారి ఉద్యోగ సంఘాలతో సమావేశమై తదుపరి చర్యలపై చర్చిస్తామన్నారు. హైదరాబాద్‌లోని బి.ఆర్.కె.ఆర్ భవన్‌లో ఉపాధి హామీ ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో మంత్రి సీతక్క గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల పే స్కేల్ అమలు, క్యాడర్ స్ట్రెంత్ ఖరారు, బదిలీల విధానం, ఇతర సర్వీస్ అంశాలపై జెఎసి ప్రతినిధులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకొచ్చారు. 2006లో డి.ఎస్సీ. ద్వారా ఎంపికై దాదాపు రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ తమకు పే స్కేల్ అమలు కాలేదని వారు వివరించారు. ఇది కేవలం జీతాల సమస్య కాదని, తమ ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమన్నారు. మొత్తం మూడు వేల ఎనిమిది వందల మంది పనిచేస్తున్నామని, తమకు పేస్కేల్ అమలు చేస్తే నెలకు రెండున్నర కోట్ల రూపాయాలు మాత్రమే అదనపు భారం పడుతుందని వారు తెలిపారు. రాబోయే నాలుగు నుంచి ఐదు సంవత్సరాల్లో పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నందున ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కూడా క్రమంగా తగ్గుతుందన్నారు. దీనిపైన మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. ఉద్యోగులు తొందరపాటు చర్యలకు దిగొద్దని, ప్రభుత్వం సమస్య పరిష్కారానికి సానుకూలంగా ఉన్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసినచ్చారు. సమస్య పరిష్కారం దిశగా చర్చల ద్వారా ముందుకు సాగుదామన్నారు. జపాన్ తరహాలో ఎక్కువ పని చేసి ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే మార్గాలు కూడా ఉన్నాయని, పని నిలిపివేయడం కంటే బాధ్యతాయుతమైన పద్ధతుల్లో సమస్యలను పరిష్కరించుకోవడం మంచిదని సీతక్క సూచించారు.

**కేంద్ర వాటా చెల్లించనందుకే నిలిచిన ఉపాధి హామీ ఉద్యోగుల జీతాలు...**

కేంద్ర ప్రభుత్వ వాటా చెల్లించకపోవడంతో గత మూడు నెలలుగా ఉపాధి హామీ ఉద్యోగుల జీతాలు నిలిచిపోయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగా జీతాలు చెల్లించి, అనంతరం కేంద్రం నుంచి ఆ మొత్తాన్ని రీయింబర్స్ చేసుకునే ప్రతిపాదన చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అంగీకరించలేదని మంత్రి సీతక్క తెలిపారు. అందుకే జీతాల విడుదలలో జాప్యం జరుగుతోందని వివరించారు. ఈ సమావేశంలో ఎఫ్ టి ఈ జెఎసి సభ్యులు ఎలబద్రి లింగయ్య, ఏ అంజిరెడ్డి, ఎం విజయ్ కుమార్, ఈ వెంకట్రామిరెడ్డి, ఎం మోహన్ రావు పాల్గొన్నారు.

# రేపటి నుంచి 'గిగ్' కార్మికుల నిరవధిక సమ్మె

డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా యాప్ సేవలకు అంతరాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, యాప్ ఆధారిత అగ్రిగేటర్ సంస్థలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని వివిధ కార్మిక సంఘాలు శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించాయి. తెలంగాణ యాప్ బేస్డ్ డ్రైవర్స్ ఫోరం (టిఎడిఎఫ్), తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు), సిఐటియు, బిఆర్‌టియు, టిఆర్‌టియు, ఐఎన్‌టియుసిఎఫ్, ఐఎల్‌డబ్ల్యుఎఫ్, ఐఎఫ్‌ఎటి, టిఎంసిడిఎ, టిజిఎఫ్‌డబ్ల్యుతో పాటు పలు కార్మిక, ప్రజా సంఘాలు ఈ సమ్మెకు మద్దతు ప్రకటించాయి. కార్మిక సంఘాల ప్రతినిధులు షేక్ సలావుద్దీన్, అజయ్ బాబు, ఎ. నగేష్ కుమార్, ఇనాయత్ అలీ బక్రీ, ఎం.ఎ. సలీమ్, రామకృష్ణారెడ్డి, అబ్దుల్ రవూఫ్, సంతోష్ కుమార్ మాట్లాడుతూ గత జూలై 22న నిర్వహించిన రాష్ట్రవ్యాప్త 'బ్రేక్ ఫ్లాష్ సమ్మె'లో సుమారు 3.90 లక్షల మంది గిగ్ కార్మికులు పాల్గొన్నప్పటికీ ప్రభుత్వం, యాప్ కంపెనీలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పలుమార్లు వినతిపత్రాలు సమర్పించి, సమావేశాలు నిర్వహించినా ఫలితం లేకపోయిందన్నారు. కనీస బేస్ ఫేర్‌తో పాటు ప్రతి కిలోమీటరు, ప్రతి నిమిషానికి న్యాయమైన ఛార్జీలను ప్రభుత్వం నోటిఫై చేయాలని, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ రూల్స్‌ను వెంటనే అమలు చేసి వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు 2025ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కమర్షియల్ రిజిస్ట్రేషన్ లేని ప్రైవేట్ వాహనాలను యాప్ ఆధారిత ప్రయాణికుల, సరుకు రవాణా సేవల్లో వినియోగించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, యాప్ కంపెనీలు నిర్మాణాత్మకంగా స్పందించకపోతే సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా క్యాబ్, ఆటో, డెలివరీ తదితర యాప్ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. సమ్మె వల్ల తలెత్తే పరిస్థితులకు ప్రభుత్వం, అగ్రిగేటర్ సంస్థలే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

# క్షుద్ర పూజలపై ప్రజలకు హరీష్‌రావు వివరణ ఇవ్వాలి

టిపిసిసి అధ్యక్షుడు
బి.మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్షుద్ర పూజల విషయంపై మాజీ మంత్రి హరీష్ రావు ప్రజలకు వివరణ ఇవ్వాలని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మూఢనమ్మకాలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. తాను హరీష్ రావును కించపరచలేదని, ఆయనపై ఎలాంటి తప్పుడు ప్రచారం చేయలేదని ఆయన స్పష్టం చేశారు. హరీష్ రావు వెళ్లిన ఆలయాలన్నీ క్షుద్ర పూజలకు ప్రసిద్ధి చెందినవేనని, అలాంటి ఆలయాలకు ఆయన ఎందుకు వెళ్లారో హరీష్‌రావు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి అసత్యం లేదని, లీగల్ నోటీసులకు భయపడబోమని స్పష్టం చేశారు. అవసరమైతే న్యాయస్థానంలోనే పోరాడతామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలపై సమన్వయ కమిటీ చర్చిస్తే మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని భావించామన్నారు.

ప్రభుత్వం పార్టీ వేర్వేరు కాదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అని పేర్కొన్నారు. తనకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మధ్య ఎలాంటి విభేదాలు లేవని తాము ప్రతి రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటామని, బుధవారం కూడా తాను సిఎంతో మాట్లాడినట్లు వెల్లడించారు.

తెలంగాణ ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ ఎల్లమ్మ, పోచమ్మ, దేవస్థానము**
బల్కంపేట్, హైదరాబాద్. ఫోన్ నెం. 9491000696

నెం. 33/Works/SYPD/2026 — ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు — తేది: 05.08.2026

ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లో వివిధ పనులకు టెండర్లు ఆహ్వానించడమైనది. బిడ్ సమర్పణ ప్రారంభ తేది: 06.08.2026 ఉ.10:00గం.ల నుండి మరియు బిడ్ సమర్పణ ఆఖరి తేది: 08.08.2026 సా.4:30గం.ల వరకు. వివరాలకు క్రింది వెబ్‌సైట్ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- చైర్మన్ & ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్
సం/- డిప్యూటీ కమిషనర్ & ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

DIPR R.O. No. : 7513-PP/CL/ADVT/2026-27, Date: 06-08-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మాదాపూర్ సర్కిల్-50

Lr.No: 16/EE/CIR-50/KPZ/CMC/2026-27 — తేది: 06.08.2026

| Nit No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| 16/EE/CIR-50/KPZ/CMC/2026-27, తేది: 06.08.2026 | సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50లో అభివృద్ధి పనులు | రూ. 4.99 లక్షలు | 07.08.2026 ఉ.10:30 గం.లకు, 08.08.2026 ఉ.10.30 గం.ల వరకు | శ్రీమతి సిహెచ్.శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50. సెల్: 7995009113 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50, సిఎంసి

DIPR R.O. No. : 7484-PP/CL/ADVT/2026-27, Date: 06-08-2026

**మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం : : నాగర్‌కర్నూల్, నాగర్‌కర్నూల్ జిల్లా.**

Tender Notice No. E2/168/2026-27 — ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు — Dt. 06.08.2026

నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాల కోసం ( 2026-27 సాధారణ నిధుల కింద) 5 పనులకు సంబంధించిన టెండర్లు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ ద్వారా పిలువబడ్డాయి.

| | |
|---|---|
| అంచనా విలువ | రూ.10.00లక్షలు |
| పనిపేరు | గ్రీన్ బడ్జెట్ / సాధారణ నిధి కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో దసరా పండుగ -2026 కోసం ట్యాంక్ బండ్ అలంకరణ, సౌండ్ సిస్టమ్, LED లైటింగ్స్ ఏర్పాటు |
| అంచనా విలువ | రూ. 02.00లక్షలు |
| పనిపేరు | గ్రీన్ బడ్జెట్ /సాధారణ నిధి కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో వనమహోత్సవం కార్యక్రమం కింద ట్రీ గార్డ్స్ కొనుగోలు, ప్లాంటేషన్ |
| అంచనా విలువ | రూ.05.00లక్షలు |
| పనిపేరు | గ్రీన్ బడ్జెట్ /సాధారణ నిధి కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో వనమహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటడానికి కూలీలను నియమించడం, సహాయక కర్రలను సప్లయ్ చేయడం, పంపిణీ చేయడం |
| అంచనా విలువ | రూ.03.00లక్షలు |
| పనిపేరు | సాధారణ నిధి కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో బోనాల పండుగ-2026 కోసం ఏర్పాట్లు |
| బిడ్ సమర్పణ ప్రారంభం | 07.08.2026@ 10.30 AM |
| బిడ్ సమర్పణ ముగింపు | 14.08.2026'@ 04: 00 PM |
| అంచనా విలువ | రూ.05.00 లక్షలు |
| పనిపేరు | 15వ ఆర్థిక సంఘం గ్రాంట్లు /సాధారణనిధుల కింద నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో 43/45 W LED స్ట్రీట్ లైట్లు, విద్యుత్ సామగ్రి సప్లయ్, డెలివరీ |
| బిడ్ సమర్పణ ప్రారంభం | 07.08.2026@ 10.30 AM |
| బిడ్ సమర్పణ ముగింపు | 11.08.2026 @ 04.00 PM |

మరిన్ని వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా "www. eprocurement.govt.in" వెబ్‌సైట్‌లో చూడవచ్చు. **బిడ్‌లను ఆహ్వానిస్తున్న అధికారి:** కమిషనర్, నాగర్ కర్నూల్ మునిసిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. సెల్ నెం. 9100972045, 7330690590లను సంప్రదించగలరు.

సం/- కమిషనర్
నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ

DIPR R.O. No. : 7441-PP/CL/ADVT/2026-27, Date: 06-08-2026

## మూడుచింతలపల్లిలో బోనాలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్‌లో భక్తులు, మహిళలు బోనాల పండగను అత్యంత భక్తి శ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జాం రవి, కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్ నీరజ్ గౌడ్‌లు ఎంసిపల్లిలోని పలు ఆలయాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో చూడాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం గ్రామస్థులకు బోనాల పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌సింగ్, బిల్ కలెక్టర్ దుర్గేష్, మున్సిపల్ పట్టణ ప్రజలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ సమర భేరీ

మేడ్చల్ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ, ధరల భారం, నిరుద్యోగం, సంక్షేమ పథకాల కోతలతో సామాన్య ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటపల్లి శంకర్ తీవ్రంగా విమర్శించారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన కోళ్ల ఫారం బస్‌స్టాప్ నుండి అంబేద్కర్ కూడలి వరకు కరపత్రాల పంపిణీ, పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన విద్య, వైద్యం, ఉపాధిని వ్యాపార వస్తువులుగా మార్చడం దుర్మార్గమన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6 నుంచి 14 వరకు జవహర్ నగర్ 2వ డివిజన్‌లో సిపిఐ పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. నిత్యావసరాల ధరల నియంత్రణ, ఖాళీ ఉద్యోగాల భర్తీ, మహిళల భద్రత, కార్మిక రైతు హక్కుల పరిరక్షణే ధ్యేయంగా సాగే ఈ పాదయాత్రల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు సిహెచ్.దశరథ్, జిల్లా సమితి సభ్యులు నిమ్మల నరసింహులు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వి.స్వరూప నాయక్, ఎఐటియుసి మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ ర్యాగింగ్‌పై ఐదు వేల మందికి చైతన్యం



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** అనురాగ్ యూనివర్సిటీలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన, ర్యాగింగ్ నిరోధం, రోడ్డు భద్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సేవా పథకం వాలంటీర్లు జాతీయ కేడెట్లు సహా 5వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి డిసిపి ఐనపర్తి లక్ష్మి, ఈగల్ ఫోర్స్ ఎస్‌పి పి.సీతారాం, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పోచారం ఐటీ కారిడార్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయం తరపున డా.వి. విజయకుమార్, డా.కె.ఎస్ చలపతి, డా.వి. శ్రీనివాస్‌రావు, డా.ఎం.శ్రీనివాస్ రావు, కల్నల్ ఆర్ వెంకటేశన్ (విరమణపొందిన) డాక్టర్ మల్లేష్‌తో పాటు డీన్లు విభాగాధిపతులు అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ర్యాగింగ్‌ను పూర్తిగా నిర్మూలించాలని రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వక్తలు సూచించారు.

# ‘సురక్షా కా తిరం’గా ప్రచారానికి శ్రీకారం

నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా సైబర్ భద్రత అవగాహన కార్యక్రమాలు: డిజిపి సి.వి.ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసి, సురక్షిత డిజిటల్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు ‘సురక్షా కా తిరంగా సైబర్ స్వతంత్ర దిశగా తెలంగాణ’ పేరుతో ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రారంభ రోజునే రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 722 సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి లక్ష మందికి పైగా ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. జిల్లాల పోలీసు అధికారులు, కమిషనర్లు, ఎస్‌పిలు, కలెక్టర్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**త్రివర్ణ పతాకం స్ఫూర్తితో మూడు సందేశాలు..**

జాతీయ త్రివర్ణ పతాకం స్ఫూర్తితో రూపొందించిన ఈ ప్రచారంలో కాషాయం అప్రమత్తంగా ఉండండి, తెలుపు అవగాహన పెంపొందించుకోండి, ఆకుపచ్చ సురక్షితంగా ఉండండి అనే మూడు ప్రధాన సందేశాలను ప్రజలకు చేరవేయనున్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న స్టాక్ ట్రేడింగ్ పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు తదితర సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నారు. అలాగే ప్రజలు మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారు. ప్రచారాన్ని నాలుగు దశల్లో నిర్వహించనున్నారు. తొలి వారంలో విద్యార్థులు, యువత, రెండో వారంలో ఉద్యోగులు, వృత్తి నిపుణులు, మూడో వా రంలో సీనియర్ సిటిజన్లు, కమ్యూనిటీ సంస్థలు, చివరి వా రంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రజా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. పోస్టర్లు, డిజిటల్ క్రియేటివ్స్, వీడియోలు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించనున్నారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచించింది. ముఖ్యంగా ‘గోల్డెన్ అవర్’లో ఫిర్యాదు చేస్తే ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వెల్లడించింది.

## ట్రాక్ రద్దీ విశ్లేషణకు అత్యాధునిక సాఫ్ట్‌వేర్

ఐఐటి బాంబేతో దక్షిణ మధ్య రైల్వే ఎంఓయు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే యార్డులు, జంక్షన్లలో పెరుగుతున్న రద్దీని శాస్త్రీయంగా విశ్లేషించి రైళ్ల నిర్వహణను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా మార్చేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక ముందడుగు వేసింది. ఇందుకోసం ఐఐటి బాంబేతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రైల్వే డేటా లాగర్ ఆధారంగా రైళ్ల కదలికలు, నిలుపుదలలు, రద్దీ పరిస్థితులను దృశ్యరూపంలో విశ్లేషించే అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీంతో యార్డుల్లో రద్దీకి కారణమయ్యే అంశాలను గుర్తించి, రైళ్ల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు భద్రతా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయనున్నారు. గత రెండేళ్లుగా ఐఐటి బాంబే బృందం యార్డ్ డయాగ్రామ్‌లు, రైళ్ల వేగం, ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలు, చారిత్రక డేటా లాగర్ సమాచారంపై అధ్యయనం చేసి ఈ నమూనాను రూపొందించింది. వివిధ పరిస్థితుల్లో రైళ్ల రద్దీ ప్రభావాన్ని సిమ్యులేషన్ ద్వారా విశ్లేషించే విధంగా పరిశోధనలు చేపట్టింది. పైలట్ ప్రాజెక్టు తొలి దశలో డేటా ధ్రువీకరణ, రైళ్ల కదలికల విశ్లేషణ, విజువలైజేషన్ సాధనాలు, భద్రతా ప్రమాణాల అభివృద్ధిపై దృష్టి సారించనున్నారు. అనంతరం ఈ సాంకేతికతను ప్రధాన రైల్వే స్టేషన్లకు విస్తరించి రియల్‌టైమ్ విశ్లేషణ వ్యవస్థలు, ఆధునిక డ్యాష్‌బోర్డులను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆగస్టు 5న జరిగిన ఒప్పంద సంతకాల కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ డి. ఆంజనేయులు రెడ్డి, సికింద్రాబాద్ డిఆర్ ఎం డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ రైల్వే యార్డుల విస్తరణకు భౌగోళిక పరిమితులు ఉన్న నేపథ్యంలో సాంకేతిక ఆధారిత విశ్లేషణ ద్వారా రైళ్ల నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని తెలిపారు. యార్డుల పునర్నిర్మాణం, ఇంటర్ లాకింగ్‌లో మార్పుల ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయడంలో ఈ సాఫ్ట్‌వేర్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

## పథకాలన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సర్పంచులదే: స్పీకర్




**ప్రజాపక్షం/వికారాబాద్ :** అభివృద్ధి జరగాలంటేప్రభుత్వం చేస్తున్న సంక్షమ పథకాలాన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సర్పంచులదే నని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ మండల ప్రజా పరిషత్ సమావేశంలో జరిగిన మండల స్థాయి సమీక్ష సామవేశానికి ముఖ్యఅతిధిగా హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ మండల స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సరైన ,పూర్తి స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సరైన , పూర్తి స్థాయి సమాచారం అందిచాలని ,శాఖల వారిగా సమస్యలు , అవసరమైన పనులు వివరాలను అందిస్తే సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వఅధికారులు ప్రజలకు ఎల్లపూడు అందుబాటులో ఉండి ప్రజలకు ఎల్లప్పుడు బాధ్యతగా వ్యహరించి వాటిని పరిష్కరించాలన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చేందుకు ప్రతి నియోజకవర్గంలో రెండు వందల కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటేడ్ , రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటు చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై సర్పంచులు ,వార్డు మెంబర్‌లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ బస్వరాజ్,జెడ్పిసిఈఓ సుధీర్ , యంపిడిఓ వినయ్‌కుమార్ , మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.



## ఉద్యోగాల తొలగింపు హెచ్చరికలు చేయడం నేరం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** ఐడిపిఎల్‌లోని ఎంటిఎఆర్ కంపెనీ ఎదుట ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులు చేపట్టిన ధర్నా కార్యక్రమం 8వ రోజుకు చేరుకుంది. ఈ ధర్నాకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం గురువారం సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సిపిఐ, ఏఐటియుసి ఎల్లప్పుడూ అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 8 రోజులుగా ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులు తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమన్నారు. అన్ని దశల్లో సిపిఐ, ఏఐటియుసి కార్మికులకు అండగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎంటిఎఆర్ కార్మికులు మొహసిన్, రాకేష్, శివ, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాలకు ఏర్పాట్లు చేయాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** బోనాల పండుగ సందర్భంగా ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని బిజెఆర్ నగర్ ప్రాంతంలో తగు ఏర్పాట్లు చేయాలని స్థానిక మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ కోరారు. గురువారం స్థానిక కాలనీవాసులతో కల్సి ఈ ప్రాంతంలో పర్యటించిన ఆయన డ్రైనేజి ఓవర్ ఫ్లో అవటం వల్ల స్థానికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే తమ సమస్యను పరిష్కరించాలంటూ జలమండలి మేనేజర్ సిరాజ్, హైడ్రా అధికారి అశోక్‌లకు విజ్ఞప్తి చేసారు. ఈ ప్రాంతంలో జరిగే బోనాలు సందర్భంగా రహదార్లపై ఏర్పడ్డ గుంతలు పూడ్చటం, వర్షపు నీరు ఎక్కడా నిలువకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, శ్రీనివాస్, ఉపేందర్, కాలనీవాసులు అబ్దుల్ నజీర్, శ్రీనివాసగౌడ్, మౌసిన్, జావీద్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పార్టీ అధ్యక్షుడు రమేష్‌కుమార్



**ప్రజాపక్షం/తాండూరు :** భారతీయ జనతాపార్టీ జిల్లాల వారీగా నూతన అధ్యక్షులను నియమించినట్లు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రాంచదర్‌రావు, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావులు ప్రకటించారు. వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ నూతన అధ్యక్షులు తాండూరుకు చెందిన యు.రమేష్‌కుమార్‌ను నియమించినట్లు ఆ ప్రకటనలో వారులో ప్రకటించారు. ఈ మేరకు బుధవారం రాత్రి పార్టీ అధిష్టానం ప్రకటన విడుదల చేసింది.తాండూరు నియోజకవర్గానికి చెందిన బిసి నాయకుడు, విద్యావేత్త యు.రమేష్‌కుమార్‌కు జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడిగా నియమించడం పట్ల పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మా ట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానం నమ్మకాన్ని వమ్ముచేయకుండా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి వర్గ విభేదాలు లేకుండా పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకవెళ్తానని చెప్పారు.ఈ సందర్భంగా పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపల్ లాల్‌గడి మలక్‌పేటలోని 5వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ రూ. 6 లక్షలతో భూగర్భ డ్రైనేజి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి వైస్ చైర్‌పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లతో కలిసి గురువారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అలియాబాద్ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తాళ్ల స్వప్న రాంప్రసాద్, తలారి మౌనిక బాబు, కైర గనేష్, మాజి సర్పంచ్ కమతం కృష్ణారెడ్డి, నాయకుడు మాధవరెడ్డి, ఎఇ సన షాహీన్, తదితరులు పాల్గొన్నారు.



## బిసి సాధికారత, సామాజిక న్యాయమే లక్ష్యం

సరూర్‌నగర్ సభలో కవిత పిలుపు




**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ ప్రాంతం నుండి టిఆర్‌ఎస్ (తెలంగాణ రక్షణ సే) శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. తెలంగాణ రక్షణ సేన బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొరిగే నర్సింహా కురుమ సారథ్యంలో, జంగలి శ్రీనివాస్ కురుమ, మంగళంపల్లి తిరుపతిల నాయకత్వంలో కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేశారు. సభలో టిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, సామాజిక న్యాయం, బిసిల అభ్యున్నతి, హక్కుల సాధనే లక్ష్యంగా నూతన రాజకీయ అజెండాను ప్రకటించి, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తామని నాయకులు ప్రకటించారు. ఈ సభకు భారీగా తరలివచ్చిన కార్యకర్తలకు జంగలి శ్రీనివాస్, మంగళంపల్లి తిరుపతి అభినందనలు తెలిపారు. ఈ సభా కార్య క్రమంలో పాల్గొన్న నాయకులు కోడూరి శ్రావణ్, ఆకవరం బాలు, రుద్రవెల్లి బబ్లు చారి, మంగళంపల్లి శ్రీలత, తూము పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మలిదశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్ర కీలకం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/మల్కాజిగిరి :** మలిదశ తెలంగాణా ఉద్యమంలో జయశంకర్ భావజాల వ్యాప్తికి చేసిన కృషి వెలకట్టలేనిదని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఆల్వాల్ జెఎసి ఆధ్వర్యంలో గురువారం జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన తెలంగాణా తల్లి విగ్రహం, జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ. తెలంగాణా ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ అన్యాయాలను వివరిస్తూ పుస్తకాలు రచించటం, వందల కిలో మీటర్లు ప్రయాణించి సమేవేశాల్లో ఉపన్యసించటం ద్వారా ప్రజలకు ఉద్యమ స్ఫూర్తినిచ్చి ముందుకు తీసుకొని వెళ్లటంలో కీలక పాత్ర వహించారన్నారు. ఈ రోజు కదిలి వచ్చే పది మంది రేపటికి పది లక్షల మందిగా మారి తెలంగాణా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తీరుతారని జయశంకర్ ముందుగానే చెప్పిచాటారన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి, పి.సురేందర్‌రెడ్డి, ఏ.దయాకర్, పుట్నాల కృష్ణ, మంద శోభన్‌బాబు, డోలి సుధీర్, సంతోష్, రవి, సురేష్, సతీ ష్, సుకన్య గౌడ్, సావిత్రి, బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి శ్రేణులు ముక్త కం ఠంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పించారు.

**కలెక్టరేట్‌లో....** తెలంగాణా ఉద్యమ సిద్దాంతకర్త, ముల్కీ



ఉద్యమం నుంచి మలిదశ తెలంగాణా ఉద్యమం వరకు ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా జీవితాంతం పోరాడిన మహనీయుడు ప్రొఫెసర్ కె.జయశంకర్ అని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, లా అధికారి చంద్రావతిలతో పాటు వివిధ



విభాగ జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మేడ్చల్ సర్కిల్ పరిధిలో...**




తెలంగాణ స్ఫూర్తి ప్రధాత, తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కిష్టాపూర్ పూడూర్ డివిజన్‌లోని కెఎల్‌ఆర్ కమాన్ వద్ద జయశంకర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి విచ్చేసిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి మేడ్చల్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ విగ్రహ ప్రతి ష్ట కమిటీ సభ్యులు చీదు వీరభద్రారెడ్డి, ప్రవీన్, సత్యపాల్‌రెడ్డి, భాస్కర్, రాజిరెడ్డి, డివిజన్‌ల అధ్యక్షులు నడికొప్పు నాగరాజు, రొయ్యపల్లి మల్లేష్‌గౌడ్, డైరక్టర్లు రేగు రాజు, దుర్గం శివశంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

**కొంపల్లి , దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో...**




కొంపల్లి సర్కిల్56 కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంతకర్త, మహోన్నత విద్యావేత్త ఆచార్య ప్రొఫసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సి.హెచ్.వేణు ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీలు అల్లం రవికుమార్ మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మరియు కొంపల్లి సర్కిల్‌కు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొని ఆచార్య జయశంకర్ సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. కాగా దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణికరన్ ప్రొఫసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్, వార్డ్ ఆఫీసర్లు, సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో**



దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ వార్డులోప్రొఫసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు సాంబశివ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, వేముల శ్రీనివాస్, ధర్మా రెడ్డి, బాల్ రెడ్డి, సాయిరెడ్డి సురేందర్ రెడ్డి, టీఎస్.రెడ్డి, నర్సింహా రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, బెంబడి బుచ్చిరెడ్డి, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మురళీ యాదవ్, పాల్గొన్నారు.

**అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో**



ప్రొఫేసర్ జయశంకర్ జయంతి వేడుకలు అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కమ తం శిరీషా కృష్ణారెడ్డి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి జోహర్లర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి వెంకటేషం, మున్సిపల్ సిబ్బం ది, పాల్గొన్నారు.

**నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో**

నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో గురువారం తెలంగాణ సిద్ధాంత



కర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై గిరి పోలీసు సిబ్బందితో కలిసి ప్రొఫసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసు అధికారు లు, సిబ్బంది పాల్గొన్నారు.

**పరిగి మున్సిపల్ కార్యాలయంలో**



ప్రొపెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా స్థానిక పరిగి మున్సిపల్ ర్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పిఏసిఎస్‌చైర్మన్ పార్థసారది పంతులు ,మున్సిపల్ కమిషనర్ మల్లేశం ,తదితరులు పాల్గోన్నారు.

**వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో**

ప్రొపెసర్ జయశంకర్ ఆశాయాలను ప్రతి ఒక్కరు పాటించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అయన చిత్రపటానికి పూలమాలలు వేసి వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో డిఆర్‌ఓ స్వర్ణలత ,మాధవరెడ్డి ,.జయపాల్‌రెడ్డి, శ్రీదర్‌రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.




## కొత్తగడి, గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా కేంద్రంలోని కొత్తగడి, బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని గురుకులపాఠశాల కళాశాలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ ,పలువురు విద్యార్థులు టిసిలు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నిస్తూ అగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు మధ్యలోనే చదవు మానేయడం లేదా ఇతర విద్యా సంస్థలకు వెళ్లే పరిస్థితి ఎందుకు ఏర్పాడ్డాయో సమగ్రంగా సమాచారం ఇవ్వాలని అధికారులను అదేశించారు. విద్యార్థుల ప్రవేశాలు,హాజరు , డ్రాపౌట్‌లు టిసిల జారీకి సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమం నాణ్యమైన విద్యా, వసతి, భోజనం తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఫిర్యాదులకు కారణమైన అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యతలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధింత అధికారులను అదేశించారు. పాఠశాలలో విద్యార్థిలకు అందుతున్న విద్య ,వసతి,అహరం నాణ్యత , పరిశుద్ధ్యం తాగునీరు సౌకర్యాలు, హస్టల్ వంటశాల .తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మమేకమై వారి విద్యాభ్యాసం , ఆరోగ్యం, వసతి ,మెను ప్రకారం భోజనం ఉండాలని,భోజన నాణ్యతపై ఆరా తీశారు. కిచెన్ స్టోర్ రూమ్ ,టాయిలెట్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు లెక్చరర్‌గా మారి లెక్కలు భోధించి వారితో సమాదానాలు చెప్పించారు. పాఠశాలలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈతనిఖీలో సచిన్‌బస్వరాజ్ ,కళాశాల ప్రిన్సిపల్ సా యిలత ,జయపాల్‌రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గోన్నారు.



## అర్హులైన పేదలందరికీ డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలి


దేవునిబండ తండా సిపిఐ సర్పంచ్ ఎం.శ్రీనునాయక్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని దేవునిబండ తండా సిపిఐ సర్పంచ్ ఎం.శ్రీనునాయక్ వివరించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిబండ తండా పంచాయతీలో సర్పంచ్ శ్రీనునాయక్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యామ్‌లాల్, కార్యదర్శి గీతా, వార్డు సభ్యులు శమంత సుధాకర్, అంగన్‌వాడి టీచర్ సుమతి, ఆశ వర్కర్లు లలిత, యువకులు ఈశ్వర్, రమేష్, శివ, సురేష్, పవన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య



**ప్రజాపక్షం/షాబాద్:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో మల్లన్న స్వామి దేవాలయ అవరణలో గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కుమ్మరి చెన్నయ్య, ఉపసర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు శివరాములు, సుధాకర్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల నిరసన ధర్నా



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జీతాల కోతైన జిఓ 1181ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం ముందు మునిసిపల్ కార్మికులు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన జిఓతో ప్రతి కార్మికుడి నెల వేతనంలో నాలుగు వేల రూపాయలు అధికారులు కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో కార్మికులు పి.లక్ష్మయ్య, బి యాదయ్య, వెంకటేష్, రవిందర్, రాంబాబు, కృష్ణ, యాదగిరి, దయానంద్, కార్మికులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత




**ప్రజాపక్షం/యాచారం :** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని గ్రీన్ ఫార్మాసిటి పోలీస్ స్టేషన్ సిఐ బి. సత్యనారాయణ తెలిపారు. గురువారం కుర్మిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ జాగృతి దివస్ లో భాగంగా సైబర్ నేరాల పట్ల అవగాహణ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బోనాల ఊరేగింపు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా బోనాల వేడుకలును గురువారం షాద్‌నగర్ మున్సిపాలిటిలో భక్తి శ్రద్ధలతో కనున్నల పండువగా నిర్వహించారు. బోనాల ఉత్సవాలలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని తొట్టేల ఊరేగింపును ప్రారంభించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.



**అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలి...**ఆషాడ మాసంలో అమ్మవారికి బోనం చేసి నైవేద్యం సమర్పిస్తే సకల శుభాలు జరుగుతాయని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి వివరించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్, కమ్మదనం, పుట్టోనిగూడతోపాటు షాద్‌నగర్ మున్సిపాలిటిలోని కాలనీల్లో మైసమ్మ బోనాల వేడుకల్లో ఎమ్మెల్సీ పూజలు చేశారు.
**కొత్తూరు:** కొత్తూరు మున్సిపాలిటిలో ఇందూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సుదర్శన్ గౌడ్, పెద్దిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, తుప్పర రమేష్, చిలకమ్రి నర్సింహులు, నవీన్‌చారి, జగన్ గౌడ్ పాల్గొన్నారు.
**హయత్ నగర్:** మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని జడ్జెస్ కాలనీ ఫేస్ వన్ లో బంగారు పోచమ్మ రేణుక ఎల్లమ్మ దేవాలయం కళ్యాణ మహోత్సవ ఘనంగా జరిగింది కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కొప్పుల విఠల్ రెడ్డి, జక్కిడి మల్లారెడ్డి దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# భవన నిర్మాణ అనుమతులు త్వరితగతిన పరిష్కరించాలి

ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాంకేతిక, పరిపాలనాపరమైన సమస్యలను వెంటనే నివారించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని, పౌరులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని కమిషనర్ స్పష్టం చేశారు. ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి చీఫ్ సిటీ ప్లానర్ (సిసిపి) కార్యాలయంలో ఆకస్మికంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) దరఖాస్తుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి దరఖాస్తును కేసు వారీగా సమీక్షించి, జాప్యానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక, పరిపాలనా కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఆలస్యం లేకుండా వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణ అనుమతులు, ఓసీ జారీ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం, సమయపాలనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా, ప్రతి దరఖాస్తును నిర్దిష్ట కాల వ్యవధిలో పరిష్కరించే విధంగా సమర్థవంతమైన వ్యవస్థను అమలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా అనవసర జాప్యం సహించబోమని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును రోజువారీగా పర్యవేక్షిస్తూ పురోగతి నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడమే మల్కాజిగిరి కార్పొరేషన్ ప్రధాన లక్ష్యమని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ బి. ప్రదీప్ కుమార్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్, ఎల్‌పిఓ సరిత, ఓఎస్‌డి వసంత, ఏసిపిలు నరేష్, రాం రెడ్డి, భాగ్యలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

## గెలుపే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా నాయకులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి,రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గా కన్వెన్షన్ వేదికగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహంపై సమగ్రంగా చర్చించడంతో పాటు, సర్ కార్యక్రమం అమలు పురోగతిని సమీక్షించారు. పార్టీ బలోపేతం, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డితో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్లు, పార్టీ ఇన్‌చార్జిలు, డిసిసి అధ్యక్షులు, సర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

### సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం

## సమానత్వ విలువలకు చిరునామా

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ముచ్చింతల్‌లోని శ్రీ సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం ఆధ్యాత్మికత,సమరసత,సమానత్వ విలువలకు చిరస్థాయిగా నిలిచే దివ్యక్షేత్రమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గురువారం తన సతీమణి జానకి శుక్లాతో కలిసి సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. 216 అడుగుల ఎత్తైన శ్రీ రామానుజాచార్యుల పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. తదనంతరం సమతా మూర్తి కేంద్రంలోని 108 దివ్యదేశాల విశిష్టతను తెలుసుకున్నారు. కేంద్ర విశేషాలను అహోబిల జీయర్ స్వామి, కృష్ణ స్వామి గవర్నర్ దంపతులకు వివరించారు. హారతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం వైకుంఠనాథ భగవానుడిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామీజీ కుటీరంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామిని గవర్నర్ దంపతులు కలిశారు. ఈ సందర్భంగా శ్రీ రామానుజాచార్యుల విశిష్ట సేవలు, విశిష్టాద్వైత తత్వం, సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం నిర్మాణ లక్ష్యం, ఇక్కడ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి జీయర్ స్వామి వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ సమతా మూర్తి విగ్రహం సమరసతకు,సామాజిక సమానత్వానికి ప్రతీక అన్నారు.

## నిరక్షరాస్యురాలైన మహిళ చేతిలో ఉల్లాస్ పుస్తకం ఉండాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రతి ఒక్క నిరక్షరాస్యురాలైన మహిళ చేతిలో ఉల్లాస్ పుస్తకం కచ్చితంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అధికారుల ను ఆదేశించారు. గురువారం అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఇఒలు ప్రతి మండల రిసోర్స్ సెంటర్ నందు ఉల్లాస్ అండ్ టిఒఎస్ఎస్‌పై అవగాహనా సదస్సు నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా సెర్ప్ ఏపీఎం లు అండ్ జిహెచ్ఎంసి టీఎంసీ లు హాజరై ప్రతి స్వయం సహాయక సంఘం నుండి ఒక మహిళను ఉల్లాస్ తరగతులకు సమీకరించాలని సూచించారు.

## డిజిటల్ అరెస్ట్ మోసగాళ్ల పట్ల అప్రమత్తం

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** డిజిటల్ అరెస్ట్ మోసగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ లోని విద్యా జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విజెఐటి) ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన "సురక్షా కా తిరంగా సైబర్ జాగ్రూకతా దివస్"అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సిపి మాట్లాడుతూ నేటి డిజిటల్ ప్రపంచంలో సైబర్ నేరాల నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎలాంటి అనుమానాస్పద లింకులు లేదా సందేశాలను నమ్మరాదని, వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకింగ్ సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోరాదని విద్యార్థులకు సూచించారు. చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్ విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎసిపి బి.కిషన్, మొయినాబాద్ ఎస్‌హెచ్ఒ మల్లికార్జున్ రెడ్డి, చేవెళ్ల ట్రాఫిక్ ఎస్‌హెచ్ఒ బి.సతీష్, ఎస్ఐలు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆట పాటలతో ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు గద్దర్

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆట పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన మహనీయుడు గద్దర్ అని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం ముందు ఉన్న ప్రజానౌక గద్దర్ వర్థంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, మాజీ జడ్పిటిసి పి.వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు మహ్మద్ ఇబ్రహీం, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, దంగు శ్రీనివాస్‌లు, జెఏసి చైర్మెన్ జనార్ధన్, కరుణాకర్, కన్వీనర్ నక్క బాల్‌రాజ్, నేతలు నరసింహులు, తిరుమల సత్యం, రవీందర్‌నాయక్, నర్సింహులు, రాములు, అర్జున్‌కుమార్, శ్యామ్, అశోక్, ఆర్టీసి నర్సింలు, టిఎన్జీఓ నాయకులు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.
**టియుజెఏసి ఆధ్వర్యంలో...**ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్థంతి వేడుకలను తెలంగాణ ఉద్యమకారులు ఘనంగా నిర్వహించారు. గద్దర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా టియు జెఏసి అధ్యక్షుడు టిజి శ్రీనివాస్ మాట్లాడుతూ గద్దర్ ఆశయాలు, త్యాగాలు నేటి తరానికి మార్గదర్శకమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, కోశాధికారివంశీకృష్ణ, అర్జునప్ప, రవీంద్రనాథ్, తిరుపతయ్య, నందిగామ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు పిల్లలకు శ్రేష్ఠమైనవి

ఇబ్రహింపట్నం ఐసిడిఎస్ సిడిపిఓ వినితాదేవి

**ప్రజాపక్షం/యాచారం :** తల్లి పాలు పిల్లలకు ఎంతో శ్రేష్ఠమైనవని ఇబ్రహింపట్నం ఐసిడిఎస్ సిడిపిఓ వినితాదేవి అన్నారు. గురవారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అమే మఖ్యఅతిధిగా హజరై మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ, మహిళా సంఘం అధ్యక్షురాలు వెంకటమ్మ, సూపర్‌వైజర్ తులసి, అంగన్ వాడీ కార్యకర్తలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



# ఉద్యమానికి వెన్నెముక మహనీయుడు జయశంకర్ సార్


కలెక్టర్ సి.నారాయణరెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. గురువారం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ నారాయణ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి కేశురాం, వెనుకబడిన సంఘాల నాయకులు మల్లేష్ యాదవ్, కలెక్టరేట్ ఎఓ సునీల్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ జాతిపిత జయశంకర్ సార్

**షాద్‌నగర్:** తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ జాతిపిత అని, ఆయన ఆశయ సాధన కోసం కృషిచేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం ముందు ఉన్న జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, మాజీ జడ్పిటిసి పి.వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు మహ్మద్ ఇబ్రహీం, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, దంగు శ్రీనివాస్‌లు, జెఏసి చైర్మెన్ జనార్ధన్, కరుణాకర్, కన్వీనర్ నక్క బాల్‌రాజ్, నేతలు నరసింహులు, తిరుమల సత్యం, రవీందర్‌నాయక్, నర్సింహులు, రాములు, అర్జున్‌కుమార్, శ్యామ్, అశోక్, ఆర్టీసి నర్సింలు, టిఎన్జీఓ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.
**ఘనంగా జయశంకర్ సార్ జయంతి వేడుకలు...** పట్టణంలోని న్యాసిటి కాలనీలో ఉన్న జయశంకర్ సార్ విగ్రహానికి మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజావరప్రసాద్,ఈట గణేష్, నరేందర్, వి.నారాయణరెడ్డి, మన్నె కవిత నారాయణ, పట్టణ అధ్యక్షుడు నటరాజన్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, రాఘవేందర్‌రెడ్డి,, లక్ష్మీనర్సింహ్మారెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, నక్కల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.
**కేశంపేట:** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి కోరారు. కేశంపేట మండల కేంద్రంలో జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో కామ్లేకార్ నవీన్‌కుమార్, తలసాని వెంకట్‌రెడ్డి, జమాల్‌ఖాన్, నాయకులు పర్వత్‌రెడ్డి, సొప్పరి రామకృష్ణ, యాదగిరి, నరేష్, సలీం, బైకని శేఖర్ యాదవ్, సాజిద్, దశరథ, రాము, నరేందర్, నాగేష్, శంకర్‌నాయక్, అనిల్ పాల్గొన్నారు.
**కడ్తాల్ :** కడ్తాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు జంగయ్య, పాఠశాల ఉపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి, కౌసల్య, శ్వేతా మాధురి, ఇంద్రారెడ్డి, భాగ్యలక్ష్మి ,శ్వేత, భీముడు, మమత, విశ్వజ పాల్గొన్నారు.
**హయత్‌నగర్ :** తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా హయత్‌నగర్‌లో జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.





## 'సర్'పై పాదయాత్ర



**ప్రజాపక్షం/మలక్‌పేట్:** ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో మలక్‌పేట్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి షేక్ అక్బర్ చేపట్టిన పాదయాత్ర గురువారం రెండో రోజుకు చేరుకుంది.ఉదయం ఆజంపుర చమన్ నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర నవీ రోడ్, డబీర్‌పురా బ్రిడ్జి, ఆల్ అమన్ హోటల్, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల పరిసరాలు, జికా హోటల్ మీదుగా అంజుమాన్ రోడ్ వద్ద ముగిసింది.

## ఫారాలు తిరిగి ఇవ్వాలి



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఇంకా నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని, ఓటర్లు వీలైనంత త్వరగా ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తిచేసి తిరిగి ఇవ్వాలని ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన రహమత్‌నగర్, కార్మికనగర్ డివిజన్‌లోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎఫ్‌నగర్ బస్తీ ప్రెసిడెంట్ జహూర్ పాషా, జనరల్ సెక్రటరీ సతీష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు అన్వర్, వినోద్ కుమార్, నందు, ముత్యాల యాదగిరి, యాదయ్య, ఎండీ గౌస్, పలువురు బిఎల్‌వో, బిఎల్‌ఏలు పాల్గొన్నారు.

## సిబ్బందిని నియమించండి



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం సక్రమంగా జరిగేందుకు బిఎల్‌ఓలు, సిబ్బంది సంఖ్యను పెంచాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన వెస్ట్ మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బూత్ లెవెల్ ఏజెంట్‌లు, బిఆర్ఎస్ ముఖ్య నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, గుర్రం పవన్ కుమార్‌గౌడ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పోరు దీక్ష




**ప్రజాపక్షం/కవాడిగూడ:** విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ జనసేన నాయకుడు సాగర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం జనసేన ఆధ్వర్యంలో విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని ఇందిరాపాక్ ధర్నాచౌక్ వద్ద విద్యార్థి పోరు దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన విద్యార్థి విభాగం నాయకులు రామకృష్ణ, ముంజారెడ్డి, ప్రేమ్ కుమార్, శంకర్ గౌడ్, శ్యామ్, నిఖిత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సదస్సులు జయప్రదం చేయాలి




**ప్రజాపక్షం/ముషీరాబాద్:** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 9న జరుగనున్న జాతీయ మహాసభలకు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలకు మెమ్‌ఎస్‌పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ ఇంజం వెంకట స్వామి మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం ఎంఎస్పి నియోజకవర్గం ఇంచార్జ్ ఎడవల్లి యాదయ్య మాదిగ, కో ఇంచార్జ్ మునిరాతి రామకృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్‌పి నాయకులు గండి కృష్ణ మాదిగ, గజ్జల రాజశేఖర్ మాదిగ, సంతోష్ మాదిగ, చిలక ఎల్లయ్య మాదిగ, ముచ్చనపల్లి రాములు మాదిగ, తొట్ల గోపి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## హలో విద్యార్థి ఛలో హైదరాబాద్




**ప్రజాపక్షం/కవాడిగూడ:** ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హలో విద్యార్థి ఛలో హైదరాబాద్ పేరిట ఇందిరాపార్క్ వద్ద గురువారం మహాధర్నా జరిగింది. పెద్ద ఎత్తున పాల్గొన్న విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్ల కార్డులు ప్రదర్శించారు. ధర్నాలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు సాగర్ పాల్గొని మాట్లాడుతూ... పేద విద్యార్థుల చదువులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత చులకన ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 14 లక్షల మంది పేద విద్యార్థులకు గత ఆరు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్, కె.అశోక్‌రెడ్డి, కె.శంకర్, సుమ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



ఎంఎంసి కార్యాలయంలో



జిహెచ్ఎంసిలో

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో జయశంకర్ సార్ అందించిన అమూల్యమైన సేవలను స్మరించుకున్నారు. ఆయన ప్రదర్శించిన అంకితభావం, నిజాయితీ, ప్రజాసేవ తదితర మహోన్నత ఆశయాలను అధికారులు, సిబ్బంది స్ఫూర్తిగా తీసుకుని విధులు నిర్వహించాలని సూచించారు.

హైదరాబాద్ : తెలంగాణ సిద్ధాంతకర్త, విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి నేతృత్వంలో వివిధ విభాగాల అధిపతులు, అధికారులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం కోసం జయశంకర్ సార్ చేసిన నిరంతర కృషి, అందించిన మేధోపరమైన దిశానిర్దేశం మరువలేనివన్నారు. సామాజిక న్యాయం, ప్రజాసేవ పట్ల ఆయన చూపిన అంకితభావం భావితరాలకు నిత్య స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు పారదర్శకమైన, మెరుగైన పౌర సేవలు అందించేందుకు ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసి అదనపు కమిషనర్లు సి.ఎన్. రఘుప్రసాద్, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



హైడ్రా కార్యాలయంలో

హైదరాబాద్ : తెలంగాణ భావజాల వ్యాప్తికి అహర్నిశలు శ్రమించిన అమర మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని హైడ్రా అధికారులు కొనియాడారు. జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం హైడ్రా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ చూపిన మార్గం, ఆయన సిద్ధాంతాలు ప్రతీ ఒక్కరికీ మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అడిషనల్ కమిషనర్లు ఆర్. సుదర్శన్, డి. ఆనంద్ కుమార్‌లతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలు ప్రారంభం




**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** బోనాల పండుగ పురస్కరించుకొని గురువారం ఛత్రినాక చౌరస్తాలో కొలువైన పోతలింగన్న ఆలయంలో పుప్పాల కేదవరావు ద్వాజారోహన చేపట్టి ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో పుప్పాల రఘు, మోహన్‌రావు, నరోజు కృష్ణచారి, పసునూరి పురషోత్తం చారి, పి.రాజు, క్రాంతి, కిషోర్, అరవింద్, చిరంజీవి, వినయ్, మణికంఠ మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# వైద్యారోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం / సుల్తాన్ బజార్ :** పలు సమస్యల పరిష్కారం కోరుతూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కోఠి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్, రాష్ట్ర గౌరవాధ్యక్ష్యులు భూపాల్ తదితరులు మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఫిమేల్ ఎంపిహెచ్‌ఎస్, ఏఎన్ఎంలపై పనిభారాన్ని తగ్గించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏఎన్‌ఎంల రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌ను వెంటనే పూర్తిచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష్యుడు ఎండి ఫసియోద్దీన్, వివిధ జిల్లాల నాయకులు పద్మ,పుష్పలత, సంపూర్ణ సరోజ, కవిత, స్రవంతి, జ్యోతి, సులోచన, లక్ష్మి , మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




## ఎఫ్‌టిసిసిఐ ఉపాధ్యక్షులుగా వినోద్‌కుమార్ అగర్వాల్



**ప్రజాపక్షం / హైదరాబాద్:** 2026–27 సంవత్సరానికి ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) ఉపాధ్యక్షులుగా మహాలక్ష్మి ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంపిఎల్ గ్రూప్) మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ కుమార్ అగర్వాల్ ఎన్నికయ్యారు. హైదరాబాద్ ఎఫ్‌టిసిసిఐ కార్యాలయంలో జరిగిన రెండో మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. పారిశ్రామిక రంగంలో 35 ఏళ్లకు పైగా విశిష్ట అనుభవం కలిగిన వినోద్‌కుమార్ గతంలో ఫెడరేషన్ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా, పలు కమిటీలకు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఎఫ్‌టిసిసిఐని పరిశ్రమల గొంతుకగా మరింత బలోపేతం చేయడానికి, తెలంగాణ సమగ్ర, సుస్థిర ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని వినోద్‌కుమార్ తెలిపారు.

## బిసి కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికు డాక్టరేట్ ప్రదానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారిణి, తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ కళాశాల నుంచి పిహెచ్‌డి ప్రదానం చేశారు. ప్రొఫెసర్ రాధిక యాదవ్ పర్యవేక్షణలో 'తెలంగాణ రాష్ట్రంలో మహిళా సాధికారతపై సామాజికచట్టపరమైన అధ్యయనం (రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ)' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా మర్రిముచ్చాల గ్రామానికి చెందిన బాలలక్ష్మి చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రజాసేవలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం బిసి కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ విద్యను కొనసాగించి పిహెచ్‌డి సాధించారు. మహిళల రాజకీయ సాధికారతపై ఆమె చేసిన పరిశోధన విధాన రూపకల్పనకు ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, ఉద్యమ సహచరులు అభినందనలు తెలిపారు.

## యాప్రాల్‌లో యువకుడు అదృశ్యం



**ప్రజాపక్షం/జవహర్ నగర్:** తల్లి మందలించిందనే చిన్న కారణంతో 18 ఏళ్ల యువకుడు ఇల్లు వదిలి వెళ్లిన సంఘటన జవహర్ నగర్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు వెల్లడించారు. యాప్రాల్‌లోని ఎస్.ఎస్. ఎన్‌క్లేవ్ (ఫేజ్II) నివాసి, ప్రైవేట్ ఉద్యోగి అయిన ప్రశాంతి స్టీఫన్ కుమారుడు ఆరోన్ జోర్డాన్ స్టీఫన్ (18) ఈ నెల 4వ తేదీ రాత్రి 9:00 గంటల సమయం లో చెల్లెలి కోసం స్టేషనరీ సామగ్రి తీసుకురావాల ని తల్లి కోరగా, అతడు నిరాకరించాడు. దీంతో తల్లి అతడిని మందలించడంతో కోపానికి గురైన ఆరోన్, నేను ఇంటి నుండి వెళ్లిపోతున్నాను అని చెప్పి బయటకు వెళ్లాడు. అనంతరం అతడు తిరి గి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ స భ్యులు బంధువులు, స్నేహితుల వద్ద పరిసర ప్రాంతాల్లో గాలించారు. యాప్రాల్‌లోని ఉషోద య, శైలి గార్డెన్ సమీపంలో అతడిని చివరిసారిగా చూసినట్లు స్థానికులు తెలిపారు. ఆచూకీ లభించకపోవడంతో తల్లి ప్రశాంతి స్టీఫన్ పోలీసుల కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# బోనాల ఆలయాలకు ప్రభుత్వ నిధులు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/ఉప్పల్ :** గత ప్రభుత్వానికి భిన్నంగా రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏటా మాదిరిగానే ఈ సారి జరుగనున్న తెలంగాణా సంస్కృతిని ప్రతిబింబించే విధంగా బోనాలు ఉత్సవాలు నిర్వహించుకొనేందుకు ప్రతి ఆలయానికి నిధులు మంజూరు చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని 190 ఆలయాల్లో జరుగనున్న బోనాల పండుగకు గాను మంజూరైన రూ.56లక్షల 17వేల 500 చెక్కులను స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డితో కల్సి ఆలయ కమిటి ప్రతినిధులకు అందచేసారు. ప్రజలు భక్తిశ్రద్దలతో బోనాలు పండుగ జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ఆలయాల పట్ల తాను ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండే విధంగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్గచేస్తున్నానన్నారు. ఎన్‌జిఆర్ఐ ప్రాంతంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చర్లపల్లి, కాప్రా మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, ఆలయ ఈఓ వెంకన్న,దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోటెత్తిన భక్తులు



**ప్రజాపక్షం/చార్మినార్:** లాల్‌దర్వాజా పరిసరాలు భక్త జనసందోహంగా మారాయి. సింహవాహిని మహంకాళీ అమ్మవారికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి బోనం సమర్పించారు. ఈ క్రమంలోనేసిటీ కాలేజీ విద్యార్థినిలు అమ్మవారికి బోనాల సమర్పించడం జరిగింది.

# ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

### హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కదిరన్ పలని

**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కృషి, విశేష సేవలు చిరస్మరణీయమని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కదివరన్ పలని అన్నారు. జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ పోషించిన పాత్ర మహోన్నతమైనదన్నారు. తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదివరన్ పలనితో పాటు డిఆర్ఓ డాక్టర్ నారాయణ, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

**అంబర్‌పేట:** చెన్నారెడ్డి నగర్‌లో అంబర్‌పేట జెఏసి ఆధ్వర్యంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ గుడిసె రూబి స్టీవెన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని చెప్పారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గుర్తించి పోరాటం చేశారన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాల నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు వర్కాల శ్రీకాంత్, దయాకర్ యాదవ్, మానయ, భానుదాస్, జాన్ గట్టయ్య, రవీందర్, నర్సింగ్, శ్రీకాంత, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ ఆధ్వర్యంలో:తెలంగాణ ఉద్యమకర్త ప్రొఫెసర్ జయంతి వేడుకలు బిఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లికార్జున్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం తప్పుదోవ పట్టకుండా దిశానిర్దేశం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని చెప్పారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మొహమ్మద్ అమీర్, మొహమ్మద్ ఇబ్రహీం, రాహూల్ ముదిరాజ్, అక్షయ్, హరీష్, చేతన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.







# ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయండి

### జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ఎమ్మె సంతోష్

**ప్రజాపక్షం/కొందుర్గు:** రంగారెడ్డి జిల్లాకు మారుమూల ప్రాంతంగా ఉన్న ఉమ్మడి కొందుర్గు మండలంలో 24/7మల్లి స్పెషాలిటి ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా సాధన సమితి జిల్లా అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మె సంతోష్ మాట్లాడుతూ కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌సిలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ సదుపాయాలు, అత్యవసర చికిత్స సేవలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మండలంలో 39గ్రామ పంచాయతీలు ఉన్నాయని, వాటిలో పేద ప్రజలే ఎక్కువగా ఉన్నారని వివరించారు. గత 30ఏళ్లలో జనాభా గణనీయంగా పెరిగినా వైద్య సదుపాయాలు మాత్రం పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్లు అందుబాటులో లేక ప్రజలు ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే 24గంటల అత్యవసర సేవలతో కూడిన మల్టీ స్పెషాలిటి ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, లేకపోతే జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గాలిగూడ, లాల్‌పహాడ్ తదితర ప్రాంతాల నుంచి అత్యవసర వైద్యసేవల కోసం షాద్‌నగర్‌కు వెళ్ళేందుకు 30కిలో మీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంగా మారిన కొందుర్గులో వాహనాల రద్దీ, ప్రమాదాలు, కాలుష్యం పెరగడంతో ప్రత్యేక వైద్య సేవల అవసరం మరింత పెరిగిందన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారు సమయానికి చికిత్స అందక ప్రాణాలు కొల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందుర్గులో ఆక్సిజన్ సదుపాయంతో కూడిన అంబులెన్స్ కూడా అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. ప్రథమ చికిత్సతోపాటు అత్యవసర వైద్యులు అందుబాటులో ఉంటే ప్రమాద బాధితుల్లో అధిక శాతం మంది ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దర్గా వెంకటయ్య, జిల్లా సాధన సమితి మండల నాయకులు మీదికేరి రాధాకృష్ణ ,కాశ యాదయ్య, శేగ విద్యాసాగర్, ఈసరి మల్లేష్, చెరుకుపల్లి నర్సింలు, నరేష్‌లు పాల్గొన్నారు.

# కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదించారు

### షాద్‌నగర్ ఆర్‌డిఒ ఎన్ఆర్ సరిత



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును రాజకీయ పార్టీల నేతలు ప్రతిపాధించినట్లు షాద్‌నగర్ ఆర్‌డిఓ ఎన్ఆర్ సరిత వివరించారు. గురువారం స్థానిక ఆర్‌డిఓ సరిత అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఓటరు జాబితపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆర్‌డిఓ సరిత మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల హేతుబద్దీకరణ అంశంపై రాజకీయ పార్టీల నేతలతో చర్చించినట్లు వివరించారు. కేశంపేట మండలంలో రెండు కిలో మీటర్లకు పైగా దూరంలో ఉన్న నాలుగు పోలింగ్ స్టేషన్లకు సంబంధించి కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును ప్రతిపాధించినట్లు తెలిపారు. జిల్లేడు చౌదరిగూడ, కొత్తూరు మండలాల్లో ఓటర్ల సంఖ్య 1200దాటిన కారణంగా ఒక్కో కొత్త పోలింగ్ స్టేషన్‌ను ప్రతిపాధించినట్లు వివరించారు. ఫరూఖ్‌నగర్ మండలంలో రెండు కిలో మీటర్లకు పైగా దూరంలో ఉన్న ప్రాంత ప్రజల సౌకర్యార్థం మరో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు ప్రతిపాధించిన పోలింగ్ స్టేషన్ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫరూఖ్‌నగర్ తహశీల్దార్ నాగయ్య, మున్సిపల్ కమీషనర్ సునీతా రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నేతలు లక్ష్మణ్‌నాయక్, రాజునాయక్, బాల్‌రాజ్ గౌడ్, పురుషోత్తం రెడ్డి, దొడ్డి శ్రీనివాస్‌తోపాటు వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

# నిరసనలు..వాయిదాల మధ్య బిల్లులుపాస్

- పార్లమెంట్ ఉభయసభల్లోనూ ఇదే తంతు
- అమిత్ షా సభకు రావాలని ప్రతిపక్షాలు పట్టు




**న్యూఢిల్లీ :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు రావాలని, విద్యార్థులు, యువతపై పోలీసుల అమానుష చర్యలపై సమాధానం చెప్పాల్సిందేనని ఉభయసభల్లో ప్రతిపక్ష ఎంపిలు తమ నిరసనలను పట్టువీడకుండా కొనసాగిస్తున్నాయి. ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ, రాజ్యసభలో ప్లకార్డులు చేబూని వెల్‌వైపు దూసుకువచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఉభయసభల్లోనూ గురువారం వాయిదాల పర్వం కొనసాగింది. గందరగోళం మధ్య, లోక్‌సభ పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు, 2026ను ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించింది. ఇక 2022–23 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనాలను మించిన వ్యయానికి పార్లమెంట్ ఆమోదం కోరే వినియోగాల బిల్లును రాజ్యసభ గురువారం ఆమోదించింది. ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే సభ మొదట హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అణుబాంబు దాడుల వార్షికోత్సవాలను స్మరించుకుంది. బాధితులకు నివాళులర్పించేందుకు సభ్యులు మౌనం పాటించారు. ఆ తర్వాత, జులై 20న విద్యార్థి నిరసనకారులపై పోలీసులు జరిపిన చర్యపై హోం మంత్రి అమిత్ షా సభకు హాజరు కావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు చేయడం ప్రారంభించారు. గందరగోళం కొనసాగుతుండగా, ప్రశ్నోత్తరాల సమయం పార్లమెంటరీ కార్యకలాపాలలో ఒక ముఖ్యమైన భాగమని బిర్లా సభ్యులకు గుర్తు చేశారు. జులై 20న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి దీనిని ఒక్కసారి కూడా జరగనివ్వలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. కొనసాగుతున్న గందరగోళం మధ్య, సభా కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తరువాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, చెల్లింపులు, పరిష్కార వ్యవస్థల చట్టం, 2007, ఆదాయపు పన్ను చట్టం, 2025 లను మరింతగా సవరించడానికి, ఆర్థిక చట్టం, 2026ను సవరించడానికి ఉద్దేశించిన పన్నులు, ఇతర చట్టాల (సవరణ) బిల్లు, 2026 ను పరిశీలనలోకి తీసుకోవడానికి ప్రవేశపెట్టారు. అయితే విపక్ష సభ్యుల గందరగోళం మధ్యే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ), ఇతర నోటిఫైడ్ ఎలక్ట్రానిక్ చెల్లింపు పద్ధతుల ద్వారా జరిగే చెల్లింపులపై ఛార్జీలు విధించడానికి బ్యాంకులు, ఇతర సేవా సంస్థలకు ప్రభుత్వానికి అధికారం కల్పించే చెల్లింపులు, పరిష్కార వ్యవస్థల చట్టం, 2007ను సవరించే బిల్లును లోక్‌సభ గురువారం మూజువామి ఓటు ద్వారా ఆమోదించింది. ఇక రాజ్యసభ కూడా మధ్యాహ్నం 3.15 గంటల నాటికి మూడుసార్లు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన తరువాత నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్, కొన్ని ప్రతిపక్ష పార్టీలు నుండి వాకౌట్ చేశాయి. మధ్యాహ్నం 2.15 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనప్పుడు, సభా కార్యకలాపాలను ఒక గంట పాటు వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ముందుగా ప్రకటించినప్పటికీ, రాజ్యసభ అంతకంటే ముందే తిరిగి సమావేశమైంది. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు తమ డిమాండ్‌ను కొనసాగించడంతో సభలో గందరగోళ వాతావరణం కొనసాగింది. ప్రతిపక్షాల డిమాండ్ల నేపథ్యంలో రాజ్యసభ మూడుసార్లు వాయిదా పడింది.

### పార్లమెంట్ ఆవరణలో

అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీ, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అమానుష చర్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపిలు గురువారం కూడా పార్లమెంట్ భవన సముదాయంలో ఆందోళన చేపట్టారు. వర్షం కురుస్తున్నప్పటికీ, గొడుగులు పట్టుకుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ఎంపిలు ప్రదర్శించారు. పార్లమెంట్ మకర ద్వారం ముందు 'చందా చోర్, గద్దీ ఛోడ్, 'అమిత్ షా జవాబ్ దో', 'బిజెపి కే దఫ్తర్ మే, చాందా చోర్ కహా మిలేంగే' వంటి నినాదాలతో నిరసన తెలిపారు. రామ మందిరంలో విరాళాల చోరీ జరిగిందని, దానికి ప్రతీకగా ఎంపిలు ఆ ప్రదేశంలో ఒక విరాళాల పెట్టెను ఉంచి, దాని చుట్టూ వరుసగా నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధానంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు చెందిన ప్రతిపక్ష ఎంపిలు, 'అమిత్ షా జవాబ్ దో' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్ వెనుక బారులు తీరి, హోం మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు, అయోధ్యలోని రామ మందిరం నుండి విరాళాలను అపహరించారన్న ఆరోపణలపై జవాబుదారీతనం కోరుతూ ఎస్‌పి ఎంపిలు కూడా విడిగా నిరసన చేపట్టారు. రామ మందిరంలో విరాళాల అపహరణ ఆరోపణలు, గత వారం విద్యార్థుల నిరసనల సందర్భంగా వారిపై క్రూరమైన బలప్రయోగం వంటి అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఇండియా కూటమి నేతలు ప్రతిన బూనారు. ప్రతిపక్షాల డిమాండ్లపై పార్లమెంట్ ఉభయ సభలు ప్రతిష్టంభనలో కొనసాగుతుండగా, చాలా వరకు శాసనపరమైన కార్యకలాపాలు గందరగోళం మధ్యే జరుగుతున్నాయి.

## విద్యార్థుల గళాన్ని వినిపించకుండా
# బిజెపి సర్కార్ నన్ను అడ్డుకోలేదు

- ప్రయాగ్‌రాజ్‌లో తన 'ఛాత్రోన్ కీ గూంజ్'కు అనుమతి రద్దుపై రాహుల్‌గాంధీ మండిపాటు
- విద్యార్థుల సమస్యలు వినడానికి బదులు వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తారా ? అని నిలదీత



**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో తన 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం) కార్యక్రమానికి నిర్వాహకులు అనుమతిని రద్దు చేయడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బిజెపి ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా విద్యార్థుల గళాన్ని వినిపించకుండా తనను అడ్డుకోలేదన్నారు. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను సాకుగా చూపి, ఈనెల 8న ప్రయాగ్‌రాజ్‌లోని కెపి గ్రౌండ్‌లో జరగాల్సిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమానికి కాయస్థ పాఠశాల ట్రస్ట్ అనుమతిని రద్దు చేసిన నేపథ్యంలో ప్రతిపక్ష నేత ఈ వ్యాఖ్యలు చేశారు.కార్యక్రమ స్థలంలో నీరు నిలిచిపోవడాన్ని కూడా రద్దుకు కారణంగా ట్రస్ట్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ విమర్శనాస్త్రాలు సంధించారు. అలహాబాద్ యూనివర్సిటీ విద్యార్థులు ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపునకు వ్యతిరేకంగా తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కానీ విద్యార్థుల మాట వినడానికి బదులుగా, యంత్రాంగం వారిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తోందని ఆరోపించారు. యువత గళాన్ని అణచివేయడమే మోదీ ప్రభుత్వ విధానమని ధ్వజమెత్తారు. ప్రశ్న అడిగితే లాఠీచార్జ్, నిరసన తెలిపితే కేసులు, గళం విప్పితే పెల్లెట్ గన్‌ల దాడి ఎదుర్కోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. 'విద్యార్థుల సమస్యలను వినడానికి ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నేను నిర్ణయించుకున్నప్పటి నుండి, నా కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి యంత్రాంగం అన్ని విధాలా ప్రయత్నిస్తోంది' అని గాంధీ చెప్పారు. 'ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమానికి కూడా వారు భయపడుతున్నారని స్పష్టమవుతోందని ఆయన అన్నారు. 'నేను విద్యార్థులకు అండగా ఉంటాను. ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా, వారి గళాన్ని వినిపించకుండా నన్ను అడ్డుకోలేదు' అని స్పష్టం చేశారు. కాయస్థ పాఠశాల ట్రస్ట్ తాత్కాలిక అధ్యక్షుడు జితేంద్ర నాథ్ చౌదరి పిటిఐతో మాట్లాడిన తర్వాత రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. కెపి కాలేజీ మైదానాన్ని క్రీడలు, విద్యాపరమైన కార్యకలాపాలకు తప్ప ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని అలహాబాద్ హైకోర్టు ఆగస్టు 14, 2025 నాటి ఉత్తర్వుల్లో ఆదేశించిందని చౌదరి తెలిపారు. వర్షం కారణంగా మైదానంలో నీరు నిలిచిపోయిందని, బహిరంగ కార్యక్రమానికి అది సురక్షితం కాదని ఆయన చెప్పారు. కాంగ్రెస్‌కు ఇచ్చిన అనుమతి జిల్లా మేజిస్ట్రేట్ ఆమోదానికి లోబడి ఉంటుందని చౌదరి పేర్కొన్నారు. ఈ సమావేశంలో పేపర్ లీకేజీలు, విద్యార్థులను ప్రభావితం చేసే ఇతర అంశాలపై విద్యార్థులతో లోక్‌సభ ప్రతిపక్ష నేత సంభాషించాల్సి ఉంది. ఈ కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించేందుకు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ బుధవారం ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించారు. కెపి ట్రస్ట్ సభకు అనుమతిని రద్దు చేసినప్పటికీ, రాహుల్ గాంధీ 8న ప్రయాగ్‌రాజ్‌కు వచ్చి విద్యార్థులతో సంభాషిస్తారని రాయ్ స్పష్టం చేశారు.

# విరాళాల స్వీకరణలో డిఎంకె టాప్

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,051.56 కోట్లు స్వీకరించిన ప్రాంతీయ పార్టీలు
- అంతకు ముందు ఏడాదితో పోలిస్తే అధికం

**న్యూఢిల్లీ :** దేశంలోని ప్రాంతీయ పార్టీలు రూ. 20 వేలకంటే ఎక్కువగా స్వీకరించిన విరాళాల సంఖ్య అంతకంతా పెరుగుతూనే ఉన్నాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2024–25 సంవత్సరంలో మూడు రెట్లు పెరిగాయి. అందులో డిఎంకె అత్యధిక విరాళాలు పొందిన పార్టీగా నిలిచింది. ఈ మేరకు గురువారం అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) ఒక నివేదికను విడుదల చేసింది. నివేదిక ప్రకారం...ప్రాంతీయ పార్టీలు స్వీకరించిన విరాళాల మొత్తం విలువ 2023–24లో రూ. 347.69 కోట్లు ఉండగా, 2024–25లో రూ. 1,051.56 కోట్లకు పెరిగింది. ఈ రెండేళ్లలో స్వీకరించిన విరాళాల సంఖ్య 2023–24లో 2,861 కాగా, 2024–25లో 5,297గా ఉంది, అంటే 85 శాతం పెరుగుదల నమోదైంది. రాజకీయ నిధుల సేకరణలో కార్పొరేట్, వ్యాపార సంస్థల ఆధిపత్యం కొనసాగింది. 2024–25లో అవి రూ. 644.93 కోట్ల విరాళాలు అందించాయి (ఇది అంతకుముందు ఏడాది ఇచ్చిన రూ. 227.61 కోట్లతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు ఎక్కువ), అయితే మొత్తం విరాళాల విలువలో వాటి వాటా స్వల్పంగా తగ్గింది. ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో కలిపి, కార్పొరేట్, వ్యాపార సంస్థలు 650 విరాళాల ద్వారా రూ. 872.54 కోట్లు అందించాయి. ఇది మొత్తం విరాళాల విలువలో 62 శాతానికి పైగా ఉంది. వ్యక్తిగత దాతల నుండి అత్యధిక సంఖ్యలో విరాళాలు అందాయి. రెండేళ్లలో వారు 5,647 విరాళాలు ఇచ్చారు. అయితే, వారు అందించిన మొత్తం రూ. 193.95 కోట్లు మాత్రమే. ఇది మొత్తం విరాళాల విలువలో సుమారు 14 శాతం. 2024–25లో వ్యక్తిగత విరాళాల సంఖ్య పెరిగినప్పటికీ, వాటి మొత్తం విలువ తగ్గింది. దీనివల్ల మొత్తం విరాళాలలో వారి వాటా గణనీయంగా పడిపోయింది. గుర్తు తెలియని లేదా వివరాలు వెల్లడించని దాతల నుండి వచ్చిన విరాళాలలో భారీ పెరుగుదల ఉన్నట్లు కూడా ఈ నివేదిక పేర్కొంది. 2023–24లో రూ. 6.62 కోట్లుగా ఉన్న ఈ విరాళాలు 2024–25లో రూ. 302.67 కోట్లకు పెరిగాయి. తద్వారా మొత్తం విరాళాల విలువలో వాటి వాటా దాదాపు 29 శాతానికి చేరింది. వివరాలు వెల్లడించని దాతల నుండి అత్యధిక మొత్తాన్ని ద్రావిడ మున్నేట్ర కజగం (డిఎంకె) స్వీకరించింది. ఆ మొత్తం రూ. 300.64 కోట్లు కాగా, ఇది ఆ ఏడాది ఆ పార్టీ పొందిన మొత్తం ప్రకటించిన విరాళాలలో 82 శాతానికి పైగా ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 365.78 కోట్ల విరాళాలను ప్రకటించడం ద్వారా తమిళనాడుకు చెందిన ఆ పార్టీ అత్యధిక విరాళాలు పొందిన పార్టీల జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో రూ. 184.96 కోట్లతో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిసి), రూ. 140.04 కోట్లతో వైఎస్ఆర్ కాంగ్రెస్ ఉన్నాయి. 2023–24లో రూ. 100.19 కోట్లతో తెలుగుదేశం పార్టీ (టిడిపి) అత్యధిక విరాళాలు పొందిన పార్టీగా నిలిచింది. టిఎంసి, వైఎస్ఆర్ కాంగ్రెస్, టిడిపి, ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకె), బిజు జనతా దళ్ (బిజెడి) వంటి పార్టీలు దాదాపు పూర్తిగా కార్పొరేట్, వ్యాపార సంస్థల విరాళాలపైనే ఆధారపడ్డాయని, ఇతర వర్గాల నుండి వచ్చిన విరాళాలు చాలా తక్కువగా లేదా అసలు లేవని నివేదిక పేర్కొంది. ఈ రెండు ఆర్థిక సంవత్సరాల్లో 'ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్' అతిపెద్ద దాతగా నిలిచింది. ఇది 38 విరాళాల ద్వారా రూ. 434 కోట్లను అందించింది. ఆ తర్వాత రూ. 160 కోట్లతో 'టైగర్ అసోసియేట్స్' నిలిచింది. 'ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్', 'వేదాంత లిమిడ్, 'ఎబి జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్' కూడా టాప్ 5 దాతల జాబితాలో ఉన్నాయి. రాజకీయ నిధుల సేకరణలో ఎలక్టోరల్ ట్రస్ట్‌ల ఆధిపత్యం కొనసాగింది. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్, ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్, ఎబి జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ కలిసి రూ. 536 కోట్లను అందించాయి. ఇది ఆ రెండేళ్ల కాలంలో టాప్ 10 దాతలు అందించిన మొత్తం విరాళాలలో దాదాపు 64 శాతానికి సమానం. పాన్ వివరాలు లేని విరాళాల విలువ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ. 7.69 కోట్ల నుండి 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 329.58 కోట్లకు భారీగా పెరిగిందని, ఇది ఆ సంవత్సరంలో వచ్చిన మొత్తం విరాళాలలో 31 శాతానికి పైగా ఉందని నివేదిక వెల్లడించింది. పాన్ వివరాలు లేని విరాళాల సంఖ్య కూడా అంతకుముందు ఏడాది ఉన్న 529 నుండి 2,463కి పెరిగింది. అలాగే, నగదు రూపంలో వచ్చిన విరాళాల విలువ అంతకు ముందు ఏడాది రూ. 6.54 కోట్ల నుండి 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 301.44 కోట్లకు భారీగా పెరిగిందని, అదే సమయంలో చెల్లింపు విధానాన్ని వెల్లడించకుండా రూ. 13.39 కోట్ల విలువైన 1,978 విరాళాలు నమోదయ్యాయని కూడా నివేదిక పేర్కొంది.

# జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలు తీవ్రతరం

- అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్యేల ప్రదర్శనలు
- ప్రభుత్వంతో చర్చలకు 11 మందితో టీం



**న్యూఢిల్లీ :** జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలు తీవ్రతరమయ్యాయి. పరీక్షలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ గత 13 రోజులుగా ఆరుగురు నిరసనకారులు నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, వర్షాకాల సమావేశాల మొదటి రోజే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలోకి వచ్చి నిరసన తెలిపారు. జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో జెపిఎస్‌సి – జెఎస్‌ఎస్‌సి సంస్కరణల మంచ్ ఆధ్వర్యంలో జులై 25న ప్రారంభమైన ఈ నిరసన, ఇటీవలి సంవత్సరాలలో రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద విద్యార్థి నేతృత్వ ఉద్యమాలలో ఒకటిగా నిలిచింది. 14వ జార్ఖండ పిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్షను రద్దు చేయాలని, అలాగే నియామక పరీక్షలో జరిగిన అవకతవకలపై సిబిఐతో గానీ లేదా రాష్ట్రం వెలుపలి నుండి విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తుల బృందంతో గానీ స్వతంత్ర విచారణ జరిపించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి కొద్దిసేపటి ముందు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు నిరసన చేపట్టి, నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాగా, జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మిత్రపక్షం అయినప్పటికీ, జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరసన చేస్తున్న విద్యార్థులకు ఆ పార్టీ మద్దతు ప్రకటించింది. ప్రశ్నాపత్రాల లీక్ సమస్యలు జాతీయ సమస్య అని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వ్యాఖ్యానించారు. ప్రతిష్టంభనను పరిష్కరించడానికి చర్చలకు ముందుకొచ్చారు. బిజెపి ఆరోపణలపై స్పందిస్తూ, విద్యార్థులు లేవనెత్తిన అంశంపై ప్రభుత్వం తీవ్రంగా ఉందని జార్ఖండ్ మంత్రి సుదివ్య కుమార్ అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు 7, 10 తేదీలలో అసెంబ్లీ వద్ద పికెటింగ్ చేయాలని ప్రతిపాదించడంతో, 6 నుండి 12 వరకు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు అసెంబ్లీ భవనానికి 750 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఇదిలా ఉండగా, జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్‌సి) జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్‌ఎస్)లలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలన్న తమ డిమాండ్‌ను నిరసనకారులు కొనసాగించారు. జార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారి మోర్చా (జెఎల్‌కెఎం) నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో చేపడుతున్న నిరాహార దీక్షలో ఇద్దరు మహిళలతో సహా ఐదుగురు నిరసనకారులు చేరారు. ఆయన గత ఐదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు.

**చర్చలకు 11 మందితో బృందం**

ఇదిలా ఉండగా, విద్యార్థులు, ఉద్యోగార్థులు సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు 11 మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేసినట్లు గురువారం ప్రకటించారు. చర్చల కోసం నిరసనకారులకు తమ ప్రభుత్వ ద్వారాలు తెరిచే ఉన్నాయని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చెప్పిన ఒక రోజు తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. 'చర్చల కోసం ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ప్రతిస్పందనగా, ఎనిమిది మంది విద్యార్థులు, ఇద్దరు నిపుణులు (జర్నలిస్టులు), ఒక న్యాయవాదితో కూడిన 11 మంది సభ్యుల ప్రతినిధి బృందాన్ని మేము ఏర్పాటు చేశాము' అని జెపిఎస్‌సి–జెఎస్‌ఎస్‌సి రిఫారమ్స్ మంచ్ కార్యనిర్వాహక అధికారి ఒకరు తెలిపారు. తాము శాంతియుత చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలనుకుంటున్నాము కాబట్టి, పాత్రికేయులు, న్యాయవాది పాత్ర కేవలం మార్గదర్శకత్వం అందించడానికే పరిమితం అవుతుందని ఆ కార్యవర్గ సభ్యుడు అన్నారు.

## గల్లంతైన భారత జాలర్ల ఆచూకీ కోసం
# రంగలోకి శ్రీలంక నౌకాదళం

**కొలంబో:** గల్లంతైనా 11 మంది భారత జాలర్ల ఆచూకీ కోసం శ్రీలంక నౌకాదళం రంగంలోకి దిగింది. శ్రీలంక జలాల్లో భారత పడవ ప్రమాదానికి గురికాగా, అందులోని జాలర్లు గల్లంతైన విషయం తెలిసిందే. చేపల వేటకు ట్రాలర్‌లో వెళ్లిన మత్స్యకారులు, శ్రీలంక జలాల్లోకి ప్రవేశించినప్పుడు ప్రమాదానికి గురైనట్టు సమాచారం. శ్రీలంక ఉత్తర తీరంలోని పాక్ జలసంధి సమీపంలో ఉన్న డెల్ఫ్ట్ ఐలాండ్ (నెడుంథీవు) తీరప్రాంత పగడపు దిబ్బల వద్ద ఈ ప్రమాదం జరిగింది. ట్రాలర్ అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖను దాటి శ్రీలంక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందులోని మత్స్యకారులు చేపల వేట సాగిస్తుండగా, సముద్రంలోని పగడపు దిబ్బను పడవ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనపై స్పందించిన శ్రీలంక నౌకాదళం తక్షణమే సహాయక, రక్షణ చర్యలు ప్రారంభించింది. ఢీకొన్న తీవ్రతకు బోటు నిర్మాణానికి పాక్షికంగా నష్టం వాటిల్లినప్పటికీ, పరిస్థితి విషమించలేదని, బోటులోని మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని శ్రీలంక నౌకాదళ అధికార ప్రతినిధి కమాండర్ చమింద వాలకులుగే తెలిపారు. వారిని రక్షించి, సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు ప్రత్యేక రెస్క్యూ యూనిట్లను సంఘటనా స్థలానికి పంపినట్టు తెలిపారు. కాగా, మత్స్యకారులను రక్షించిన అనంతరం, శ్రీలంక చట్టపరమైన నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని నౌకాదళం ఒక ప్రకటనలో పేర్కొంది.

## లఖింపూర్ హింసాకాండ కేసులో..
# ఆశిష్‌మిశ్రా బెయిల్ షరతుల సడలింపున 'సుప్రీం' నో



**న్యూఢిల్లీ :** లఖింపూర్ ఖేరీ హింసాకాండ (2021)కేసులో ప్రధాన నిందితుడు ఆశిష్ మిశ్రా బెయిల్ షరతులను మరింత సడలించడానికి గురువారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, తన బెయిల్ షరతులను సడలించాలని, కుటుంబ కార్యక్రమాలలో పాల్గొనేందుకు తన స్వగ్రామానికి వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ ఆశిష్ మిశ్రా దాఖలు చేసిన దరఖాస్తును సర్వోన్నత న్యాయస్థానం కొట్టిపారేసింది. ప్రస్తుతం ఉన్న ఆంక్షల కారణంగా ఆశిష్ మిశ్రా తన కుమార్తెల పుట్టిన రోజు వేడుకలు సహా కుటుంబ కార్యక్రమాలకు హాజరుకాలేకపోతున్నారని మిశ్రా తరుపు న్యాయవాది ధర్మాసనానికి విన్నవించారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందిస్తూ ఈ దశలో, మిశ్రా అభ్యర్థనను స్వీకరించడానికి ఎటువంటి ఆధారమూ లేదని చెబుతూ దరఖాస్తును కొట్టివేస్తున్నామని సిజెఐ పేర్కొన్నారు. విచారణ సందర్భంగా బాధిత రైతుల తరపున న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ తన వాదనలు వినిపించారు. విచారణ జరుగుతోన్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ అతివేగం, తొందరపాటుతో జరుగుతున్నందువల్ల ప్రత్యక్ష సాక్షులతో సహా పలువురు కీలక సాక్షులను కూడా తొలగిస్తున్నారని ప్రశాంత్‌భూషణ్ వాదించారు. ఈ ఆందోళనలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ ఒక దరఖాస్తును దాఖలు చేయనున్నట్లు బెంచ్‌కు తెలిపారు. స్పందించిన సిజెఐ, అటువంటి ఫిర్యాదులను తొలుత ట్రయల్ కోర్టులోనే లేవనెత్తాలని అన్నారు.'ఈ అభ్యర్థనను స్వీకరించడానికి మేం ప్రధాన వేదిక ఎందుకు అవుతాం?. మీరు ముందుగా ట్రయల్ కోర్టునే ఆశ్రయించి, వీరే కీలక సాక్షులని తెలియజేయాలి' అని ధర్మాసనం ప్రశాంత్‌భూషణ్‌కు స్పష్టం చేసింది. సాక్షిని ప్రభావితం చేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తిపై ఛార్జిషీట్ దాఖలైన మరోకేసులోని కొన్ని డాక్యుమెంట్లను అనువదించి, వాటిని పరిశీలిస్తున్నారని రైతుల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి తెలిపారు. ఆ వ్యక్తి ఆశిష్ మిశ్రా మద్దతుదారుడన్న వాదనను ఆశిష్ మిశ్రా తరుపు న్యాయవాది వ్యతిరేకించారు. 2021, అక్టోబర్ 3న ఉత్తర్ ప్రదేశ్ లోని లఖింపూర్ ఖేరీ జిల్లాలోని టికునియాలో, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యా ఆ ప్రాంత పర్యటనకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన నిరసన సందర్భంగా నలుగురు రైతులు సహా 8మంది మరణించిన విషయం తెలిసిందే. 2023 డిసెంబర్‌లో ట్రయల్ కోర్టు ఆశిష్ మిశ్రా సహా 12మందిప ఇతరులపై హత్య, నేరపూరిత కుట్ర, ఇతర నేరాలతో సహా పలు అభియోగాలను నమోదు చేసింది.

## 2013లో సహోద్యోగిపై రేప్ కేసులో..
# తెహెల్కా మాజీ సంపాదకుడికి 10ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**బాంబే హైకోర్టు తీర్పు**

**నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం**

**పనాజీ :** సహోద్యోగిపై అత్యాచారం చేసిన (2013) కేసులో మాజీ తెహెల్కా సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్‌ను బాంబే హైకోర్టు దోషిగా నిర్ధారిస్తూ 10ఏళ్ల కఠిన కారాగారశిక్ష విధించింది. ఆయన్ను 5ఏళ్ల క్రితం నిర్దోషిగా విడుదల చేస్తూ గోవా సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును గురువారం బాంబే హైకోర్ట్ పక్కన పెట్టింది. బాంబే హైకోర్ట్ గోవా ధర్మాసనానికి చెందిన జస్టిస్ నీలా గోఖలే, జస్టిస్ అమిత్ జమ్సందేకర్ తరుణ్ తేజ్‌పాల్ రెండు వారాలలో లొంగిపోవాలని ఆదేశించింది. అయితే, తరుణ్ తేజ్‌పాల్ న్యాయవాదుల అభ్యర్థన మేరకు ధర్మాసనం ఆ సమయాన్ని నాలుగు వారాలకు పొడిగించింది. ఈ సంఘటన 13 ఏళ్ల క్రితం జరిగిందని, అప్పటి నుంచి తేజ్‌పాల్ ఏ ఇతర నేరానికీ పాల్పడలేదని పేర్కొన్న కోర్టు, అతనికి కనీస శిక్షను విధిస్తున్నట్లు తెలిపింది. 'ఇరుపక్షాలు (బాధితురాలు, తేజ్‌పాల్) ఇప్పుడు జీవితంలో ముందుకు సాగిపోయి ఉండవచ్చు' అని ధర్మాసనం పేర్కొంది. తేజ్‌పాల్‌పై కోర్టు రూ.10,21,000 జరిమానా కూడా విధించింది. దీనిని బాధితుడికి చెల్లించాల్సి ఉంటుంది. లైంగిక దాడికి గురైన బాధితురాలికి ఈ జరిమానా మొత్తాన్ని అందజేయడం జరుగుతుంది అని తెలియజేసింది. తేజ్‌పాల్ తాను 'ఒక రాజకీయ బాధితుడిని' అని, ఇద్దరు కుమార్తెల తండ్రిని అని పేర్కొంటూ కనికరం చూపాలని ధర్మాసనాన్ని వేడుకున్నారు. అయితే, గోవా ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్తా మాట్లాడుతూ 'కాదంటే కాదు' అనే గట్టి సందేశం పంపడానికి తేజ్‌పాల్‌కు గరిష్ఠ శిక్ష విధించాలని బెంచ్‌ను డిమాండ్ చేశారు. 'ట్రయల్ కోర్ట్ నిర్దోషిత్వ ఉత్తర్వును మేం రద్దు చేస్తున్నాం. ప్రతివాది (తరుణ్ తేజ్‌పాల్) దోషిగా నిర్ధోషించబడ్డాడు' అని ధర్మాసనం పేర్కొంది. దీనిపై తేజ్‌పాల్ స్పందిస్తూ హైకోర్ట్‌కు ఉత్తర్వుకు వ్యతిరేకంగా తాను సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని అన్నారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 376 (2)(ఎఫ్) సంరక్షుడిగా లేదా నమ్మకమైన అధికార స్థానంలో ఉన్న వ్యక్తి ఒక మహిళపై అత్యాచారం చేయడం, 354 (ఏ) లైంగిక వేధింపులు, 354(బి)(ఆమె దుస్తులు తొలగించే ఉద్దేశంతో ఒక మహిళపై నేరపూరిత బలాన్ని ప్రయోగించడం) కింద న్యాయస్థానం అతడిని దోషిగా నిర్ధారించింది. సెక్షన్ 376 (2) (ఎఫ్) కింద పదేళ్ల కఠిన కారాగార శిక్ష, సెక్షన్ 354 (ఏ) కింద ఒక సంవత్సరం, 354 (బి) కింద మూడేళ్ల శిక్షను తరుణ్ తేజ్‌పాల్‌కు ధర్మాసనం విధించింది. అన్ని శిక్షలూ ఏకకాలంలోఅమలు అవుతాయని వెల్లడించింది. ఈ సందర్భంగా తేజ్‌పాల్ తరపు న్యాయవాది అబాద్ పొండా కనిష్ట శిక్షను కోరుతూనే, సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శిక్షను, దోషిగా నిర్ధారణను కనీసం 10వారాల పాటు నిలిపివేయాలని కోర్టును అభ్యర్థించారు. హైకోర్ట్ ఆర్డర్‌కు వ్యతిరేకంగా తాను సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని తరుణ్‌తేజ్‌పాల్ విలేకరులకు తెలియజేశారు. 2013న వంబరులో గోవాలో జరిగిన థింక్ ఫెస్ట్ కార్యక్రమానికి వెళ్లినప్పుడు, ఒక హోటల్ ఎలివేటర్‌లో ఆ సీనియర్ జర్నలిస్ట్ తన మాజీ జూనియర్ సహోద్యోగిపై లైంగిక దాడి చేశారని ఆమె చేసిన ఆరోపణలకు సంబంధించినది ఈ కేసు. 2021లో ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించిన తర్వాత, గోవా ప్రభుత్వం ఆ తీర్పును హైకోర్టులో సవాల్ చేసింది. తేజ్‌పాల్ తరపు న్యాయవాది పొండా మాట్లాడుతూ తరుణ్‌తేజ్‌పాల్ విచారణ జరిగినప్పటి నుంచి బెయిల్‌పైనే ఉన్నాడని, తనపై విధించిన షరతుల్లో దేనినీ ఎప్పుడూ ఉల్లంఘించలేదని, అతను ఇప్పుడు వయోవృద్ధుడని చెప్పారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్తా మాట్లాడుతూ తేజ్‌పాల్ ప్రదర్శించిన నిర్లక్ష్య వైఖరిని , అలాగే, ఆరోపిత సంఘటన అనంతరం బాధితురాలు మామూలుగానే ప్రదర్శిస్తున్నట్లు చిత్రీకరించడాన్ని పరిగణనలోనికి తీసుకుని అతనికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని పేర్కొన్నారు. తేజ్‌పాల్ బాధితురాలిపై ఆధిపత్య ధోరణిలో ఉండేవాడని, బాధితురాలు కేవలం సహోద్యోగి మాత్రమే కాదని, అతని కుమార్తెకు స్నేహితురాలు కూడా అనే విషయంలో ఏ మాత్రం పశ్చాత్తాపం సైతం చూపడం లేదని తుషార్ మెహ్తా తెలిపారు.

# ఉక్రేన్‌పై రష్యా క్షిపణి దాడులు



**కీవ్:** రష్యా సైన్యం ఉక్రేన్‌లోని కీవ్‌తో పాటు పలు ప్రధాన నగరాలపై రాత్రికి రాత్రే బాలిస్టిక్ క్షిపణులతో భారీ దాడులు జరిపింది. ఈ దాడుల్లో తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం సంభవించిందని ఉక్రేన్ ప్రకటించింది. పెరిగిన రష్యా వైమానిక దాడులను తట్టుకోవడానికి తమకు వెంటనే అదనపు గగనతల రక్షణ వ్యవస్థలను అందించాలని నాటోతోపాటు పాశ్చాత్య దేశాలకు కూడా ఉక్రేన్ అధ్యక్షుడు వ్లాదొమిర్ జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. కాగా, ఉక్రేన్ బలగాలు రష్యా సరిహద్దులకు చాలా దూరంలో ఉన్న చమురు శుద్ధి కర్మాగారాలపై రాత్రికి రాత్రే డ్రోన్లతో దా డులు చేశాయి. రష్యా యుద్ధ ఆధారిత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతో పాటు క్రెమ్లిన్‌పై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్టు జెలెన్స్కీ ధ్రువీకరించారు. ఫ్రంట్‌లైన్‌కు దాదాపు 1,300 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాష్కొర్టోస్తాన్, యారోస్లావ్ల్ ప్రాంతాల్లోని రిఫైనరీలతో పాటు నల్లసముద్రంలో రష్యా మిలిటరీ పట్రోలింగ్ పడవలు, షాడో ఫ్లీట్ నౌకలపై కూడా దాడులు చేశామని ఆయన తెలిపారు. మరోవైపు తమ భూభాగంపైకి వచ్చిన 605 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేశామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అదే సమయంలో రష్యా ప్రయోగించిన గ్లైడ్ బాంబులు, క్షిపణి దాడుల కారణంగా ఉక్రేన్‌లోని ఖార్కివ్, సుమీ, ఖేర్సన్ ప్రాంతాల్లో ముగ్గురు పౌరులు మరణించగా, 22 మంది గాయపడ్డారు. ప్రస్తుతం రష్యా తీవ్రమైన బాలిస్టిక్ క్షిపణి దాడులు కొనసాగిస్తుండడంతో, ఉక్రేన్ వద్ద గగనతల రక్షణ వ్యవస్థల కొరత ఏర్పడింది. వీటిని అడ్డుకోవడానికి అవసరమైన పేట్రియాట్ వంటి ఇంటర్‌సెప్టర్ క్షిపణులను అత్యవసరంగా సరఫరా చేయాలని జెలెన్స్కీ కోరుతున్నారు. ఉక్రేన్ నిరోధక శక్తిని క్రమంగా క్షీణింపజేయాలని రష్యా భావిస్తున్న తరుణంలో ఈ ఆర్మమెంట్ సరఫరా అత్యంత కీలకమని ఆయన నొక్కిచెప్పారు. దాడి, ప్రతిదాడులు కొనసాగుతున్న కారణంగా, రష్యా–ఉక్రేన్ మధ్య శాంతి స్థాపన సాధ్యం కావడం లేదని పరిశీలకుల అభిప్రాయం ఇలావుంటే, జర్మనీలోని లైప్జిగ్ విమానాశ్రయంలో ఉక్రేన్‌కు చెందిన విమానాలు నిలిపి ఉంచిన స్థలానికి సమీపంలో పేలుడు పదార్థాలతో నిండి ఉన్న ఒక డ్రోన్‌ను జర్మన్ అధికారులు గుర్తించారు. తక్షణమే స్పందించిన భద్రతా బలగాలు ఆ డ్రోన్ డిటోనేటర్‌ను తొలగించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన జర్మనీ హోంశాఖ అధికారులు, ఇది తమ దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరమైన కొత్త స్థాయి సవాలని పేర్కొన్నారు. రష్యా–ఉక్రేన్ యుద్ధం కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా, ఐరోపా సమాఖ్య దేశాల భద్రతకూ తీవ్ర ముప్పుగా మారుతోందని ఈ ఘటనలు స్పష్టం చేస్తున్నాయిచేస్తున్నాయి.

# ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారుల నిరసన ప్రదర్శనలు





**పెషావర్:** పాకిస్తాన్ మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పిటిఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇమ్రాన్‌ను అరెస్టు చేసి, జైలుకు తరలించి మూడు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో పిటిఐ ఇచ్చిన పిలుపు మేరకు వేలాది మంది కార్యకర్తలు, నాయకులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. పిటిఐ అధికారంలో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా రాజధాని పెషావర్ నగరం ఈ నిరసనలకు ప్రధాన కేంద్రంగా మా రింది. లాహోర్, మియాన్‌వాలీ, రావల్పిండి వంటి ప్రాంతాల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. భారీ భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీస్‌లు, లాఠీచార్జి చేసి ప్రదర్శనకారులను చెదరగొట్టారు. వందమందికిపైగా కార్యకర్తలు, నాయకులను అరెస్టు చేశారు. లాహోర్‌లోని మాల్ రోడ్‌లో జరిగిన నిరసనలలో ఐదుగురు ఎంపిలతో సహా 25 మందికి పైగా అరెస్టయ్యారు. కరాచీలోని సద్దార్ టౌన్ ప్రాంతంలో ప్రదర్శనకారులను చెదరగొట్టడానికి పోలీసులు భాష్పవాయువును ప్రయోగించారు. 10 మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. వార్తలను సేకరిస్తున్న పలువురు జర్నలిస్టులపై కూడా పోలీసులు దాడులకు తెగబడటంతో కొన్ని చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడుల పట్ల మీడియా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇలావుంటే, తమ సోదరుడి విడుదల కోసం ప్రజా ఉద్యమం ప్రారంభమైందని, త్వరలోనే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని ఇమ్రాన్ సోదరి అలీమా ఖాన్ తెలిపారు. జైలులో ఇమ్రాకు సరైన వైద్య సదుపాయాలు అందించడం లేదని, ఆయన కంటిచూపు కూడా మందగించిందని మాజీ కేంద్ర మంత్రి మూనిస్ ఎలాహి ఆరోపించారు. ఇమ్రాన్ స్వేచ్ఛను హరించినంత మాత్రాన ఆయన దృఢ సంకల్పాన్ని లేదా ధైర్యాన్ని దెబ్బతీయలేరని పిటిఐ నాయకుడు షెహర్యార్ అఫ్రిది వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఈ ఘటనలపై స్పందిస్తూ, గడచిన మూడేళ్లుగా ఇమ్రాన్‌కు న్యాయబద్ధమైన విచారణ పొందే హక్కును పాకిస్తాన్ ప్రభుత్వం నిరాకరిస్తోందని పేర్కొంది. ఆయనను సుదీర్ఘకాలంగా ఏ కాంత నిర్బంధంలో ఉంచారని, సరైన వైద్యం అం దించడం లేదని తెలిపింది. కుటుంబ సభ్యుల కలయికను నిరాకరించడం దురదృష్టకరమని విమర్శించింది. గత ఎనిమిది నెలలుగా ఆయన కుటుంబ సభ్యులను కలవడానికి అనుమతి ఇవ్వలేదని, డిసెంబర్ 2025 నుండి ఇమ్రాన్ దంపతులకు న్యాయవాదుల సంప్రదింపులను రాజకీయ లబ్ధి కోసమే ఇమ్రాన్‌పై కేసులు మోపినట్టు పిటిఐ ఆరోపిస్తుండగా, షాబాజ్ షరీఫ్ ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తోంది.

# కాంగోలో ఆరోగ్య సిబ్బంది నిరసన




**బునియా:** కాంగోలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఎబోలా వ్యాప్తిని అరికట్టేందుకు కృషి చేస్తున్న వందలాది మంది ఆరోగ్య సిబ్బంది తమకు రావలసిన బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం నిరసనకు దిగారు. ఇటురి ప్రావిన్స్ రాజధాని బునియాలోని గవర్నర్ కార్యాలయం వద్ద ఈ నిరసన చేపట్టారు. దేశంలోని మొత్తం ఎబోలా కేసుల్లో దాదాపు 90 శాతం ఈ ప్రాంతంలోనే నమోదవుతున్నాయి. మే నెల మధ్యలో ఎబోలా వ్యాప్తి ప్రారంభమైనప్పటి నుండి తమకు అందవలసిన జీతాలు, అలవెన్సులు అందలేదని, అందువల్ల పలు ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నుండి తాము బయటకు వచ్చి నిరసన తెలుపుతున్నామని నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బంది తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం ఇలాగే ఉంటే ఈ ప్రావిన్స్‌లో ఎబోలా అదుపులోకి రావడం అసాధ్యమని నిరసనకారులు వ్యాఖ్యానించారు. గతంలో వేతనాల జాప్యానికి సాంకేతిక, రవాణా కారణాలను చెప్పిన ప్రభుత్వం, తాజా నిరసనలపై తక్షణమే స్పందించని విషయాన్ని కూడా వారు ప్రస్తావిస్తున్నారు. కాంగోలో ఇప్పటివరకు సంభవించిన ఎబోలా విజృంభణలలో ఇది రెండవ అతిపెద్దదిగా నమోదైంది. ఎబోలాపై పోరాడుతున్న విపత్కర పరిస్థితుల్లో సిబ్బందికి తగిన వేతనాలు లభించకపోవడంతో పాటు, ఇక్కడ తిరుగుబాటుదారులు, స్థానిక గుంపుల నుండి దాడుల ముప్పు కూడా పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధానోమ్ గెబ్రెయేసస్ మరియు 'డాక్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్' వంటి అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. వ్యాధి వ్యాప్తి గొలుసును తెంచడానికి సహాయక చర్యలు మరింత వేగవంతం కావాలని వారు హెచ్చరించారు.

## వసూలు చేసిన అదనపు టారిఫ్‌లను

# తిరిగి చెల్లిస్తున్న అమెరికా

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాలు ప్రపంచ దేశాలతోపాటు, స్వదేశాన్ని కూడా ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. వివిధ దేశాలపై ట్రంప్ విధించిన అదనపు టారిఫ్‌ల చెల్లుబాటును రద్దు చేసిన అమెరికా సుప్రీం కోర్టు, ఆ మొత్తాలను తిరిగి చెల్లించాల్సిందిగా ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం వివిధ దిగుమతిదారులకు ఏకంగా 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8.4 లక్షల కోట్లు) సుంకాలు తిరిగి చెల్లించే ప్రక్రియను ప్రారంభించింది. ఆమోదించిన అత్యవసర అధికారాలను ఉపయోగించి వివిధ దేశాలపై ట్రంప్ విధించిన అదనపు పన్నులను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో అమెరికా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. గతంలో కంపెనీల నుండి వసూలు చేసిన పన్నుల మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించడా

### బెడిసికొడుతున్న అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలు



నికి అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ అవసరమైన కీలక లాంఛనాలను పూర్తి చేస్తోంది. టారిఫ్‌ల విషయంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు చైనా, యూరప్, భారతదేశాలతో అమెరికా వాణిజ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అమెరికాకు విదేశాల నుండి దిగుమతయ్యే జెనెరిక్ మందులపై దశలవారీగా భారీ టారిఫ్‌లను ప్రతిపాదించడం వల్ల, భారత ఫార్మా రంగానికి ఎదురుదెబ్బ తగిలింది. అదే సమయంలో, మందుల ధరలు విపరీతంగా పెరగడంతో అమెరికాలోని రోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాగా, చైనా, ఐరోపాలతో చిప్ సప్లై చైన్ మౌలిక వనరులు, తయారీ రంగాల పట్ల ట్రంప్ తీసుకొంటున్న నిర్ణయాలు గ్లోబల్ సప్లై చైన్‌ను మళ్ళీ అనిశ్చితిలోకి నెట్టివేస్తున్నాయి. అయితే, వివిధ ఫెడరల్ కోర్టులతోపాటు, సుప్రీం కోర్టు కూడా వివిధ కేసులపై ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వడంతో పరిస్థితి క్రమంగా చక్కబడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో వస్తువుల ధరలు, సరఫరా వ్యవస్థలపై రాబోయే రోజుల్లో స్పష్టమైన మార్పులు రావచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

# పర్యావరణ అనుమతులు

(మొదటి పేజీ తరువాయి)

విస్తరించిన ఫేజ్1బి ఇందులో భాగంగా ఉన్నాయి. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను సియాకు సమర్పించింది. వీటిలో నదీ శిక్షణ పనులు, వరద నియంత్రణ చర్యలు, మురుగునీటి పారుదల కాలుష్య నివారణ మౌలిక సదుపాయాలు, నదీ తీర స్థిరీకరణ, పర్యావరణ పునరుద్ధరణ, రివర్‌ఫ్రంట్ రోడ్లు, ప్రోమినేడ్లు, బహిరంగ ప్రదేశాలు, యుటిలిటీ మౌలిక సదుపాయాల ప్రణాళికలు ఉన్నాయి.

**రహదారులు, పచ్చదనానికి పెద్దపీట**

మొబిలిటీ మౌలిక సదుపాయాల్లో భాగంగా 30 మీటర్ల (100 అడుగుల) రోడ్లు, సర్వీసు రోడ్లు, పాదచారుల మార్గాలు, సైక్లింగ్ ట్రాక్లు, నదిపై వంతెనలు, యుటిలిటీ కారిడార్లు ప్రతిపాదించారు. బహుళ అంతస్తుల ప్రోమినేడ్లు, పార్కులు, పబ్లిక్ ప్లాజాలు, వ్యూయింగ్ డెక్లు, సాంస్కృతిక ప్రదేశాలు పబ్లిక్ రియల్మ్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఉండగా, రిపేరియన్ ఆవాస పునరుద్ధరణ, స్థానిక మొక్కల పెంపకం, చిత్తడి నేలల అభివృద్ధి, హరిత కారిడార్లు, జీవవైవిధ్య పెంపుదల, వాతావరణ అనుకూల ప్రకృతి దృశ్యాలు పర్యావరణ పునరుద్ధరణలో భాగంగా ఉన్నాయి. మొత్తం 200 హెక్టార్ల అభివృద్ధి ప్రాంతంలో అత్యధికంగా 64 హెక్టార్లకు పైగా రోడ్ల నిర్మాణానికి కేటాయించారు. హరిత ప్రదేశాలకు దాదాపు 56 హెక్టార్లు, కరకట్టనదీ రక్షణ చర్యలకు 52 హెక్టార్లకు పైగా, యుటిలిటీలకు 22 హెక్టార్లకు పైగా కేటాయించగా, నిర్మిత ప్రాంతం కేవలం రెండు హెక్టార్లకే పరిమితమైంది. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా 32,000 చదరపు మీటర్ల స్థలాన్ని చూపారు.

**భూసేకరణ, నిర్వాసితుల వివరాలు**

200 హెక్టార్లలో 64 హెక్టార్లకు పైగా ప్రభుత్వ భూమి, దాదాపు 59 హెక్టార్లు పట్టా భూమి, 51 హెక్టార్లు నదీ ప్రాంతం కాగా, 12 హెక్టార్లకు పైగా రక్షణ శాఖ భూమి ఉంది. ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతంలో సుమారు 639 శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలను గుర్తించినట్లు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. వీటిని 2013 నాటి భూసేకరణ, పునరావాసంపునరావాసం చట్టం (సరసమైన పరిహారం, పారదర్శకత) ప్రకారం సేకరిస్తారు. ఈ ప్రాజెక్టు వల్ల సుమారు 2,660 చెట్లు ప్రభావితం కానున్నాయి.

**ఈ ప్రాజెక్ట్ తొలిదశను రెండు భాగాలుగా చేపడుతున్నారు..**

**ఫేజ్–1ఎ :** హిమాయత్ సాగర్ నుండి బాపుఘాట్ వరకు 9.2 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేస్తారు.

**ఫేజ్–1బి :** ఉస్మాన్ సాగర్ నుండి బాపుఘాట్ వరకు 11.3 కిలోమీటర్ల మేర పనులు నిర్వహిస్తారు.







# దేశంలో దొంగల రాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి నిరుద్యోగ భారతాన్ని తయారు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో దేశ యువత క్రియాశీలక పాత్ర పోషిస్తూ చేసిన పోరాటం దేశం చరిత్రలోనే చిరస్మరణీయమని, ఆ పోరాటానికి కేంద్రం దిగిరాక తప్పలేదని, యువత దెబ్బకు విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు.యువతరం తలుచుకుంటే ఏదైనా సాధ్యమే అని దేశతలరాతని మార్చే సత్తా యువతకే ఉందన్నారు. కేంద్రంలో సాగుతున్న నిరంకుశ పాలన వల్ల ధరలు పెరిగిపోతున్నాయని, సార్వత్రిక విద్య వైద్యం అందుబాటులో లేదని, యువత నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్నారని పంటలకు కనీస మద్దతు ధర లేదని, కార్మిక హక్కులు కాలరాస్తున్నారని, దళితులు ఆదివాసీలపై అకృత్యాలు నానాటికీ పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను ఇప్పటికైనా నిలుపుకోవాలన్నారు. హైదరాబాద్ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ నిర్మించడం సరేనని, కానీ రాష్ట్రంలో పేదల ఇళ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పెండిగ్ సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవచూపాలని చెప్పారు. ఓట్ల కోసం కమ్యూనిస్టులతో స్నేహం చేసి ఆ తర్వాత బోడమలయ్య చందంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. మాకు కుర్చీలు అవసరం లేదని ప్రజల పక్షాన అనునిత్యం పోరాటాలు సాగిస్తూనే ఉంటామని చెప్పారు. కమ్యూనిస్టులను తక్కువ చేసి చూస్తే కాంగ్రెస్‌కు కూడా బిఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని చెప్పారు. తమ సంఖ్య మీకు తక్కువే కనబడవచ్చు గానీ రాష్ట్రంలో అధికారం నుంచి దించేది, అధికార పీఠం ఎక్కించేది కమ్యూనిస్టులే అని చెప్పారు. ఇప్పటికైనా పొత్తు ధర్మాన్ని పాటించాలని హితవు పలికారు. తలాపునే గోదావరి జలాలు ఉన్నా జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీరు అందడం లేదని, సీతారామ, సీతమ్మధారా ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను ఇతర జిల్లాలకు తరలించుకుపోయే ప్రయత్నం సాగిస్తున్న పాలకులు ఈ జిల్లాకు సాగునీరు అందించిన తర్వాతే ఇతర జిల్లాలకు తరలించుకుపోవాలని చెప్పారు. లేదంటే ఉద్యమాల ద్వారా తమ జలాలను తాము దక్కించుకుంటామని చెప్పారు. జిలాల్లో మిగిలిన పోడు భూములకు పట్టాలివ్వాలని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు బిల్లులు మంజూరు చేయాలని తరతరాలుగా గిరిజనులతో పాటు సహజీవనం సాగిస్తున్న వారికి భూ హక్కులు కల్పించాలని ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి హేతుబద్ధమైన పరిహారం ఇవ్వాలని, పాలుసు బొంత ప్రాజెక్టును పూర్తి చేయాలని, బిటిపిఎస్ నిర్వాసితులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రచట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డిపుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మున్నా లక్ష్మీ కుమారి, ఎస్‌డి సలీం, కే సారయ్య, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, కమటం వెంకటేశ్వరరావు, మువ్వా వెంకటేశ్వరరావు రేసు ఎల్లయ్య దేవరకొండ శంకర్ యు రాహుల్ ఎస్‌కే ఫహీమ్, మహిళా సమాఖ్య, విద్యార్థి యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం : తక్కళ్లపల్లి**

దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం ప్రారంభించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. హనుమకొండ జిల్లాలోని కాజీపేట పట్టణంలో పాదయాత్రను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పాదయాత్ర కాజీపేటలోని వాటర్ ట్యాంక్ నుండి ప్రారంభమై కాజీపేట మార్కెట్, మడికొండ నుండి ధర్మ సాగర్ మండలం రాంపూర్, పెద్ద పెండ్యాల, ధర్మ సాగర్,సాయి పేట, ముప్పారం, పీచర, వేలేరు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ప్రజాకంతక పాలన కొనసాగిస్తున్న బిజెపి పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. గతంలో సంవత్సర కాలం పాటు కొనసాగిన రైతు ఉద్యమంతో పాటు ఇటీవల దేశ రాజధాని డిల్లీలో పెద్ద ఎత్తున జరిగిన విద్యార్థి, యువజనుల ఆందోళననే ఇందుకు నిదర్శనం అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని అన్నారు. రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని,స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం కింద తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఇందులో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న బయ్యారం ఉక్కు కర్మాగారం, ములుగు గిరిజన విశ్వవిద్యాలయం వంటివి ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి , సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, ఎన్. అశోక్ స్టాలిన్,బత్తిన సదానందం, ఉట్కూరి రాములు, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, ఏశబోయిన శ్రీనివాస్, కొట్టె వెంకటేశ్, శనిగరపు రాజ్ కుమార్, రాసమల్ల దీనా, గుంటి రాజేందర్, ప్రజానాట్యమండలి నాయకులు రొంటాల శ్యామ్,డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్, మాలోతు మంగ, మమత, కుడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలపక్షాన పనిచేయకుంటే పరాభావం తప్పదు**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా హెచ్చరిక**

ప్రధాని మోదీ తన 12 ఏళ్ల పాలనలో ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ల కోసమే పని చేశారని, ఈ మిగిలిన మూడేళ్లైనా దేశ ప్రజల కోసం పని చేయాలని లేకపోతే ఘోర పరాభావం తప్పదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా హెచ్చరించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుచి లిబర్టీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ప్రారంభ పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ.టి నరసింహా మాట్లాడుతూ మోదీ పాలనతో యువత, కార్మికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి జీవితాల్లో ఏలాంటి మార్పు రాలేదన్నారు. బిజెపి ప్రభుత్వం 100 కుటుంబాలకు లాభం చేకూర్చడం తప్ప దేశ ప్రజలకు చేసిందేమిలేదని విమర్శించారు. ప్రధాని మోదీ ఓ నియంతలా వ్యవహరిస్తున్నారని, గతంలో ఈలాంటి నియంతలంతా కూడా ఆత్మహత్యలు చేసుకుని చనిపోయే పరిస్థితి వచ్చిందన్న విషయం మర్చిపోవద్దని హితువు పలికారు. తన చుట్టూ ఉన్న ఈడి, సిబిఐ, మరొక సంస్థతోనో తనకు ఉన్న లక్ష మంది వాట్సాప్ యూనివర్సిటీతోనో పిల్లలను బెదిరిస్తానుకుంటే కుదిరే పరిస్థితి లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న యువతను బెదిరించే ప్రయత్నాలను సిపిఐ సహించబోదని ఆయన హెచ్చరించారు. అవసరమైతే జైళ్లకు వెళ్లేందుకు సిద్దంగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నరసింహ, బి.వెంకటేశం, ఎన్.శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి, వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు నుంచి పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రేషన్ కార్డుల పంపిణీని చేపడుతోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ప్రారంభోత్సవం నిర్వహించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డిఓ) సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. లబ్ధిదారుల జాబితాల ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తూ, ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పాలనలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు.

# 'క్యా బోల్తీ పబ్లిక్'

(మొదటి పేజీ తరువాయి)

దీప్కే వచ్చే నెలలో 'క్యా బోల్తీ పబ్లిక్' ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, అందులో భాగంగా దేశంలోని ప్రస్తుత పరిస్థితులపై ప్రజల అభిప్రాయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటామన్నారు. విద్యార్థుల ఆందోళన ఫలితంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అతిపెద్ద విజయంగా అభివర్ణిస్తూ, 'గత 10–12 ఏళ్లుగా ప్రజల మనసుల్లో ఈ ప్రభుత్వం సృష్టించిన భయం ఇప్పుడు తొలగిపోయిందని దీప్కే పేర్కొన్నారు. ఇప్పుడు ప్రజలు వీధుల్లోకి వస్తారని, నేడు వారు ఒక వ్యక్తి రాజీనామాను కోరారు.. రేపు ఇతరుల రాజీనామాలను కూడా డిమాండ్ చేస్తారన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, పండిట్ నెహ్రూ కన్న కలలకు అనుగుణంగా సిజెపి పనిచేస్తుందని చెప్పారు. భారత రాజ్యాంగమే తమ సిద్ధాంతమని దీప్కే స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిజెపి ప్రధాన ప్రతినిధి సౌరవ్ దాస్, ప్రతినిధి అశుతోష్ రంకా, ఇతర ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. నీట్ పేపర్ లీక్, ఇతర పరీక్షల అక్రమాలపై గత నెలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిజెపి ఆధ్వర్యంలో జరిగిన నిరసనల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. జంతర్ మంతర్ నిరసనలో విద్యార్థులే కాకుండా, ఉద్యోగాలు లేని యువత కూడా పాల్గొన్నారని దీప్కే తెలిపారు. 'నిరుద్యోగం ఒక ప్రధాన సమస్య; మేము దీనిని దేశవ్యాప్త సమస్యగా మారుస్తాం. విద్యా సంస్కరణల కోసం కృషి చేస్తాం. పాఠశాల స్థాయి నుంచే విద్య సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. విద్యను లాభాలు గడించడానికి వాడుకుంటున్నారు. కానీ మేము ఆ పరిస్థితిని మార్చాలనుకుంటున్నాము' అని ఆయన అన్నారు. దేశంలో 60 శాతం మంది ప్రజలు 35 ఏళ్ల లోపు వయస్సు వారేనని, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన వారిలో కూడా అటువంటి వారే ఉన్నారని దీప్కే పేర్కొన్నారు. మీడియా విశ్వసనీయతను తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఉందని కూడా సిజెపి వ్యవస్థాపకుడు అన్నారు.

# ప్రజాసమస్యలు పక్కదారి

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పనులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరారు.జిల్లాలో ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని, బోరు బావులపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఎండిపోతున్న వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టపోయిన రైతులకు వెంటనే పంట నష్టం పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జిల్లాలోని అన్ని మండలాలు,గ్రామాల్లో పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ప్రచార జీపు యాత్రలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నల్లగొండయాదాద్రి భువనగిరి జిల్లాల కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం,తీర్పారి వెంకటేశ్వర్లు, బచ్చనగోని గాలయ్య, జిల్లా సమితి సభ్యులు బొమ్మరబోయిన లాలయ్య, గట్టుపల్లి నర్సిరెడ్డి,మండల కార్యదర్శి చాపల శ్రీను,ఈదులకంటి కైలాస్, ఉప్పునూతల రమేష్, గోస్కొండ లింగయ్య, వనం వెంకన్న, కాగిత వెంకన్న,బండారు శంకర్,కట్కూరు లింగస్వామి,గోపగోని ఉదయ్, కార్మిక, హమాలి సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### ఆసియా కప్ షెడ్యూల్ విడుదల..

# సెప్టెంబర్ 5న భారత్, పాకిస్థాన్ మ్యాచ్



ఆసియా దేశాలు పోటీపడే ఈ మెగా టోర్నీకి దుబాయ్ ఆతిథ్యమిస్తోందని, ఆగస్టు నెలఖరులో మ్యాచ్‌లో ప్రారంభం కానున్నాయని ఆసియా క్రికెట్ మండలి(ఎసిసి) తెలిపింది. క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ మళ్లీ చూసే అవకాశం రాబోతోంది. ఇటీవలే మహిళల వన్డే ప్రపంచకప్లో తలపడిన దాయాదులు ఈసారి ఆసియా కప్(2026)లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆసియా దేశాలు పోటీపడే ఈ మెగా టోర్నీకి దుబాయ్ ఆతిథ్యమిస్తోందని, ఆగస్టు నెలఖరులో మ్యాచ్లు ప్రారంభం కానున్నాయని ఆసియా క్రికెట్ మండలి(ఎసిసి) తెలిపింది. గురువారం టోర్నీ షెడ్యూల్ విడుదల చేసింది ఏసీసీ.ప్రతిష్ఠాత్మక మహిళల ఆసియా కప్ షెడ్యూల్ వచ్చేసింది. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నామని గురువారం ఆసియా క్రికెట్ మండలి వెల్లడించింది. ఆగస్టు 28 నుంచి పోటీలు మొదలవుతాయని పేర్కొన్న ఏసీసీ.. అందరూ ఆసక్తి కనబరిచే భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 5న జరుగనుందని చెప్పింది.

**టాప్ 2 జట్లు సెమీస్‌కు**

రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగనున్న ఆసియా కప్లో గ్రూప్ ఎ, గ్రూప్ బిలో ఐదేసి జట్లున్నాయి. భారత్, పాకిస్థాన్, చైనా, హాంకాంగ్, థాయ్లాండ్ మొదటి గ్రూప్‌లో.. ఆతిథ్య యూఇఎ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియాలు గ్రూప్ బీలో ఉన్నాయి. లీగ్ దశలో పాక్తో పాటు చైనా, హాంకాంగ్, థాయ్లాండ్‌కు టీమిండియా ఢీకొట్టనుంది.ప్రతి గ్రూప్ నుంచి టాప్ 2 జట్లు సెమీస్కు వెళ్తాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్తో విజేత ఎవరో తేలిపోనుంది.

## దక్షిణాఫ్రికా పర్యటనలో కీలక మార్పు



డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత జట్టు మూడు ఫార్మాట్ల సిరీస్ ఆడనుంది. తొలుత బిసిసిఐ, సిఎస్ఏ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏకైక టెస్టు, ఆపై వన్డే సిరీస్తో పర్యటన ముగియాలి. లార్డ్స్ టెస్టులో ఘన విజయంతో జోరు మీదున్న భారత మహిళల జట్టు మళ్లీ బిజీ కానుంది. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది టీమిండియా. అయితే.. ముందుగా అనుకున్న వన్డేలు, ఏకైక టెస్టుకు అదనంగా టీ20 సిరీస్ను చేర్చింది క్రికెట్ సౌతాఫ్రికా. ఈ విషయాన్ని గురువారం సఫారీ బోర్డు అధికారికంగా వెల్లడించింది. పటిష్ఠమైన టీమిండియాతో మూడు ఫార్మాట్ల సిరీస్ నిర్వహించడం తమ దేశ క్రికెట్‌కు మరింతగా ఉపయోగపడుతుందని సీఎస్ఏ భావిస్తోంది. డిసెంబర్లో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్న భారత జట్టు మూడు ఫార్మాట్ల సిరీస్ ఆడనుంది. తొలుత బిసిసిఐ, సిఎస్ఏ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏకైక టెస్టు, ఆపై వన్డే సిరీస్‌తో పర్యటన ముగియాలి. కానీ, ఈ రెండు ఫార్మట్లకు అదనంగా టీ20 సిరీస్ను కలిపింది క్రికెట్ దక్షిణాఫ్రికా. బిసిసిఐ అందుకు అమోదించడంతో ఈ విషయాన్ని గురువారం వెల్లడించింది సిఎస్ఏ. భారత జట్టుతో మ్యాచ్‌లకు ప్రేక్షకాదరణ నేపథ్యంలో మూడు టీ20ల సిరీస్‌ను ఆడించాలని నిర్ణయించింది ఆ దేశ బోర్డు. దాంతో, వన్డే సిరీస్ అనంతరం పొట్టి క్రికెట్‌లో తలపడనున్నాయి ఇరు జట్లు.

## నా 'ఆల్టైమ్ రికార్డు'ను వైభవ్ బ్రేక్ చేస్తాడు..!



టీ20ల్లో తుఫాన్ బ్యాటింగ్‌తో అలరిస్తున్న వైభవ్ సూర్యంశీ ఆటకు జోస్ బట్లర్ ఫిదా అవుతున్నాడు. విధ్వంసక ఓపెనర్‌గా ఎన్నో ధనాధన్ ఇన్నింగ్స్‌లో ఆడిన బట్లర్.. ది హండ్రెడ్ లీగ్‌లో మెరుపు అర్ధ శతకం బాదాడు. దాంతో, టీ20ల్లో కీరన్ పొలార్డ్ పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును పట్టేశాడీ మాజీ కెప్టెన్. ప్రస్తుతం బట్లర్ ఖాతాలో 14,833కు పైగా రన్స్ ఉన్నాయి. అయితే.. తన రికార్డు ఏమంత పదిలం కాదని, భవిష్యత్‌లో ఎవరో ఒకరు తనను అధిగమిస్తారని చెప్పాడీ డాషింగ్ బ్యాటర్. ప్రస్తుతం టీ20ల్లో బట్లర్ 14,833 రన్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మాజీ ఆటగాళ్లు పొలార్డ్ 14,803, క్రిస్ గేల్ 14,562 పరుగులు, అలెక్స్ హేల్స్ 14,449, డేవిడ్ వార్నర్ 14,284 రన్స్ సాధించారు. వైభవ్ విషయానికొస్తే.. ఫ్రాంచైజీ, అంతర్జాతీయ టీ20ల్లో ఈ చిచ్చరపిడుగు 40 ఇన్నింగ్స్‌నే ఏకంగా 1,670 పరుగులు బాదేశాడు.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### ప్రపంచంలో 'జనపనార ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?

- మనదేశంలో ఎక్కువసార్లు ప్రవేశపెట్టిన అత్యవసర సరిస్థితి ఏది?
  రాజ్యాంగబద్ధ అత్యవసర పరిస్థితి
- పూర్ణ స్వరాజ్యం తమ లక్ష్యమని ప్రకటించిన సమావేశం?
  లాహోర్ సమావేశం
- నాజీ పార్టీ గుర్తు ఏమిటి?
  స్వస్తిక్
- సైమన్ కమిషన్ భారతదేశ పర్యటన?
  1927
- మానవుడిలో చక్కని ఆలోచనకు కారణమైన మెదడు భాగం?
  మస్తిష్కం
- పోలవరం ప్రాజెక్టుకు పెట్టిన పేరు
  ఇందిరాసాగర్
- వేప శాస్త్రీయ నామము
  అజా రక్తా ఇండికా
- తల్లిపాలలో ఉండే విటమిన్
  విటమిన్ 'ఎ'
- పశ్చిమంగా ప్రవహించే నది?
  తపతి
- మొక్కల నుండి వచ్చు ఆహారంలో వుండని విటమిన్
  విటమిన్ 'డి'
- చంపారన్ సత్యాగ్రహ ముఖ్యాంశం?
  నీలిమందు
- భారతదేశంలో ఎవరికాలంలో మొదటిసారిగా రైలు మార్గం వేశారు?
  డల్హౌసీ
- మోతీలాల్ నెహ్రూ స్థాపించిన పార్టీ?
  స్వరాజ్ పార్టీ
- వృక్షాయుర్వేదం గ్రంథాన్ని వర్గీకరణను ప్రతి పాదించింది?
  పరాశరుడు
- చౌరీచౌరా సంఘటన?
  1922
- హిమాలయ పర్వత రాజ్యంగా పేర్గాంచింది.
  నేపాల్
- 'విటమిన్ సి' లోపం వల్ల కలిగే వ్యాధి
  స్కర్వి
- కేంద్రంలో ఎగువ సభ
  రాజ్యసభ
- 'త్రిషష్టి సలక పురుష చరిత' అనే గ్రంథాన్ని రచించిన జైన పండితుడు ఎవరు?
  హేమచంద్రుడు
- గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించినది?
  1920
- కిందివాటిలో వైరస్ వ్యాధి కానిదేది?
  మానవుడు – క్షయ
- నల్లజాతివారి హక్కుల కొరకు గాంధీజీ ఈ దేశంలో పోరాడాడు?
  దక్షిణాఫ్రికా
- కిందివాటిలో బౌద్ధమత సంగీతి జరగని ప్రదేశం ఏది?
  సారానాథ్
- కిరణజన్య సంయోగక్రియలో క్రిందివాటిలో ఏది విడుదల అవుతుంది?
  ఆక్సిజన్
- మన రాష్ట్రంలో కెల్లా పెద్ద అడవులు
  నల్లమల అడవులు
- ఆఫ్రికాలో పెట్రోలియం లభించు నదీలోయ
  నైజర్
- వాక్సినేషన్ కనిపెట్టిన సంవత్సరం
  1776



- ఒక మైక్రోమీటర్
  100 nm
- జింబాబ్వే రాజధాని
  హరారే
- ముట్టుకుంటే ముడుచుకునే పువ్వు
  అత్తిపత్తి
- రిపబ్లిక్ గ్రంథ రచయిత:
  ప్లేటో
- మొదటి సాధారణ ఎన్నికలు జరిగిన సంవత్సరం
  1952
- గాంధీజీ జన్మించిన తేది?
  1869 అక్టోబర్ 2
- 'కౌండిన్య ఏనుగుల సంరక్షణ కేంద్రం' ఏ జిల్లాలో ఉంది?
  చిత్తూరు
- ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటుచేసిన చట్టం?
  1909 చట్టము
- కార్గిల్ విజయ్ దివస్ ఎప్పుడు నిర్వహిస్తారు?
  జులై 26
- బుద్ధుడు మొదటి ఉపన్యాసం చేసిన ప్రదేశం ఏది?
  సారనాథ్
- రెండు సార్లు ప్రవేశపెట్టబడ్డ ప్రణాళిక
  ఆరవ పంచవర్ష ప్రణాళిక
- చేప హృదయంలో గదుల సంఖ్య:
  2
- ప్రపంచంలో 'జనపనార ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?
  భారత్
- గోవా రాష్ట్ర రాజధాని?
  పనాజి
- పిహెచ్ అనగా దేని అణువుల గాఢత?
  హైడ్రోజన్
- రాజ్యంగంలో ఏది ప్రాథమిక హక్కు కాదు
  ఆస్తి హక్కు
- ప్రత్యేక హక్కులు లేనిది.
  సమన్యాయపాలన
- ఝరియా బొగ్గుగనులు గల రాష్ట్రం –
  ఝార్ఖండ్
- నాలుకపై ఎన్ని రుచులను తెలిపే గ్రాహకాలు కలవు?
  4 గ్రాహకాలు
- రక్తం ఎర్రగా ఉండడానికి కారణం అందులోని
  హీమోగ్లోబిన్
- అనిబిసెంటు హోమ్‌రూల్ లీగ్‌ను కేంద్రంగా చేసుకున్నది?
  మద్రాసు
- ముస్లింలీగ్ ఏర్పాటు?
  1906
- బెంగాల్ విభజనను ప్రతిపాదించినది?
  కర్జన్

## 'సర్దార్ సర్వాయి పాపన్న' పోస్టర్ లాంచ్

### * ఆర్కే ఫిలింస్ ద్వారా విడుదల



బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన యానిమేషన్ మూవీ 'సర్దార్ సర్వాయి పాపన్న'. ఈ సినిమాను వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. ఈ యానిమేషన్ మూవీ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా వచ్చేవారం థియేట్రికల్ రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్ర పోస్టర్‌ను గురువారం తెలంగాణ ఫిలిం ఛాంబర్‌లో ఛాంబర్ అధ్యక్షుడు డాక్టర్ ప్రధాని రామకృష్ణ గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నసినిమా పోస్టర్ లాంఛ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. దాదాపు 360 ఏళ్ల క్రితం బహుజన చక్రవర్తిగా వెలుగొందిన 'సర్దార్ సర్వాయి పాపన్న' జీవిత కథతో వెంకటేష్ గౌడ్ దర్శక నిర్మాతగా ఈ చిత్రాన్ని రూపొందించారు. మా ఆర్కే ఫిలింస్ ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. అని చెప్పారు. దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి మాట్లాడుతూ మా వి.జి. మూవీ మేకర్స్ బ్యానర్ పై 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమాను నిర్మించాం. మాకున్న వనరులకు ఇది భారీ బడ్జెట్ మూవీ అనే చెప్పాలి. అయినా సినిమా కంప్లీట్ చేసి సెన్సార్ పూర్తి చేసి రిలీజ్ కు తీసుకొస్తున్నాం. ఈ నెల 7నే మా మూవీని రిలీజ్ చేయాలని అనుకున్నాం. చిన్న సినిమాలకు థియేటర్స్ ఇబ్బందులు ఎలా ఉన్నాయో మీకు తెలుసు. ఈ నెల 14, లేదా 21న రిలీజ్ అనేది ప్లాన్ చేస్తున్నాం. సర్దార్ పాపన్న 376వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మా 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమాను రిలీజ్ చేయాలని భావిస్తున్నామన్నారు. నిర్మాణ పర్యవేక్షకులు దీపక్ న్యాతి మాట్లాడుతూ విదేశీయులు కీర్తించిన ఘన చరిత్ర సర్దార్ సర్వాయి పాపన్నది. అలాంటి పోరాట వీరుడి చరిత్రను కొందరు మరుగునపడేలా చేశారు. మంచి రచయిచ, దర్శకుడు అయిన వెంకటేష్ ఎన్నో ఇబ్బందులు తట్టుకుని ఈ సినిమాను ఏఐ, యానిమేషన్ మూవీగా రూపొందించారు. సర్దార్ పాపన్న చరిత్రను పూర్తిగా అధ్యయనం చేసి గొప్ప చిత్రంగా రూపొందించారు. ఇది డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా రిలీజ్‌కు వస్తుండటం సంతోషంగా ఉంది అన్నారు. ఈ చిత్రానికి వీఎఫ్ఎక్స్, సూపర్ విజన్ పి. శ్రీనివాస్, ఎడిటర్ సతీష్ పెటేటి, మణి, సినిమాటోగ్రఫీ, విజువల్ డైరెక్షన్ మిర్జాపురి సైమన్, లీడ్ ఏఐ విజువల్ డైరెక్టర్ సురేష్ మల్ల, మ్యూజిక్ సూపర్ వైజర్, లిరిక్స్ వెంకటేష్ గౌడ్ లింగంపల్లి, నిర్మాత, దర్శకత్వం వెంకటేష్ గౌడ్ లింగంపల్లి.

## రీల్



## 'మిషన్ పాజిబుల్' పోస్టర్ రిలీజ్

నటుడు, దర్శకుడు నవీన్ హిదయత్ రూపొందించిన తమిళ సూపర్ హిట్ డార్క్ కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మూదర్ కూడమ్'. 2013లో రిలీజైన ఈ సినిమాకు సీక్వెల్ గా మూదర్ కూడమ్ 2 రూపొందుతోంది. ఈ సినిమా 'మిషన్ పాజిబుల్' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నవీన్ హిదయత్, ఒవియా, సెన్రయాన్, రాజాజీ, కుబేరన్, జయప్రకాష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నవీన్ హిదయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గ్రాండెల్ పిక్చర్స్ బ్యానర్‌పై సంకిత్ బోరా, కమల్ బోరా నిర్మిస్తున్నారు. 'మిషన్ పాజిబుల్' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఓ నగరంలో డైనోసార్స్ భీభత్సం సృష్టిస్తుండటం, వాటిని తరిమేందుకు ఆర్మీ హెలికాప్టర్స్ రంగంలోకి దిగడం, శాంటాక్లాజ్ డ్రెస్‌లో ఉన్న ఒక బొమ్మను ఫాలో అవుతూ మూవీలోని ప్రధాన పాత్రధారులు పరుగెత్తడాన్ని చూపిస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్ డిజైన్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ఓ భారీ హాలీవుడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను తలపిస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే 'మిషన్ పాజిబుల్' మూవీ సినీ ప్రియుల్లో ఆసక్తి కలిగిస్తోంది. త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు. 'మిషన్ పాజిబుల్' సినిమాను ఇటలీ, జర్మనీ, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా, క్రోయేషియా, స్లొవేనియా, కజికిస్థాన్ దేశాల్లోని రేర్, బ్యూటిఫుల్ లొకేషన్స్ లో చిత్రీకరించడం విశేషం.ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ సందర్భంగా దర్శకుడు నవీన్ హిదయత్ మాట్లాడుతూ నా మనసుకు దగ్గరైన కథ ఇది. ప్రేక్షకులు చాలా ఏళ్లుగా మీ సినిమా సీక్వెల్ ఎప్పుడు అని అడుగుతూ వస్తున్నారు. సీక్వెల్ చేయాలి కాబట్టి పార్ట్ – 2 చేయాలని ఈ ప్రాజెక్ట్ టేపాజెక్ట్ చేయలేదు. మొదటి భాగం కథతో ప్రేక్షకుల్ని కనెక్ట్ చేస్తూనే వారిని ఆశ్చర్యపరిచే కథతో మిషన్ పాజిబుల్ సినిమా రూపొందించాను. అడ్వెంచర్ తో సాగుతూ ఎంటర్ టైన్ చేసే స్టోరీ ఇది అన్నారు. ప్రొడ్యూసర్స్ సంకిత్ బోరా, కమల్ బోరా మాట్లాడుతూ ప్రేక్షకుల ప్రేమాభిమానాల నుంచే కల్ట్ క్లాసిక్స్ వస్తాయి. నవీన్ ఈ కథ చెప్పినప్పుడే ఇది కేవలం సీక్వెల్ కాదు ఒక పెద్ద కాన్వాస్ మీద ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే సినిమా అనిపించింది. ప్రతి టెక్నీషియన్ ఈ మూవీని అందంగా తెరపైకి తీసుకొచ్చేందుకు కష్టపడ్డారు. మిషన్ పాజిబుల్ సినిమా ప్రేక్షకుల్ని థ్రిల్ కు గురిచేస్తూ ఎంటర్‌టైన్ చేస్తుంది అన్నారు.

## 15న వస్తున్న 'హుషారు పిట్టలు'



అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బివిజి స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి 'టోంగా టోంగా' అనే హుషారు గీతంతో పాటు సక్కని గడియ పాటలను విడుదలచేశారు. వీటికి అనూహ్య స్పందన వచ్చింది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను 10న విడుదల చేస్తున్నారు . ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు భిక్షు మాట్లాడుతూ మా సినిమ్మా 15న విడుదల చేస్తున్నాం. ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 10న విడుదల చేస్తున్నాం అన్నారు. బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ సినిమా నచ్చి సపోర్ట్ చేస్తున్నాను. నిర్మాత సురేష్ బాబు చూసి నచ్చి ఈ సినిమాను విడుదల చేస్తున్నారు.సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ నాకు కమర్షియల్ సక్సెస్ వస్తుందని నమ్ముతున్నాను. ఈ సినిమా విజయంతో నాకు సినీ ఇండస్ట్రీలో కూడా గుర్తింపు వస్తుందని అనుకుంటున్నాను. ఈ సినిమా చూస్తున్నప్పుడు సెకండాఫ్‌లో నాలుగు సార్లు ఏడ్చాను.ఈ సినిమా మీకు నచ్చకపోతే ఎప్పుడూ కూడా మరో సినిమా చూడమని అడగను. ఈ సినిమా తరువాత నా కెరీర్ కూడా మారబోతుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత వెంకట్ యాదవ్ ,హీరో అన్ను, హీరోయిన్ వాసవి గణేషన్, గీత రచయిత చిరంజీవ్, డిఒపి రుద్రసాయి, నటులు గోవర్ధన్, భాను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## 'అనకాపల్లి' రిలీజ్ తేదీ మారింది

హీరో విక్రమ్ సహిదేవ్ నటించిన 'అనకాపల్లి' చిత్రాన్ని ముందుగా ప్రకటించిన ప్రకారం 7న విడుదల చేయాల్సి ఉంది. అయితే ఇటీవల జరిగిన పరిణామాలు, చిత్రానికి వస్తున్న స్పందన నేపథ్యంలో విడుదల తేదీని కొద్దిగా వాయిదా వేయాలని చిత్ర బృందం నిర్ణయించింది. ఇటీవల ఈ చిత్రానికి ప్రత్యేకంగా నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ షోకు అనూహ్యమైన, అద్భుతమైన స్పందన లభించింది. సినిమా కంటెంట్ చూసిన పలువురు డిస్ట్రిబ్యూటర్లు ఈ చిత్రాన్ని కేవలం తెలుగు వరకే పరిమితం చేయకుండా, తమిళం, మలయాళం తదితర భాషల్లో కూడా డబ్ చేసి విడుదల చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ఈ పరిణామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, తొందరపడి విడుదల చేయడం కంటే సినిమాకు లభిస్తున్న అవకాశాలను పూర్తిగా పరిశీలించి, సరైన ప్రణాళికతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం నిర్ణయించింది.ఈ సినిమా పేరు 'అనకాపల్లి'.ఈ సినిమా కథకు, షూటింగ్‌కు వేదిక అనకాపల్లి.ఈ చిత్ర నిర్మాత కూడా అనకాపల్లి బిడ్డే. అందుకే ఈ సినిమా మీద మాకున్న నమ్మకంతో, థియేట్రికల్ రిలీజ్‌కు ముందే అనకాపల్లి పట్టణంలో 4 నుంచి 5 ప్రత్యేక పబ్లిక్ షోలు నిర్వహించాలని నిర్ణయించుకున్నాం.ఇవి ఇండస్ట్రీ కోసం వేసే ప్రివ్యూ షోలు కావు.సెలబ్రిటీల కోసం వేసే స్పెషల్ షోలు కావు.నిజమైన ప్రేక్షకుల కోసం.. అనకాపల్లి ప్రజల కోసం వేసే షోలు.'అనకాపల్లి'లో తొలి తీర్పు... అనకాపల్లి నుంచే రావాలి అని నిర్మాత అన్నారు.

## మూడు డిఫరెంట్ గెటప్స్‌లో 'మకుటం'



సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం 'మకుటం'. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మాణంలో రాబోతోన్న ఈ మూవీలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాని 14న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించడమే కాకుండా.. 7న ట్రైలర్‌ను విడుదల చేస్తామని అప్డేట్ ఇచ్చారు. ఇప్పటికే విశాల్ 'మకుటం'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. విశాల్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తుండటం. పైగా దర్శకుడిగా మొదటి సినిమా అవ్వడం, జివి ప్రకాష్ ఇచ్చిన మ్యూజిక్ అందరినీ ఆకట్టుకోవడంతో అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. ఇక ఇప్పుడు సినిమా రిలీజ్ డేట్‌ని కూడా ప్రకటించడంతో ప్రమోషన్స్‌లో మరింత స్పీడ్ పెంచేలా కనిపిస్తున్నారు.ఈ సినిమాకి రిచర్డ్ ఎం. నాథన్, అభినందన్ రామానుజం కెమెరామెన్లుగా, శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. విశాల్, అంజలి, దుషార విజయన్, జాన్ విజయ్, జయ ప్రకాష్, అజయ్, వంశీ కృష్ణ, అబూ సలీం, అర్జయ్, ఝాన్సీ, పదం కుమార్, సభమోన్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్ అందిస్తున్నారు.

# "గోపాలపురం పాఠశాలకు రూ.25లక్షలు"

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన తరగతి గదుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. పాఠశాల దుస్థితిపై మీడియాలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ దివాకర్ గురువారం గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం తరగతి గదుల నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్ పాఠశాల ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరతో ఫోన్‌లో మాట్లాడి పాఠశాల పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరను కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వం వేగంగా స్పందించి నిధులు మంజూరు చేయడంతో గ్రామస్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

**ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది :**



ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సిద్ధాంతకర్తగా తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పోషించిన పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు.

**ప్రజల హృదయాల్లో గద్దర్ ఎప్పటికీ సజీవంగానే ఉంటారు : సిఎం**



సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ప్రజాకవి గద్దర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజల హృదయాల్లో ఆయన ఎప్పటికీ సజీవంగానే ఉంటారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. పాటను ప్రజా ఉద్యమానికి శక్తివంతమైన ఆయుధంగా మార్చిన అరుదైన వ్యక్తిత్వం గద్దర్‌దేనని గుర్తు చేసుకున్నారు. ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గద్దర్ ఆటా పాటా తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తన పాటల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని నింపి, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం తన గళాన్ని వినిపించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాటలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణికి తీసుకురావడమే లక్ష్యంగా...

# ఉప ముఖ్యమంత్రి అమెరికా పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ , జెమ్కో సీనియర్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి బృందం అమెరికాలో పర్యటిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా గురువారం బృందం సభ్యులు టెక్సాస్, అరిజోనా రాష్ట్రాల్లో ఉన్న ప్రఖ్యాత మైనింగ్ యంత్రాల తయారీ కేంద్రాలను సందర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణికి తీసుకురావడం, తద్వారా గనుల్లో భద్రతను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పెట్టుకున్నది. ముందుగా అరిజోనా రాష్ట్రం టక్సన్‌లోని 'కేటర్పిల్లర్ డెమాన్‌స్ట్రేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్'ను భట్టి విక్రమార్క బృందం సందర్శించింది. అటానమస్, రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేసే భారీ మైనింగ్ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా వీక్షించింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉపయోగించే భారీ యంత్రాల విడిభాగాలు, ఆపరేటర్ల శిక్షణా విధానాలు, ప్రమాద నివారణ భద్రతా వ్యవస్థల పనితీరు గురించి సాంకేతిక నిపుణులతో అధికారులు చర్చించారు. ముఖ్యంగా ప్రమాదకరమైన ప్రాంతాల్లో మ్యాన్యువల్ వర్క్‌ను తగ్గించేందుకు ఉపయోగపడే 'టెలిరిమోట్ ఆపరేషన్ టెక్నాలజీ'పై ప్రతినిధి బృందం ప్రత్యేక దృష్టి సారించింది. అనంతరం, టెక్సాస్ రాష్ట్రం డల్లాస్ సమీపంలోని లాంగ్వ్యూలో ఉన్న 'కొమాట్సు మైనింగ్ కార్పొరేషన్' ఫెసిలిటీని కూడా ఉన్నత స్థాయి బృందం సందర్శించింది. అక్కడ భారీ మైనింగ్ యంత్రాల తయారీ, అసెంబ్లీ ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఆధునిక, స్వయంచాలిత యంత్రాలను వాడటం ద్వారా ఓపెన్ కాస్ట్ గనుల్లో కార్మికుల భద్రతను గణనీయంగా పెంచడంతో పాటు ప్రమాదాల రేటును భారీగా తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. సాంకేతిక బదిలీ ఒప్పందాల ద్వారా భవిష్యత్తులో తెలంగాణలోనే సర్వీస్ యూనిట్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్, క్యాటర్పిల్లర్ ఇండియా ప్రతినిధి ఆర్ కె మిశ్రా, డెన్నిస్ పాల్గొన్నారు.

# సింగరేణికి చేరిన 'నైనీ' సిరులు

### తెలంగాణ ఇంధన భద్రతలో చారిత్రక ఘట్టం
### తొలి రైల్వే ర్యాక్‌కు సింగరేణి అధికారుల ఘనస్వాగతం
### అమెరికా పర్యటన నుంచి అభినందనలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చే దిశగా సింగరేణి చరిత్రలో అత్యంత అద్భుతమైన, చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైన ఒడిశాలోని 'నైనీ' బొగ్గు బ్లాక్ బొగ్గు రవాణా ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా, ఒడిశా రాష్ట్రంలోని సింగరేణి నైనీ బొగ్గు గని నుంచి లోడ్ చేసిన తొలి బొగ్గు రైల్వే ర్యాక్ సుమారు 1,131 కిలోమీటర్ల ప్రయాణం పూర్తి చేసి గురువారం ఉదయం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్‌టిపిపి) కి చేరుకుంది. ఇతర రాష్ట్రంలోని సింగరేణి గని నుంచి తెలంగాణ రాష్ట్రానికి బొగ్గు సరఫరా కావడం సంస్థ చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో ఎస్‌టిపిపిలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణికి నైనీ బొగ్గు రాక సందర్భంగా అక్కడి నుంచే సింగరేణి యాజమాన్యానికి, కార్మికులకు వీడియో సందేశం ద్వారా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నెంబర్-1

### పిఎంఒ 'ప్రగతి' సమీక్షలో తొలి స్థానం..
### 9 కీలక ప్రమాణాల్లో అత్యుత్తమ పనితీరు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన న్యాయం, అత్యాధునిక డిజిటల్ వేదికల వినియోగంలో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ప్రగతి' జాతీయ సమీక్ష సమావేశంలో సైబర్ క్రైమ్ పనితీరు ఆధారంగా తెలంగాణ రాష్ట్రం దేశవ్యాప్తంగా మొత్తం మీద తొలి స్థానం సాధించింది. ఈ గుర్తింపు రాష్ట్ర సైబర్ భద్రతా వ్యవస్థ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. సైబర్ నేరాల నివారణకు సంబంధించిన తొమ్మిది కీలక ప్రమాణాలపై కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సమీక్షలో తెలంగాణ అత్యుత్తమ పనితీరును కనబరిచింది. దేశంలోనే తొలి ఎస్4సి కేంద్రం ఏర్పాటు, ఈ జీరో ఎఫ్ఐఆర్ అమలు, గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మెకానిజం , మనీ రీస్టోరేషన్ మాడ్యూల్ , సహయోగ్ పోర్టల్, సమన్వయ పోర్టల్ సమర్థ వినియోగం, సైబర్ హాట్‌స్పాట్ల గుర్తింపు, పోలీసులకు శిక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అన్ని అంశాల్లో తెలంగాణకు అత్యధిక మార్కులు లభించాయి.

సైబర్ మోసాల బాధితులకు సత్వర సహాయం అందించేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేకంగా 8712665600 హెల్ప్‌లైన్ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించే వీడియోలను కూడా విడుదల చేసింది. అధికారిక గణాంకాల ప్రకారం, పోర్టల్లో నమోదైన 2,368 ఫిర్యాదుల్లో 2,086పై (88%) చర్యలు, ఎంఆర్‌ఎం ద్వారా రూ.16.42 కోట్ల పునరుద్ధరణకు సంబంధించిన 81.38 శాతం ఆదేశాలు, సహయోగ్ పోర్టల్లో 89.41 శాతం అభ్యర్థనల పరిష్కారం, సమన్వయ పోర్టల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యర్థనల్లో 96.68 శాతం పూర్తి చేయడం రాష్ట్ర పనితీరుకు బలమైన సూచికలుగా నిలిచాయి. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్, ఐపీఎస్ మాట్లాడుతూ, దేశంలోనే తెలంగాణకు తొలి స్థానం రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజలు సైబర్ మోసాలకు గురైన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్, వేదికలను వినియోగించి ఫిర్యాదులు నమోదు చేయాలని, అవసరమైతే ప్రత్యేక హెల్ప్‌లైన్ ద్వారా సహాయం పొందాలని విజ్ఞప్తి చేశారు.

# సిఎం ఢిల్లీకి కాకుండా ఎక్కడికి వెళ్లాలి

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రం ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, అనుమతుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి కాకుండా ఇంకా ఎక్కడికి వెళ్లాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బిఆర్‌ఎస్ నేత కెటిఆర్‌ను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సిఎం ఢిల్లీకి వెళితే కెటిఆర్ తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. నెహ్రూ కుటుంబాన్ని విమర్శించే అర్హత కెటిఆర్‌కు లేదన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 75వ సారి సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారని కెటిఆర్ లెక్కలు చెబుతున్నారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం, నిధుల కోసం నిరంతరం ఢిల్లీలో సంప్రదింపులు జరపాల్సి ఉంటుందని, అందు కోసం సిఎం 75 సార్లు కాదు, 750 సార్లు సిఎం ఢిల్లీ వెళ్తారని ఆయన అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఢిల్లీలో ఉన్నందున అవసరమైనప్పుడు వెళ్తారు. అయినా ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ సిఎం సామాన్య ప్రయాణికుడిలా ప్రయాణీకుల విమానంలో ప్రయాణిస్తారని, బిఆర్‌ఎస్ నేతల మాదిరిగా ప్రత్యేక విమానాలు, చార్టర్ ఫ్లైట్లు ఉపయోగించరని ఆయన అన్నారు. 'జాతీయ పార్టీగా చేస్తున్నామంటూ టిఆర్‌ఎస్‌ను బిఆర్‌ఎస్‌గా మార్చలేదా? ఢిల్లీలో పార్టీ కార్యకలాపాల కోసం కోట్ల రూపాయలతో ఓ భవనం ఏర్పాటు చేసుకోలేదా? తెలంగాణ పేరుతో ఉన్న బంధం తెంచుకున్న వాళ్లు నేడు జాతీయ పార్టీ గురించి మాట్లాడుతున్నారు' అని శ్రీనివాస్ విమర్శించారు. బిఆర్‌ఎస్ అధికారం కోల్పోయి రెండున్నరేళ్లు అయినా ఓటమిపై ఆ పార్టీ పోస్టుమార్టం చేసుకోలేదని, అధికారం దూరమైందన్న నైరాశ్యంతో కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని శ్రీనివాస్ అన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప తాత్వికవేత్త

### దళిత అధ్యయన కేంద్రం వ్యవస్థాపక చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప తాత్వికవేత్త అని, ఆయన జీవితం నిరాడంబరంగా సాగిందని బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి, దళిత అధ్యయన కేంద్రం వ్యవస్థాపక చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు.ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని 'ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలు, సామాజిక ఉద్యమాలు' అనే అంశంపై హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో గురువారం స్మారకోపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అధ్యక్షత వహించారు. మల్లేపల్లి లక్ష్మయ్య ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమ నిర్మాణానికి బలమైన ప్రణాళిక అవసరమని ప్రొఫెసర్ జయశంకర్ నిరంతరం చెప్పేవారని గుర్తు చేశారు. విద్య,సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి, ప్రాంతీయ ఆకాంక్షలకు సంబంధించిన సమకాలీన సవాళ్లను ఎదుర్కొవడంలో జయశంకర్ ఆదర్శాలు నేటి యువతకు స్ఫూర్తి అని అన్నారు. ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ విద్యార్థి జీవితం నుంచి తుది శ్వాస విడిచే వరకు తెలంగాణ ఏర్పాటే తన జీవితాశయంగా జయశంకర్ జీవించారన్నారు. అంతకు ముందు బి ఆర్.అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణా రెడ్డి , ఫ్రొఫెసర్ రవీంద్రనాథ్ సోలమన్, ప్రొఫెసర్ ఆనంద్ పవార్, ప్రొఫెసర్ పల్లవి కాబ్డే, వై. వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ఎన్.రజని, ప్రొఫెసర్ ప్రమీలా కేతావాత్, ప్రొఫెసర్‌చంద్రకళ, ప్రొఫెసర్ మేరీసునంద. ఉద్యోగ సంఘాల నాయకులు కాంతం ప్రేమ్ కుమార్, యాకేష్ దైదా,మియా జాని, మంజుల, కె.పాండు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ ఉత్పతుల కొనుగోళ్లలో

# దేశానికే ఆదర్శంగా తెలంగాణ

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ ఉత్పతుల కొనుగోళ్లలో దేశానికే తెలంగాణ ఆదర్శమని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం సచివాలయంలో మంత్రి తన శాఖ పరిధిలోని పలు అంశాలపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ బి. గోపి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించాలనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ధృడ సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి జొన్నల కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. యాసంగి 202526 సీజన్‌లో దే శంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం జొన్న రైతుల నుంచి కనీస మద్దతు ధర తో రికార్డు స్థాయిలో జొన్నలను కొనుగోలు చేసిందని తెలిపారు. ఈ కొనుగోళ్లకు సంబంధించిన రూ.994 కోట్లను 1,01,376 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు వెల్లడించారు. రైతు కష్టానికి తగిన గౌరవం దక్కేలా పంటకు గిట్టుబాటు ధరతో పాటు సకాలంలో చెల్లింపులు అందే విధంగా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. తెలంగాణ రైతాంగానికి సాగు నుంచి విక్రయం వరకు సంపూర్ణ భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# ఫోర్జరీ పత్రాలపై దర్యాప్తు ముమ్మరం

### నకిలీ ఫైర్ ఎన్ఒసిల వ్యవహారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్ఓసిల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. విచారణలో ఒకే తరహాలో నకిలీ ఎన్ఓసిలు తయారు చేసినట్టు గుర్తించారు. దాదాపు 56 కాలేజీలు నకిలీ ఎన్ఓసిలు సమర్పించినట్టు తేలగా, మరో 176 కాలేజీలపై హైడ్రా విచారణ జరుపుతోంది. ఐదు అంతస్తులలోపు భవనాల అనుమతుల కోసం ఫైర్ ఎన్ఓసిలను హైడ్రా జారీ చేస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఎన్ఓసీలు మంజూరు చేస్తున్న అవకాశాన్ని వినియోగించుకుని కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీ ఎన్ఓసిలు సృష్టించి ఇంటర్ బోర్డుకు సమర్పించినట్టు విచారణలో వెల్లడైంది. ఒక్కో కాలేజీకి రూ. 6 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు యాజమాన్యాలు ఖర్చు చేసినట్టు తెలుస్తోంది. జిహెచ్ఎంసి, హైడ్రా, ఫైర్ శాఖ మాజీ డిజిల సంతకాలను ఫోర్జరీ చేసినట్టు అధికారులు గుర్తించారు. సంబంధిత కాలేజీల యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయి విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

# కాంగ్రెస్ పాలనలో అడ్డగోలు దోపిడీ

### బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి శాఖలోనూ అడ్డగోలు దోపిడీ జరుగుతోందని బిజెఎల్‌పి నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు విచ్చలవిడిగా దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. మాజీ మంత్రుల సిఫార్సులతో ఐఎఎస్‌లుగా మారిన అధికారులకు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో కీలక బాధ్యతలు అప్పగించడం కాంగ్రెస్‌బిఆర్‌ఎస్ లూటీ బంధానికి నిదర్శనమన్నారు. తెలంగాణలో రూ. 92,000 కోట్ల కాంట్రాక్టులు ఫ్లోట్ చేస్తే, అందులో రూ. 82,500 కోట్ల పనులను ఆంధ్రా గుత్తేదారులకే కట్టబెట్టారన్నారు. 'యంగ్ ఇండియా' స్కూళ్ల పేరిట విద్యాశాఖలో ఓవర్ ఎస్టిమేషన్‌లతో పెద్ద ఎత్తున కుంభకోణం జరుగుతోందని, 22ఎ భూముల క్లియరెన్స్ పేరుతో 40 శాతం కమీషన్‌లు వసూలు చేస్తూ రూ. 15,000 కోట్ల భూములను బదలాయించుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, అధికార ప్రతినిధులు అభిషేక్, రవికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టిజి సిపిగేట్‌లో బిసి గురుకుల విద్యార్థుల సత్తా

### ఇద్దరికి రాష్ట్ర తొలి ర్యాంక్..
### ఆరుగురికి టాప్-10

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (టిజి సిపిగేట్) 2026లో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బిసి సంక్షేమ గురుకుల విద్యాసంస్థల (ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్ఇఐఎస్) డిగ్రీ కళాశాలల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు.

రాష్ట్ర స్థాయిలో ఇద్దరు విద్యార్థులు తొలి ర్యాంకులు సాధించగా, ఆరుగురు టాప్10లో, 12 మంది టాప్20లో, 18 మంది టాప్50లో, మొత్తం 32 మంది విద్యార్థులు 17 పిజి విభాగాల్లో టాప్100 ర్యాంకులు సాధించారు. కామర్స్‌లో తోట రాహుల్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎస్.శ్రావణి రాష్ట్ర తొలి ర్యాంకులు సాధించగా, బోటనీలో ఎం. వినీల్, ఫిజిక్స్‌లో ఎం.ప్రశాంత్ ద్వితీయ ర్యాంకులు, జువాలజీలో జి.అనూష తృతీయ ర్యాంకు సాధించారు. ఇటీవల నిర్వహించిన సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలోనూ బిసి గురుకుల డిగ్రీ కళాశాలల 28 మంది విద్యార్థులు దేశంలోని ప్రముఖ కేంద్ర విశ్వవిద్యాలయాల్లో సీట్లు పొందారు.

ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు.

## 50 శాతం రిజర్వేషన్లపై

# దేశవ్యాప్తంగా ఉద్యమిస్తాం



### టిఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/రంగారెడ్డి/హయత్‌నగర్ :** బిసి లకు చట్టసభల్లో యాభై శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు కలిసి వచ్చే వారితో దేశ వ్యాప్తంగా తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తుందని టిఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు.గురువారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో టిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో టిఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం సంకల్పం తీసుకుంటుందని చెప్పారు.తాము చేపట్టిన సామాజిక న్యాయ సంకల్ప సభ కొట్లాది మంది జీవితాలను మార్చబోతోందన్నారు. కేంద్ర మంత్రి, బిజెపి నాయకుడు కిషన్ రెడ్డి,ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి లు ప్రేమ లేఖలు రాసుకుంటునే.గల్లీ లో కుస్తీ,ఢిల్లీలో దోస్తీ అన్నట్లుగా వాళ్ల వ్యవహారం ఉందని టిఆర్‌ఎస్ అధినేత కవిత విమర్శించారు. ఈ కార్యక్రమములో ఎల్ బి నగర్ ఇంచార్జ్ దుగుంట్ల నరేష్,కంచర్ల శివ రెడ్డి,మధు గౌడ్,మంజు గౌడ్,ఏడు కొండల రాంకోటి,టిఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో

# ఇంటెలెక్చువల్ సెల్ కీలకం

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ గొప్ప భావజాల వారసత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విచార్ విభాగ్ కీలక పాత్ర పోషిస్తోందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ సూత్రాలు, లౌకికవాదాన్ని బలోపేతం చేయడం కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) విచార్ విభాగ్ (ఇంటెలెక్చువల్ సెల్) సమావేశం గురువారం గాంధీభవన్‌లో జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విచార్ విభాగ్ సభ్యులు పాల్గొన్నారు. సమావేశానికి ఎఐసిసి విచార్ విభాగ్ చైర్మన్ కెప్టెన్ ప్రవీణ్ దావర్, వైస్ చైర్ పర్సన్ పుష్ప లక్ష్మణ స్వామి, టిపిసిసి విచార్ విభాగ్ చైర్మన్ ఎ.శ్యామ్ మోహన్ హాజరయ్యారు. సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్, బిజెపి కాంగ్రెస్‌పై అసత్య ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కుల, మత, వర్గ, ప్రాంతాలకు అతీతంగా ప్రతి పౌరుడి సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

# హోర్ముజ్ జలసంధి తెరుచుకునే అవకాశం!



**దుబాయ్:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతున్న హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశాలు మెరుగుపడ్డాయి. ముడి చమురు రవాణాకు అత్యంత కీలకంగా మారిన ఈ జలసంధిని అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన విషయం తెలిసిందే. దీనిని తిరిగి తెరవడంతోపాటు, ఇతరత్రా అంశాలపై చర్చలు జరుగుతున్నాయని, ఏ క్షణమైనా ఒప్పందం కుదురుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇది వరకే ప్రకటించగా, ఇరాన్ కూడా దాదాపు ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. 'పిటిఐ' కథనం ప్రకారం, హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ఇరాన్, ఒమాన్‌దేశాలు ఒక ముఖ్యమైన ద్వైపాక్షిక ఒప్పంద ముసాయిదాను చివరి దశకు చేర్చాయి. ఈ ఒప్పందం ద్వారా ముఖ్యంగా నౌకాయాన మార్గాలు, నిర్వహణ పద్ధతులను స్పష్టంగా నిర్వచించడం ద్వారా ఈ ప్రాంతంలో సముద్ర మార్గంలో స్థిరత్వాన్ని, భద్రతను తీసుకురావడానికి ప్రయత్నం జరుగుతుంది. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ప్రశాంతత నెలకొనే దిశగా అడుగులు వేగంగా ముందుకు పడపడం ఆహ్వానించతగిన పరిణామమే అయినప్పటికీ, అంతర్జాతీయ షిప్పింగ్ సంస్థలు, వ్యాపార వర్గాలు ఈ ఒప్పందం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. కాగా, ఈ మార్గం మీదుగా వెళ్లే నౌకలపై కొత్తగా రవాణా రుసుములు లేదా సుంకాలు విధిస్తే, అది ప్రపంచ సరఫరా వ్యవస్థ (గ్లోబల్ సప్లై చైన్)పై తీవ్ర ప్రభావం చూపుతుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది. ఇంధనం, సరుకుల రవాణా ఖర్చులు పెరగడం వల్ల అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకునే విషయంలో సానుకూల వాతావరణం నెలకొంటున్నప్పటికీ, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దక్షిణ లెబనాన్ సరిహద్దు ప్రాంతంలో ఇజ్రాయెల్ సైన్యం, హిజ్బుల్లా బలగాల మధ్యతీవ్ర స్థాయిలో కాల్పులు చోటు చేసుకున్నాయి. ఇటీవల జరిగిన తాజా ఎదురుకాల్పుల్లో తమ దళాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, కొందరు సైనికులు మరణించగా మరికొందరు గాయపడ్డారని ఇజ్రాయెల్ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ ప్రాంతీయ ఉద్రిక్తతలు పూర్తిస్థాయి యుద్ధంగా మారకుండా నిరోధించేందుకు రోమ్‌లో దౌత్యపరమైన చర్చలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ నాయకులు శాంతి స్థాపనకు ప్రయత్నిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దాడులు, ప్రతిదాడులు కొనసాగుతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.



## ప్రతీ గ్రామాన్ని అదర్శంగా తీర్చిదిద్దుతాం

### గ్రామాభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామపంచాయతీలు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల, మిర్యాలగూడ, వేములపల్లి మండల కేంద్రాలలో నిర్వహించిన గ్రామపంచాయతీ అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై మండల ప్రజా పరిషత్ సమీక్షా సమావేశాలు జరిగాయి. గురువారం నిర్వహించిన ఈ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామపంచాయతీలు గ్రామీణ పురోగతికి మూలస్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు. ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరా, వీధి దీపాల సక్రమ నిర్వహణ, పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు సమర్థవంతంగా చేరువ చేయడంతో పాటు పంచాయతీల పరిపాలనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో గుర్తించి వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతీ గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశాల్లో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సంబంధిత మండలాల ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 11, 12 తేదీలలో సిపిఐ ప్రచారజాత

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్



**ప్రజాపక్షం/చిట్యాల:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారత కమ్యూనిష్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు నకిరేకల్ నియోజకవర్గంలో ఈ నెల 11, 12 తేదీలలో ప్రచార జాతను చేపట్టనున్నట్లు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ప్రచార జాత గోడ పత్రికను గురువారం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా దేశంతో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందం మూలంగా వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. నరేంద్ర మదీ హయాంలో ప్రపంచ బ్యాంకు రుణం రూ. 151 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. సెప్టెంబర్ 1న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్రవణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎండి అక్బర్, గీతపనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు బొలుగూరి లింగయ్య, షేక్ షరీఫ్, గుండాల సత్తయ్య, పి దేవేందర్, రావుల చిన్నవెంకన్న, దామనూరు అంజయ్య, యాదగిరి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉద్యమంలో 'సర్' కీలక పాత్ర

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్తగా, రాష్ట్ర ఏర్పాటుకు నాయకత్వం వహించి ప్రజలను, నాయకులను ఏకతాటి పైకి తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఎంతో కీలక పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్‌తో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్ర్యం వచ్చినప్పటికి నిజాం పాలనలో ఉందని తదుపరి నిజాం పాలన నుండి స్వతంత్ర దేశం అయిన తదుపరి ప్రొఫెసర్ జయశంకర్ అన్యాయాలను ఎదిరించేందుకు పోరాటాల ద్వారా, సాహిత్యం ద్వారా ప్రజలకి వారి హక్కులు తెలిసేలా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, సిపిఓ కిషన్, డిఎం అండ్ హెచ్ఓ వెంకటరమణ, డిటిఓ రవి కుమార్, ఇంచార్జి పరిపాలన అధికారి శ్రీలత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శిథిల భవనాలు.. అధ్వాన్న వసతులు.. సంక్షేమ హాస్టళ్ల దుస్థితి

### ఎఐఎస్ఎఫ్ మండిపాటు

**ప్రజాపక్షం/నాంపల్లి:** ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తూ నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎస్‌సి బాలుర సంక్షేమ హాస్టల్‌ను గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించి, అక్కడి సమస్యలపై పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు అందించాల్సిన దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, నోట్‌బుక్కు, దుస్తులు తదితర సామగ్రిని ఇప్పటికీ పంపిణీ చేయలేదని విమర్శించారు.హాస్టల్‌లో మరుగుదొడ్లు, స్నానపు గదులు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శిథిలమైన భవనాలను వెంటనే మరమ్మతులు చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన లేదని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు కాటిక ప్రేమ్‌కుమార్,బుషిపాక నిఖిల్,సిద్ధార్థ్, సాయితేజ, అనిల్‌కుమార్, షఫీక్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### ప్రజా సమస్యలపై పోరాటమే

# కమ్యూనిస్టుల ధ్యేయం

### కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా సిపిఐ ప్రచార యాత్ర : పల్లా వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/దేవరకొండ :** దేశ సంపదను కొద్ది మంది కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ, సామాన్య ప్రజలపై ధరల భారం, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, సంక్షేమ పథకాల కోతలతో కేంద్ర ప్రభుత్వం ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక హక్కులను కూడా వ్యాపార వస్తువులుగా మార్చడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని, ప్రజల కష్టాలపై లాభాలు ఆర్జించే కార్పొరేట్ అనుకూల విధానాలను సిపిఐ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ఒత్తిడి తెచ్చే లక్ష్యంతో ఆగస్టు 06 నుండి ఆగస్టు 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలను ప్రచార యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, ప్రభుత్వ విద్యా, వైద్య రంగాల బలోపేతం, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళల భద్రత, కార్మిక, రైతు హక్కుల పరిరక్షణ, రాజ్యాంగం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ ప్రచార యాత్రలు సాగుతాయని తెలిపారు.
సిపిఐ జిల్లా క్యాదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుండి ప్రారంభం అయిన ప్రచార ఆందోళన నల్గొండ జిల్లా మునుగోడులో ప్రారంభమైందని దేవరకొండ నియోజకవర్గంలో 9వ తేది నుండి 12వ తేది వరకు ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. బిజెపి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశంలో మార్పు మొదలైందని విద్యార్థుల, రైతుల ఆందోళనలతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదని అన్నారు. త్వరలో కేంద్రంలో ప్రభుత్వ మార్పు జరగాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ప్రచార జాత పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకాచారి, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, మైనోద్దీన్, వెంకటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, జయరాములు, వెంకటేశ్వర్లు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ సిఎస్ దాన కిషోర్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని పుట్టపాక గ్రామాన్ని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా పచ్చదనంతో మౌలిక వసతులతో ఆదర్శంగా గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీరు పారిశుద్ధ్యం అంతర్గత రహదారులు డ్రైనేజ్ మొక్కల సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. స్వయం సహాయక బృందాలతో స్వయంగా మాట్లాడుతూ త్వరలో పుట్టపాకకు గవర్నర్‌ను తీసుకొస్తానని మహిళా సంఘాల సభ్యులకు హామీ ఇచ్చారు. అభివృద్ధి ప్రణాళిక పై గ్రామస్తులతో సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాలకు భవిష్యత్తులో ఏమైనా సహాయ సహకారాలు కావాలంటే డి ఆర్ డి ఏ ద్వారా సహాయాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పుట్టపాక స్వయం సహాయక బృందాలకు ఆరు కోట్ల రూపాయలు రుణం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కానుగుల యాదయ్య అనే రైతు ఏర్పాటు చేసుకున్న ఫామ్ ఫాండ్ ను ఆయన పరిశీలించారు. అనంతరం యాదయ్య ఏర్పాటు చేసిన చేపల కుంటలో ఆయన చేప పిల్లలు వదిలారు. అనంతరం స్థానికంగా ఉన్న చేనేత అవార్డు గ్రహీత గజం సత్యనారాయణ ఇంటికి వెళ్లి చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ కలెక్టర్ కే.సి.ప్రమీల, డిఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, జెడ్పిసిఈఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి కే శ్రీనివాస్ రెడ్డి, ఐకేపీ అడిషనల్ పిడి జంగారెడ్డి, డిఎల్పిఓ ప్రతాప్ నాయక్, స్థానిక ఎంపీడీవో ప్రమోద్ కుమార్, స్థానిక సర్పంచ్ ఆర్ఐ జుబేరుద్దీన్ ఉన్నారు.

## బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ..

### ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయండి : సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/సూర్యాపేట :** కేంద్రంలోని బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నేటి నుండి ఈనెల 14 వరకు జరుగు ప్రజాచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో కంబాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు అరికట్టడంలో విఫలమైందన్నారు. ధరల పెరుగుదల తక్షణమే ఆపాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని వాగ్దానం చేసి నేటికి అమలు చేయకపోవడం యువత నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరికి మెరుగైన విద్య, ఆరోగ్యం సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళలకు రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని వారు అన్నారు. భారత దేశ రైతాంగం పండించే పంటలకు మద్ధతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని రైతాంగాన్ని కాపాడాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కులను పరిరక్షించాలని వారు కోరారు. ఆయా మండలాల్లో ఉన్న సమస్యలను జోడించి జరిగే ప్రచార యాత్రలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉస్తెల నారాయణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్, ఎల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, దేవరం మల్లేశ్వరి, నంద్యాల రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు, మండల పట్టణ, కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఏర్పాటే జయశంకర్ జీవిత లక్ష్యం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ ఏర్పాటే తన జీవిత లక్ష్యంగా కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థి దశ నుండి చనిపోయే వరకూ తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లో నింపి అవగాహన కల్పించిన వ్యక్తి అని,4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన వారిలో ప్రొఫెసర్ జయశంకర్ ముందు వరుసలో ఉంటారన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నీళ్లు, నిధులు,నియామకాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పలు సందర్భాల్లో ప్రజలకు అవగాహన కల్పించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 70,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామని, మరో 7 వేల పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. గద్దర్ పాటల ద్వారా చైతన్యం తెచ్చారని, తెలంగాణ కోసం కృషి చేసిన వారిలో గద్దర్ ఒకరని,ఆయన తన పాటల ద్వారా ఊరూరా తిరుగుతూ ప్రజల్లో చైతన్యం కల్పించారని ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, ఆర్‌డిఒ వై. అశోక్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, మోహన్‌రెడ్డి ఉన్నారు.

## కార్మికులకు సమగ్ర చట్టాలు అమలులో ప్రభుత్వాలు విఫలం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో ఏఐటీయూసీ మండల సమితి సమావేశం పూలమోని శంకర్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ హాజరై మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు సమగ్ర చట్టాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్పులు చేస్తూ 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాట మారుతున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈనెల 25 వ తేదీన భువనగిరిలో జరిగే జిల్లా మూడవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షుడు చిలివేరు అంజయ్య, ఏఐటియుసి మండల కార్యదర్శి దుబ్బాక సంజీవ, జనగాం శంకరయ్య, ఉప్పరగొనిగిరి, శేఖర్, వెలుగు నరసింహ పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రికి వినతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** చేనేత కార్మికుల జీవనోపాధి పరిశ్రమ అభివృద్ధి కోసం హ్యాండ్లూమ్ మెగా క్లస్టర్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి పవిత్ర మార్గరీటకు పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షులు భారతి లవకుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. బుధవారం న్యూఢిల్లీలో భీమ్ హాల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో జరిగిన జిఐ బియాండ్ 2.0 సమ్మిట్‌లో కేంద్ర మంత్రి పవిత్రమార్గరీటా టెక్స్‌టైల్ సెక్రెటరీ మేడం నీలం షమీ రావు డెవలప్మెంట్ కమిషనర్ బి మీనా, హెచ్ఈపిసి అధికారులు టెక్స్టైల్ రంగం అధికారులు పలు దేశాల నుంచి ఇంపోర్టర్స్ ఇండియా నుంచి సప్లై చేసే ఉత్పత్తిదారులు పాల్గొన్న కార్యక్రమంలో ఆయన మంత్రితో కలిసి చేనేత పరిశ్రమ అభివృద్ధి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారాలు ప్రోత్సాహకుల గురించి వారితో చర్చించారు. భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొని పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమల తరఫున ఉపన్యాసించారు. పోచంపల్లి పరిశ్రమపై సుమారు 45 వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని వారికి జీవనోపాధి కొరకై భారత ప్రభుత్వం చేయాల్సిన కృషి కొరకు అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం చేయాల్సిన కృషి కొరకు సూచనలు చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ యాత్రలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మిర్యాలగూడ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుల నేతృత్వంలో ప్రచార యాత్రలు గురువారం ప్రారంభమయ్యాయి. మార్పు అత్యంత అవసరమనే నినాదంతో ఈ ప్రచార జాతాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నాయకులు ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో నిత్యావసర ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి యువకుడికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సార్వత్రిక విద్యను, వైద్యాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని, రైతు పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తూ చట్టబద్ధత తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు రామలింగం, యాదగిరి, ఉదయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జిల్లా కనకయ్య, మండల సమితి సభ్యులు గోగుల యాదగిరి, ప్రజానాట్యమండలి నాయకులు వెన్నెల వెంకన్న, మహిళా సమైక్య నాయకురాలు దాసర్ల దుర్గమ్మ, శాంతి, ఎస్కే షమీం, గువ్వల మట్టయ్య, జమ్ముల కోటయ్య, భాస్కర్ల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ పొలాల్లో దొంగల బీభత్సం

### రాత్రి వేళ్లలో పోలీసుల గస్తీ పెంచాలని అన్నదాతల డిమాండ్



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రమైన మేళ్లచెరువు గ్రామంలో వరుస దొంగతనాలతో స్థానిక రైతాంగాన్ని తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. వ్యవసాయ రంగమే జీవనాధారంగా బతుకుతున్న రైతులను లక్ష్యంగా చేసుకుని దొంగలు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. తాజాగా గ్రామానికి చెందిన బీమా ఉపేందర్ అనే రైతుకు చెందిన ట్రాక్టర్ దొంగల భారీన పడింది. రోజు వారి పనుల్లో భాగంగా ఆయన ట్రాక్టర్‌ను పొలంలోనే ఉంచి రాత్రి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఆ ట్రాక్టర్‌ను సంబంధించిన సామాగ్రి బ్యాటరీ సహ విలువైన వస్తువులను మొత్తాను దోచుకెళ్లారు. ప్రస్తుతం సాగుసీజన్ నడుస్తుండటంతో విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు కోసం ఇప్పటికే వేల రూపాయల పెట్టుబడి పెట్టిన తరుణంలో వరుస చోరీలతో కోలుకోలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడితే చాటు దొంగలు పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు, వైర్లు, స్టార్టర్ పెట్టెలను, ట్రాక్టర్ సామాన్లను దొంగలిస్తున్నారు. పోలీసుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో దొంగతనాల మహమ్మారి నుండి కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ భూముల పరిసరాలలో రాత్రి పూట పోలీస్ గస్తిని ముమ్మరం చేసి విద్యుత్ మోటార్లను, కాపర్ వైర్లను కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

### :కలెక్టర్ బి. చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా లో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన రోడ్డు భద్రత కమిటీ జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత చర్యలను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని చెప్పారు.జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత పోర్టల్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలని, గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద తక్షణ చర్యలు తీసుకొని ప్రమాదాల నివారణకు అవసరమైన ఇంజినీరింగ్ మార్పులు చేపట్టాలని సూచించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని జిల్లా కలెక్టర్ అన్నారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ బ్లాక్ స్పాట్లను సందర్శించి ప్రమాదాలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపకుండా వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలను గుర్తించాలని, మండల స్థాయిలో రహదారి ప్రమాదాలను తగ్గించడంలో తహశీల్దార్, మండల ఎస్.హెచ్.ఓలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రోడ్ సేఫ్టీ కమిటీ ద్వారా ఆక్రమణలను తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో రవాణా డిప్యూటీ కమిషనర్ వాణి, జిల్లా అధికారులు హాజరయ్యారు.

## రాజ్యాంగ విలువల పరిరక్షణే ధర్మ సమాజ్ పార్టీ లక్ష్యం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సామాజిక న్యాయం, సమాన హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ధర్మ సమాజ్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజు అన్నారు.నల్లగొండలో నూతనంగా ఏర్పాటు చేసిన ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం అమలవ్వాలంటే బలమైన ప్రజా ఉద్యమం అవసరం. డిఎస్‌సి ఆ ఉద్యమానికి నాంది. కుల, మత, ప్రాంత వివక్షలు లేకుండా అందరికీ సమాన అవకాశాలు రావాలనేదే మా పార్టీ సిద్ధాంతం అని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడే ధర్మ సమాజ్ పార్టీని గడప గడపకు తీసుకెళ్లాలి. ప్రతి నాయకుడు,కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడి ప్రజలకు న్యాయం చేయిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర యాదవ్, మల్గ యాదయ్య,బాబురావు నాయక్, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎల్లయ్య,జగన్,వంశీ,రవి,వినోద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

‘ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 14 వరకు జరుగు పాదయాత్రలు గురవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. పాదయాత్రలను సిపిఐ రాష్ట్ర నాయకులు ప్రారంభించి పాల్గొన్నారు. ’




### కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ

# రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** పెట్టుబడిదారులకనుగుణంగా, కార్పోరేట్ శక్తుల కనుసన్నల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలన కొనసాగుతుందని, ఆదానీ, అంబానీల మాయలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పడ్డాడని, ప్రజలకు సామాజిక న్యాయం లేదని, పేదల బ్రతుకులకు భద్రత కరువైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడానికి సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతను గురువారం కరీంనగర్ నగరంలోని పద్మనగర్ వద్ద చాడ వెంకటరెడ్డి సిపిఐ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామ గ్రామాన తెలియజేసేందుకు సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 14వరకు పాదయాత్రలు జరుగుతాయని తెలిపారు. దేశంలో పెరిగిపోతున్న ధరలను తక్షణమే అరికట్టాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం కల్పించాలని, కార్మికుల హక్కులు పరిరక్షించాలని, ప్రజలందరికీ సార్వత్రిక ఆరోగ్యం అందుబాటులోకి తేవాలని, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, మహిళా రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలని, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని ప్రధాన డిమాండ్లతో ఈ పాదయాత్రలు జరుగుతున్నాయని చాడ వెల్లడించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇవ్వాలని వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్,గూడెం లక్ష్మి, సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, పైడిపల్లి రాజు, బీర్ల పద్మ, కొట్టె అంజలి, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, మచ్చ రమేష్, బామండ్లపెల్లి యుగేందర్, నాయకులు పోలోజు రంజిత్, బాకం ఆంజనేయులు, చెంచల మురళి, కసిబొజుల సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

### దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం : భాగం

**ఖమ్మంరూరల్ :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజాస్వామ్యం ముప్పులో పడిందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర గురువారం ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడులో ఎర్రజెండాల రెపరెపలు, డప్పుల మోతలు, నినాదాల మధ్య ప్రారంభమైంది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో భాగం హేమంత్‌రావు మాట్లాడుతూ దేశంలో మార్పుకోసం సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఉద్యోగాల కల్పన విషయాన్ని మరిచిపోయిందన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, చట్టాలు కేవలం అంబానీ, అదానీల వంటి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే తీసుకొచ్చారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష, నియంతృత్వ విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కమ్యూనిస్టులు పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సిపిఐ జాతీయ పిలుపు మేరకు ఆగస్టు 6నుంచి 15 వరకు ప్రజా చైతన్యయాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, మొహ్మద్ సలాం, బిజీ క్లెమేట్, అజ్మీర రామ్మూర్తి, నాయకులు చిన్న వెంకట్‌రెడ్డి, పుచ్చకాయల సుధాకర్, ఉన్న రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, బానోత్ రాంకోటి, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, పగీళ్ల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను అంతమొందించాలి : కలవేణ

**శ్రీరాంపూర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలను అంతమొందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ బస్ స్టాండ్ వద్ద విద్యా, వైద్య, ఉపాధి హక్కుల సాధనకు సిపిఐ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రజాపోరు యాత్రను గురువారం ఆయన ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలవేణి శంకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశ విధానాలను ఎండగడుతూ, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పాదయాత్రలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పోరాట జాతాను ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ఆశీర్వదించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, రేగుంట చంద్రకళ, మిర్యాల రాజేశ్వరరావు, కొట్టే కిషన్ రావు, దొడ్డిపట్ల రవీందర్, పూజారి రామన్న, ఇలవేణి సారంగపాణి, కొత్తపల్లి మహేష్, మొగిలి లక్ష్మ ణ్, దేవి పోచన్న తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి : బాలనరసింహ్మా

**నాగర్‌కర్నూల్ :** ప్రజా సమస్యలపై పోరాటమే సిపిఐ లక్ష్యమని, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మా అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, ధరల పెరుగుదల, నిరుద్యోగం, సామాజిక అసమానతలపై ప్రజలను చైతన్యవంతం చేయాలనే ఉద్దేశ్యంలో సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు జిల్లాలోని బిజినపల్లి మండల కేంద్రంలో గురువారం పాదయాత్ర, ప్రచార యాత్రను బాలనరసింహ్మా ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.కేశవులు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, బిజినపల్లి మండల కార్యదర్శి కృష్ణాజి, తన్నీరు మల్లయ్య, మారేడు శివశంకర్, మధుగౌడ్, ప్రేమ్‌కుమార్, భూపేష్, నరసింహ, పర్వతాలు, శివకృష్ణ, రామస్వామి, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు కేంద్రంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆగస్టు 6 నుండి దేశవ్యాప్తంగా జరుగుతున్న సిపిఐ ప్రజా చైతన్య ప్రచార యాత్ర గురువారం మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్ గ్రామంలో అమరజీవి తండా రామచంద్రు స్తూపం నుంచి ప్రారంభమైంది. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారథిరెడ్డి, నాయకులు కట్లోజు పాండు రంగాచారి, తండ సందీప్, బానోత్ లింగ్య నాయక్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి, వరిపల్లి వెంకన్న, వీరవెల్లి రవి, మేక వీరన్న, మాలోథ్ రవీందర్, కే దాసు రమేష్, అజ్మీర వేణు, నక్క నాగార్జున, తండసతీష్, బానోత్ సుమన్, పబ్బతి మురళి, తేజావత్ వినయ్, బర్ల రాములు, ఏడెల్లి కృష్ణ, తండా శ్రీనాథ్, తండ శ్రీను, కళాకారులు రవీందర్, పులి యాకయ్య, రమేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

**మందమర్రి :** విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రాథమిక హక్కుల సాధన, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ చెన్నూరు నియోజకవర్గం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరు యాత్ర మందమర్రిలో ప్రారంభమైంది. మందమర్రి మార్కెట్‌లోని అమరజీవి అబ్రహం స్తూపం వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ ఎర్రజెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్లావ్ జరూరి హై మార్పు రావాలి అనే నినాదంతో ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకొని పోరాటాలు నిర్వహించడమే ఈ యాత్ర ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెద్దకొత్తపల్లి :** కేంద్రంలో రాష్ట్రంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న పాలనను ఎండగొట్టేందుకు సిపిఐ పాదయాత్రలు చేపట్టిందని నాగర్‌కర్నూల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్ఎండి.ఫయాజ్ అన్నారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో సిపిఐ పాదయాత్రను, నాగర్‌కర్నూల జిల్లా సిపిఐ కార్యదర్శి ఫయాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు నాగ్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు చేపట్టినట్టు తెలిపారు. ఆగస్టు 6న పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ప్రారంభమై ఆగస్టు 14న కొల్లాపూర్ పట్టణంలో పాదయాత్ర ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు టి.నరసింహ, ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి తప్పట కిరణ్‌కుమార్, బండి లక్ష్మీపతి, సిపిఐ పెద్దకొత్తపల్లి మండల్ ఇంచార్జి ఎం.లక్ష్మినారాయణ, కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**అలంపూర్ :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, సామాన్య ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని సిపిఐ జాతీయ నాయకురాలు సురవరం విజయలక్ష్మి విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండలం కంచిపాడులో గురువారం నిర్వహించాన సిపిఐ రాష్ట్ర వ్యాప్త పాదయాత్రను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురవరం విజయలక్ష్మి మాట్లాడుతూ మతం పేరుతో సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలను ప్రజలు అప్రమత్తంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సురవరం కపిల్, నాయకులు రవి, రంగన్న, ఆశన్న, నాగార్జున, భరత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

**కోరుట్ల :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలుపై పోరాటం కొనసాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం తెలిపారు సిపిఐ జాతీయ పిలుపుమేరకు గురువారం జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలో సిపిఐ ప్రచార యాత్ర ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామిల్ల రాంబాబు, కార్యక్రమంలో సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు భూమేశ్వర్, ఎత్తండి భూమయ్య, సుతారి రాములు, ఎండి ముక్రం, ఎన్నం రాధ, మునుగోరి హనుమంతు, ఎండి.ఉస్మాన్, గాధ దేవదాస్, పిట్టల నారాయణ, అందే వంశీకృష్ణ, ఎండి సమీర్ సుశీల, ప్రజానాట్యమండలి నాయకుడు చిట్యాల లక్ష్మిరాజం, పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కారించడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజా సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వాలు అధికారంలో కొనసాగే హక్కు లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విధానాలను నిరసిస్తూ సిపిఐ చేపట్టిన ప్రచార యాత్రను గురువారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని జగద్గిరిగుట్టలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం, మండల సహాయ కార్యదర్శులు హరినాథ్‌రావు, రాములు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నరసింహారెడ్డి, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, యువజన నాయకులు కీర్తి, శ్రీకాంత్, వంశీ, సిపిఐ . ప్రజాసంఘాల నాయకులు నరసయ్య, బక్కరి మల్లేష్, శ్రీనివాస్‌చారి, నగేష్ చారి, బాల నర్సయ్య, సాగర్, దీప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ మల్కాజిగిరి :** దేశ సంపదను కొద్ది మంది కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతూ సామాన్య ప్రజలపై ధరల భారం, నిరుద్యోగం, ప్రైవేటీకరణ, సంక్షేమ పథకాల కోతలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల జీవితాలనను సంక్షోభంలోకి నెట్టిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విఎస్ బోస్ అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో గురువారం ఎంఎంసి కాప్రా సర్కిల్ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి, కమలానగర్, కుషాయిగూడ వరకు కరపత్రాలను పంచుతూ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ, గిరిబాబు, వెంకటేష్, నర్సింగరావు, సుదర్శన్, మల్లేష్, విజయ్, సురేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్షులు ఎండి అజీం పాషా, సమీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్...


ఖమ్మం...


శ్రీరాంపూర్...


నాగర్‌కర్నూల్ జిల్లా...బిజినేపల్లి...


మేడ్చల్ మల్కాజిగిరి..ఉప్పల్...


మహబూబాబాద్...


పెద్దకొత్తపల్లి


మేడ్చల్...కుత్బుల్లాపూర్...


కోరుట్ల...


మందమర్రి...


అలంపూర్...


మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల నేపథ్యంలో పూణేలోని మహాత్మా జ్యోతి రావు నివసించిన ఇంటిలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నివాళులర్పిస్తున్న సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా




ఒడిషాలో సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న బద్లావ్ జరూరి హై పాదయాత్రలో పాల్గొన్న సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, నేతలు డాక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జయంత్ దాస్, రమణి రంజన్, దామోదర్ బెహ్రా, సురజెనా, సువేంద్ర ప్రతాప్ మహంతి తదితరులు


Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com